రెండు మహానగరాలు
రూ॥250/-
పేజీలు:245
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
PRAJAPAKSHAM సిటీ

విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయకపోతే దేశవ్యాప్త నిరసన
తృణమూల్‌కు మరో ఎదురుదెబ్బ **07**
నేడు కాంగ్రెస్ విస్తృత సమావేశం

సంపుటి 28, సంచిక: 347 | గురువారం | 11-06-2026 | హైదరాబాద్
Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar
పేజీలు: 12 | వెల రూ. 5.00




- రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ కార్యాలయాల ముట్టడి
- పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలని నిరసనలు
- ఖమ్మం, కరీంనగర్, వరంగల్ కలెక్టరేట్ల వద్ద ఉద్రిక్తత
- పోలీసులకు, సిపిఐ శ్రేణులకు మధ్య తోపులాటలు
- కరీంనగర్ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్‌కు గాయాలు
- మోదీ పాలన ఆర్థిక పతనం దిశగా పయనిస్తుంది: సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ధ్వజం







# ధరల పెరుగుదలపై సిపిఐ కన్నెర్ర




ప్రజాపక్షం/హైదరాబాద్

పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్‌తో పాటు నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలకు నిరసనగా భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) బుధవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట భారీ ఆందోళనలు నిర్వహించింది. కేంద్ర ప్రభుత్వం యుద్ధ పరిస్థితులను సాకుగా చూపి ప్రజలపై ధరల భారం మోపుతోందని ఆరోపిస్తూ చేపట్టిన ఈ కార్యక్రమంలో దాదాపు 15 వేల మంది పార్టీ శ్రేణులు, ప్రజలు పాల్గొన్నారు. పలుచోట్ల పోలీసులు కార్యకర్తలను అరెస్టు చేయగా, రాష్ట్రవ్యాప్తంగా ర్యాలీలు, ధర్నాలు, నిరసన సభలు ఉద్రిక్త వాతావరణంలో సాగాయి. ఖమ్మం, కొత్తగూడెంలో జరిగిన ఆందోళనల్లో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పాల్గొని కేంద్ర ప్రభుత్వ విధానాలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. హనుమకొండలో తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు, హైదరాబాద్‌లో ఇటి నరసింహ, కరీంనగర్‌లో చాడ వెంకట్‌రెడ్డి, మంచిర్యాలలో కలవేణ శంకర్, నాగర్‌కర్నూల్‌లో తరువాయి 3లో

# రంగారెడ్డి జిల్లా భూములకు విలువ ఎక్కువ

- ఒక ఎకరా రూ.200 కోట్లకు పైనే
- వాటి ముందు బంగారం కూడా బలాదూర్
- ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయం ప్రారంభోత్సవంలో
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- రాష్ట్ర ఆదాయంలో 60 శాతం సైబరాబాద్ నుంచే
- ఫ్యూచర్ సిటీ మన కోసమే కాదు ప్రపంచానికి





ప్రజాపక్షం/రంగారెడ్డి

బంగారం కంటే రంగారెడ్డి జిల్లా భూములకు విలువ ఎక్కువని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. బుధవారం ప్రజా పాలనా ప్రగతి నివేదిక కార్యక్రమంలో భాగంగా రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్ఖాన్ పేటలో నూతనంగా నిర్మించిన ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సిడిఎ)కార్యాలయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్,ఐటి పరిశ్రమల శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, శాసన మండలి ప్రభుత్వ ఛీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, వివిధ నియోజకవర్గాల ఎంఎల్‌ఎలు,కార్పొరేషన్‌ల చైర్మన్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఆనాడు నిజాంలు, కులీకుతుబ్ షాలు హైదరాబాద్‌ను సికింద్రాబాద్ నగరాన్ని విస్తరించడం వల్లే హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాలుగా గుర్తింపు వచ్చింది. ఆ తరువాత సైబరాబాద్‌ను అభివృద్ధి చేయడంతో వచ్చిన తరువాయి 8లో



2027 వేసవి నాటికి మేడిగడ్డకు

# మరమ్మతులు పూర్తిచేస్తాం

- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి
- ప్రాజెక్టు పునరుద్ధరణ కోసం జరుగుతున్న సాంకేతిక పనులు పరిశీలన
- మేడిగడ్డ కుంగడానికి లోప భూయిష్ట నిర్మాణమే కారణమని మండిపాటు

ప్రజాపక్షం/భూపాలపల్లి/మహాదేవపూర్

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మెడిగడ్డతో పాటు మూడు బ్యారేజీల పునరుద్ధరణ పనులను శాస్త్రీయ ప్రమాణాలతో చేపట్టి 2027 వేసవి నాటికి పూర్తిచేసి తిరిగి వినియోగంలోకి తీసుకువస్తామని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. బుధవారం మేడిగడ్డ ప్రాజెక్టు పునరుద్ధరణ కోసం జరుగుతున్న సాంకేతిక పరీక్షల పనులను పరిశీలించారు. అనంతరం అక్కడే అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడుతూ 2014 కంటే ముందే కాంగ్రెస్ ప్రభుత్వం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును 38 వేల కోట్లతో చేపట్టినట్లు తెలిపారు. దాదాపు 30 శాతం తరువాయి 8లో

# ‘ఎన్‌డిఎకు’ దేశమే ప్రధానం



- భారత్ రూపురేఖలు మార్చేశాం, ప్రపంచం మనవైపే చూస్తోంది
- ఎన్‌డిఎ కూటమి సమావేశంలో ప్రధాని మోదీ ఉద్ఘాటన
- ఎక్కువకాలం అధికారం ఇచ్చినందుకు ప్రజలకు కృతజ్ఞతలు
- ప్రధానమంత్రికి కేంద్రమంత్రివర్గ సమావేశం అభినందన

**న్యూఢిల్లీ:** ఎన్‌డిఎ ప్రభుత్వానికి అన్నింటికంటే దేశమే ముఖ్యంగానీ, సొంత కూటమి ముఖ్యం కాదని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అన్నారు. ఎన్‌డిఎ కూటమి దేశ పరిపాలనలో 12 సంవత్సరాలు పదవీకాలాన్ని పూర్తిచేసు కున్న సందర్భంగా బుధవారం ఆయన ఎన్‌డిఎ సమావేశంలో మాట్లాడారు. అత్యధికకాలం ప్రధానమంత్రి పదవిలో కొనసాగిన నాయకుడుగా నరేంద్రమోదీ రికార్డు సృష్టించిన నేపథ్యంలో అభినందన పూర్వకంగా ఈ సమావేశం జరిగింది. దేశ రాజకీయాలలో ఇవాళ చరిత్రాత్మకమైన రోజు అని ప్రధానమంత్రి చెప్పారు. ఎక్కువకాలం ప్రధాన మంత్రి పదవిలో కొనసాగేందుకు తనకు అవకాశం ఇచ్చిన దేశ ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఎన్‌డిఎ కూటమిలో ఉన్న అన్ని పార్టీలకు ఈ విజయం దక్కుతుందని చెప్పారు. దేశంలో గడచిన పుష్కర కాలంలో రైతుల జీవితాలను మెరుగుపరిచాం, వారి జీవితాల్లో పెనుమార్పులు తీసుకువచ్చాం, 25 కోట్ల తరువాయి 8లో



# మీనాక్షి నామినేషన్ తిరస్కృతి అత్యంత అభ్యంతరకరం

- ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించిన కాంగ్రెస్ ప్రతినిధి బృందం
- ఆర్‌ఒ ఉత్తర్వును రద్దు చేసి, తిరస్కరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని విజ్ఞప్తి

**న్యూఢిల్లీ :** రాజ్యసభ ఎన్నికల నిమిత్తం మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ అభ్యర్థి మీనాక్షి నటరాజన్ వేసిన నామినేషన్‌ను మంగళవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి తరస్కరించారు. దీంతో ప్రతిపక్ష పార్టీలు ఎన్నికల సంఘం, ప్రభుత్వంపై మండిపడ్డాయి. కక్షపూరితంగా ఈ చర్యకు పూనుకున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశాయి. అయితే ఈ వ్యవహారంపై బుధవారం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించింది. ఆ ఉత్తర్వు అత్యంత అభ్యంతరకరమైనదని, దానిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేసింది. కె.సి. వేణుగోపాల్, జైరాం రమేశ్, అభిషేక్ సింఘ్వీ, వివేక్ తంఖా, రణదీప్ సూర్జేవాలా, భూపేష్ బఘేల్, తరువాయి 8లో

# మోదీ భారత్‌కు బండరాయి

ప్రజాస్వామ్యం ఖూనీకి నాయకత్వం వహిస్తున్నారు : కాంగ్రెస్

**న్యూఢిల్లీ :** ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ విరుచుకుపడింది. ప్రధాని నరేంద్ర మోదీ స్వయం ప్రకటిత, సందేహాస్పదంగా కల్పించుకున్న ఒక మైలురాయిని దాటి ఉండవచ్చు కానీ, ఆయన భారతదేశానికి ఒక బండరాయిలాంటి వారని, ప్రజాస్వామ్యం ఖూనీకి సారథ్యం వహిస్తున్నారని తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించింది. భారతదేశంలో నిరంతరాయంగా అత్యధిక కాలం పనిచేసిన ఎన్నికైన ప్రధాన మంత్రిగా మోదీ నిలిచిన తరుణంలో ప్రతిపక్ష పార్టీ ఈ విమర్శలు చేసింది. ప్రపంచంలో అరుదుగా కనిపించే అద్భుతమైన మంత్రివర్గానికి సారథ్యం వహించి జవహర్‌లాల్ నెహ్రూ 1947 ఆగస్టు 15న భారత దేశ ప్రధానమంత్రి అయ్యారని కాంగ్రెస్ నాయకుడు జైరామ్ రమేశ్ అన్నారు. రాబోయే ఐదేళ్లలో ఆధునిక భారతదేశం ఆవిర్భవించిందని ఆయన ఎక్స్‌లో పేర్కొన్నారు. ‘560కి పైగా రాచరిక రాష్ట్రాలు శాంతియుతంగా భారత యూనియన్‌లో విలీనం చేయబడ్డాయి, భారత రాజ్యాంగంపై చర్చించి ఆమోదించారు, జమీందారీ వ్యవస్థను రద్దు చేశారు, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు రిజర్వేషన్లు కల్పించారు, అనేక బహుళార్థసాధక నీటిపారుదల, విద్యుత్ ప్రాజెక్టులను ప్రారంభించారు, సైన్స్, టెక్నాలజీ సామర్థ్యం కోసం మౌలిక సదుపాయాలను (అణుశక్తితో సహా) ఏర్పాటు తరువాయి 8లో






తమిళనాడు ముఖ్యమంత్రి, టివికె అధినేత సి. జోసెఫ్ విజయ్ బుధవారం ఢిల్లీలోని సిపిఐ ప్రధాన కార్యాలయమైన అజయ్ భవన్‌ను సందర్శించారు. సిపిఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా, జాతీయ కార్యదర్శి రామకృష్ణ పాండా, పార్టీ సీనియర్ నాయకులు పల్లబ్ సేన్‌గుప్తా, కె. నారాయణ ఆయనకు స్వాగతం పలికిన దృశ్యం.

# ఏడు రోజులు మోస్తరు వర్షాలు

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా రాగల ఏడు రోజుల పాటు తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ఈ మేరకు వాతావరణ కేంద్రం అధికారులు బుధవారం ఉదయం తాజా బులెటిన్‌ను విడుదల చేశారు. బుధవారం ఉదయం నుండి గురువారం ఉదయం వరకు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. ముఖ్యంగా వికారాబాద్, మహబూబ్‌నగర్, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. వచ్చే ఏడు రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా దాదాపు అన్ని జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే తరువాయి 8లో

# మళ్లీ గల్ఫ్‌లో కాల్పుల బీభత్సం

- కూలిపోయిన అమెరికా అపాచీ
- ఇరాన్‌లో 20 లక్ష్యాలపై సెంట్‌కామ్ దాడులు
- బహ్రైన్,కువైట్, జోర్డాన్‌లో అమెరికా స్థావరాలపై ఇరాన్ దాడులు



**దుబాయ్:** పశ్చిమాసియా మళ్ళీ రణరంగంగా మారింది. అమెరికా అపాచీ ఎహెచ్‌–64 హెలికాప్టర్ హోర్ముజ్ జలసంధిలో గస్తీ పనిలో ఉండగా ఇరాన్ కూల్చివేసిందని, దానికి ప్రతీకారం తీర్చుకుంటామని డోనాల్డ్ ట్రంప్ ప్రకటించిన కొద్ది గం టల వ్యవధిలోనే బుధవారం తెల్లవారకముదే పశ్చిమాసియాలో భీకర దాడులు జరిగాయి. ఇరాన్‌లో 20 లక్ష్యాలపై అమెరికా సైన్యం దాడులు చేసి తమ లక్ష్యాలను పూర్తిచేసినట్లు సెంట్‌కామ్ అధికారులు బుధవారం ప్రకటించారు. అదేసమయంలో ఇరాన్ కూడా బుధవారం తెల్లవారకముందుగానే అమెరికా ఫిఫ్త్ ఫ్లీట్‌పై దాడులు చేసింది. బహ్రైన్, జోర్డాన్, కువైట్‌లలో ఉన్న అమెరికా గగనతల స్థావరాలపై డ్రోన్లు, క్షిపణి దాడులతో బీభత్సం సృష్టించింది. అమెరికాకు చెందిన 21 లక్ష్యాలపై దాడులు చేశామని, వీటిల్లో నాలుగు లక్ష్యాలను ధ్వంసం చేశామని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్‌జిసి) ప్రకటించింది. ఈ పరస్పర దాడులు పశ్చిమాసియాను కుదిపేశాయి. చర్చల్లో జాప్యానికి మూల్యం చెల్లించాలని ట్రంప్ సోషల్ మీడియా ద్వారా హెచ్చరించగా, “ఈ సరికొత్త దాడులకు తరువాయి 8లో

# 'ఇండియా' కూటమి పునరుజ్జీవం

గత లోక్‌సభ ఎన్నికలకు ముందు, బిజెపిని ఓడించే ఏకైక ప్రయోజనంతో ఏర్పడిన ప్రతిపక్షపార్టీల కూటమి 'ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంటల్ ఇన్‌క్లూజివ్ అలయెన్స్' (సంక్షిప్తంగా 'ఇండియా' కూటమి) ఆ ఎన్నికల్లో లక్ష్యాన్ని సాధించలేకపోయినా బిజెపిని మైనారిటీలో (543 లోక్‌సభ సీట్లలో 240) పడేసింది. అయితే ఆ తదుపరి ప్రధానంగా పార్లమెంటులో సమస్యలకే పరిమితమైంది. అదొక ఫ్రంట్ కాదు. బోలు కూటమి. వ్యవస్థాగత నిర్మాణం లేదు. సమష్టి లేదా వ్యష్టి నాయకత్వం లేదు. కాంగ్రెస్ దేశవ్యాప్త అస్తిత్వం ఉన్న పార్టీ, పార్లమెంటులో ప్రతిపక్షంలో పెద్ద పార్టీ అయినందున అది కూటమి నాయకురాలు అనుకోవటం తప్ప అది వాస్తవం కాదు. అంతేగాక కొన్ని రాష్ట్రాల్లో కాంగ్రెస్‌కు, కూటమి భాగస్వాములుగా ఉన్న ప్రాంతీయ పార్టీలకు మధ్య వైరుధ్యం, ఘర్షణ ఉంది. రాష్ట్రంలో తమది పెద్ద పార్టీ అనే పేరుతో కాంగ్రెస్‌ను తక్కువచేసి తమ ఆధిక్యతను స్థిరపరుచుకునేందుకు కొన్ని ప్రాంతీయ పార్టీల ప్రయత్నం కూడా కాంగ్రెస్‌తో ఘర్షణకు హేతువైంది. వామపక్షాలను అణచివేసే ధోరణి అన్ని పార్టీల్లోనూ ఉంది. అందువల్ల అదొక కలగూరగంపగా కనిపిస్తుంది. ఆ విధంగానే బిజెపి అవహేళన చేస్తూ తాను లబ్ధిపొందటానికి ప్రయత్నిస్తుంటుంది.

'ఇండియా' కూటమి గత రెండు సంవత్సరాల్లో కేవలం పార్లమెంటరీ సమన్వయ కూటమిగానే పనిచేసింది. ఈ కాలంలో జరిగిన హర్యానా, మహారాష్ట్ర, ఢిల్లీ, కేరళ, తమిళనాడు, పశ్చిమబెంగాల్, అస్సాం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి భాగస్వాములది దాదాపు ఒంటరి పోరాటమే. తమిళనాడు మినహా బిజెపిదే పైచేయి అయింది. తమిళనాడులో మరో ప్రాంతీయ పార్టీ అధికారంలోకి వచ్చింది. అయితే డిఎంకె కూటమిలోని కాంగ్రెస్ మర్యాదకోసమైనా తమతో చెప్పకుండా ఆ పార్టీ ప్రభుత్వంలో చేరటాన్ని 'ద్రోహం'గా పరిగణించిన డిఎంకె ఇండియా కూటమినుంచి వైదొలిగింది. తనకు ఎదురులేదనుకున్న మమతా బెనర్జీ నుంచి పశ్చిమ బెంగాల్‌లో అధికారాన్ని బిజెపి గుంజుకుంది. కొద్ది రోజులకే టిఎంసి ముక్కచెక్కలైంది. 80మంది ఎమ్మెల్యేల్లో 58మంది తిరుగుబాటుచేసి అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుని స్థానం పొందారు. తాజాగా, 28మంది లోక్‌సభ సభ్యుల్లో 20మంది ప్రత్యేక గ్రూపుగా ఏర్పడి ఎన్‌డిఎను బలపరుస్తున్నారు. రాజ్యసభ సభ్యులిరువురు ఇప్పటికే పార్టీకి, సభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఇక జిల్లాల్లో పోలీసుల వేధింపులు, కేసులు, బిజెపివారి దాడులు తదితర కారణాలతో ఎందరో పార్టీని వీడుతున్నారు.

ఇండియా కూటమిలో కాంగ్రెస్ తదుపరి పెద్ద పార్టీలైన డిఎంకె, తృణమూల్ కాంగ్రెస్‌లు ఎన్నికల్లో ఓడిపోవటంతో ఇక తమ బాట రహదారి అనే రీతిలో బిజెపి ఖుషీ అవుతున్న దశలో , తమలోని నిస్తేజాన్ని, అనైక్యతను వదిలించుకుని ఒక్కటిగా వ్యవహరించాలన్న జాగరూకత ఇండియా కూటమి భాగస్వాముల్లో మేల్కొంది. దాని పర్యవసానమే ఈనెల 8వ తేదీన ఢిల్లీలో జరిగిన కూటమి సమావేశం. సమావేశానికి ముందు కాంగ్రెస్‌పై కొన్ని విమర్శలు వినిపించినా కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ప్రాతినిధ్యం కలిగిన 23 పార్టీలు హాజరుకావటం విశేషం. కూటమినుంచి స్థానిక రాజకీయ వైరుధ్యాలతో వైదొలిగిన ఆప్, డిఎంకె హాజరు కాకపోయినా, ప్రజా సమస్యలపై పార్లమెంటులో మిగతా పార్టీలతో సమన్వయం చేసుకుంటామని చెప్పటం శుభసూచకం.

ప్రతి రెండు నెలలకు ఒకసారి సమావేశం కావాలని ఢిల్లీ సమావేశం నిర్ణయించటం కూటమిని క్రియాశీల మొనర్చుతుంది. భిన్నాభిప్రాయాలను అరమరికలు లేకుండా ఎప్పటికప్పుడు చర్చించుకునే అవకాశం కలుగు తుంది. అట్టి తొలి సమావేశం ఆగస్టు మొదటివారంలో హైదరాబాద్‌లో జరుగుతుంది. ఏకీకృత కార్యాచరణ నిమిత్తం ఐదు అంశాలను నిర్ణయించినట్లు న్యూఢిల్లీ సమావేశానికి అధ్యక్షత వహించిన కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ప్రకటించారు. ఒకటి, ఓటర్ల జాబితాల సవరణలో అవకతవకలు (ఎస్ఐఆర్), 'ఓటు చోరీ'పై తమ ఆందోళనలను వ్యక్తం చేస్తూ ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు లేఖరాయటం (తాజాగా, మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణతో సీట్ చోరీ తోడైంది). రెండు, నీట్, సిబిఎస్ఇ పరీక్షల నిర్వహణలో వైఫల్యానికి బాధ్యత వహించి విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను డిమాండ్ చేస్తూ తీర్మానం. ఇదే డిమాండ్‌తో కాక్రోచ్ జనతాపార్టీ దేశవ్యాప్త ఆందోళనకు సిద్ధమవుతున్నది. మూడు, ద్రవ్యోల్బణం, ధరల పెరుగుదల, నిరుద్యోగం, వ్యవసాయరంగం దుస్థితి సహా దేశంలోని ప్రస్తుత క్లిష్ట ఆర్థిక పరిస్థితిపై చర్చించేందుకు అఖిలపక్ష సమావేశాన్ని పిలవాలని ప్రధాని నరేంద్రమోదీకి విజ్ఞప్తి. నాలుగు, రెండు నెలలకొకసారి కూటమి సమన్వయ సమావేశాలు. ఐదు, పార్లమెంటు సమావేశాలు జరిగేటప్పుడు కూటమి భాగస్వాముల రోజువారీ సమన్వయ సమావేశాల నిర్వహణ.

మోదీ ప్రభుత్వం డిఎంకె ఇండియా కూటమికి దూరం కావటం, టిఎంసి ఎంపిల్లో భారీ చీలిక, ఆప్ రాజ్యసభ ఎంపిలు అరడజనుమంది బిజెపిలో చేరటం వంటి పరిణామాలతో ఉత్సాహం పొంది, పార్లమెంటులో ఓడిపోయిన డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ అమలు లింక్ బిల్లులను మళ్లీ ప్రవేశపెట్టాలని, ఒక దేశం – ఒకే ఎన్నికలు బిల్లును తీసుకురావాలని ఆలోచిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. పశ్చిమాసియా సంక్షోభంతో ఆయిలు, గ్యాస్ ధరలు, నిత్యావసరాల ధరలు పెరిగి, రవాణా ఛార్జీలు పెరిగి ప్రజలు అల్లాడుతుంటే, వాటినుంచి దృష్టి మళ్లించేందుకు మోదీ ప్రభుత్వం ఇతరేతర అంశాలను ప్రచారంలో పెడుతున్నది. ప్రభుత్వ వైఫల్యాలపై ఏకోన్ముఖ పోరాటానికి ప్రజల్ని సమాయత్తం చేసేందుకు ఇండియా కూటమి నడుం కట్టటం ఆహ్వానించదగింది. ఒకరిద్దరు కన్వీనర్‌లతో కొద్దిమందితో ఒక సమన్వయ కమిటీ ఏర్పాటు కూటమిని ఒక సంస్థగా క్రియాశీల మొనర్చుతుంది.



## రాష్ట్ర హోదా హామీ నెరవేరుస్తామని మోదీ చెప్పారు

**జమ్ముకశ్మీర్‌కు రాష్ట్ర హోదా ఇస్తామన్న వాగ్దానాన్ని నెరవేరుస్తానని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. కేంద్రం తన వాగ్దానాన్ని నెరవేర్చడం కోసం ఎదురు చూస్తున్నాం. మా పార్టీ కేవలం కార్య నిర్వహణ నియమాలనే కాకుండా రాష్ట్ర హోదా పునరుద్ధరణను కూడా కోరుకుంటోంది. రాష్ట్ర హోదా అనేది ప్రపంచం ముందు వారు ఇచ్చిన వాగ్దానం. రాష్ట్ర హోదా పునరుద్ధరణ డిమాండ్‌కు మద్దతుగా పార్లమెంట్ వర్షాకాల సమావేశాల మొదటి రోజున ఢిల్లీలో నిరసన చేపడతాం.**

- జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా



# ఎఐ డేటా సెంటర్ల విస్తరణ : సవాళ్లు

ప్రస్తుత ప్రపంచంలో కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఏఐ) మౌలిక సదుపాయాలు కూడా రహదార్లు, ఓడరేవుల వంటి వ్యూహాత్మక జాతీయ ఆస్తులుగా మారుతున్నాయి. ఇటీవల విడుదలైన ఒక నివేదిక ప్రకారం, వచ్చే ఐదేళ్లలో భారత్‌లోని డేటాసెంటర్లలో దాదాపు 7లక్షల గ్రాఫిక్స్ ప్రాసెసింగ్ యూనిట్లను (జిపియులు) మోహరించే అవకాశం ఉంది. ఇది దాదాపు $23 బిలియన్ల పెట్టుబడి అవకాశాన్ని సృష్టి స్తుంది.

**ప్రయోజనాలు:** దేశంలో ఏఐ స్వీకరణ, డేటా సెంటర్ల విస్తరణ అనేది ఒక భారీ ఆర్థిక అవకాశాన్ని తెరిచింది. 2025లో 1.6 గిగావాట్లు (జీడబ్ల్యూ)గా ఉన్న భారత్ యొక్క నిర్మిత డేటా సెంటర్ సామర్థ్యం, 2030 నాటికి దాదాపు 5 జీడబ్ల్యూకు చేరుకుంటుందని అంచనా. దీని వలన దాదాపు $ 25 బిలియన్ల మూలధన పెట్టుబడి అవసరమవుతుంది. 2024లో $10 బిలియన్లుగా ఉన్న భారతదేశపు ఏఐ మార్కెట్, 39 శాతం సమ్మేళన వార్షిక వృద్ధి రేటు (సిఎజిఆర్)తో 2032 నాటికి $131 బిలియన్లకు చేరుకుంటుందని భావిస్తున్నారు. ఇతర అంచనాల ప్రకారం, కృత్రిమ మేధ భారత ఆర్థిక వ్యవస్థకు 2035 నాటికి $1.7 ట్రిలియన్లను జోడించగలదని ప్రభుత్వ అంచనా. ప్రస్తుతం భారతదేశపు టెక్నాలజీ రంగంలో 60లక్షల మందికి పైగా ఉపాధి పొందు తున్నారు. గత పార్లమెంట్ సమావేశాల్లో ప్రభుత్వం వెల్లడించిన వివరాల ప్రకారం, 2024 లో ప్రారంభించిన 'ఇండియా ఏఐ మిషన్' కింద ఇప్పటికే సుమారు 38,231 జిపియులు ఏర్పాటు చేయబడ్డాయి. ఈ జిపియులు భారతీయ స్టార్టప్‌లు మరియు అకాడెమియాకు తక్కువ ఖర్చుతో అందుబాటులో ఉంచబడుతున్నాయి. ఇది కొత్త రకాల ఉద్యోగాల సృష్టికి అలాగే దేశీయపరిశోధనలను ప్రోత్సహించడానికి దోహదపడుతుంది.

ఏఐ యుగంలో జిపియులు పారిశ్రామిక యంత్రాలతో సమానంగా మారుతున్నాయి. పెద్ద ఎత్తున కంప్యూటింగ్ మౌలిక సదుపాయాలకు లభ్యత కలిగిన దేశాలు ఏఐ మోడల్ డెవలప్మెంట్, డిఫెన్స్ టెక్నాలజీలు అలాగే ఎంటర్‌ప్రైజ్ ఆటోమేషన్‌లో అసమాన ప్రయోజనాలను పొందగలవు. అదే సమయంలో, ప్రతి మౌలిక సదుపాయాల విస్తరణ వలె, ఏఐ డేటా సెంటర్లకు కూడా తీవ్రమైన సవాళ్లు ఉన్నాయి.

**నష్టాలు&సవాళ్లు:** ఏఐ డేటా సెంటర్లు చాలా ఎక్కువ విద్యుత్తును వినియోగించుకుంటాయి. 2030 నాటికి భారతదేశంలో డేటా సెంటర్ లోడ్ 1.2 జీడబ్ల్యూ నుండి 4.5 జీడబ్ల్యూకు అవసరమవు తుందని, ఏఐడ్రివెన్ ఫెసిలిటీలు మాత్రమే సంవత్సరానికి అదనం గా 4050 టెరావాట్‌గంటల (టిడబ్ల్యూహెచ్) విద్యుత్తును వినియోగించగలవని అంచనా. డేటా సెంటర్లు 2030 నాటికి భారతదేశం మొత్తం విద్యుత్ ఉత్పత్తిలో దాదాపు 5 శాతాన్ని వినియోగిస్తాయని నివేదికలు హెచ్చరిస్తున్నాయి. దాదాపు 13.5 జిడబ్ల్యూ వరకు ఎలక్ట్రిసిటీ డిమాండ్‌ను చేరుకోవచ్చు. ప్రస్తుత ఎలక్ట్రిసిటీ గ్రిడ్ పై ఈ ఒత్తిడి, భారీ స్థాయి విద్యుత్ కోతలకు లేదా వోల్టేజ్ అస్థిరతకు కారణం కావచ్చు. డేటా సెంటర్లు అధిక ఉష్ణోగ్రతను నియంత్రించుకోవడానికి భారీ మొత్తంలో నీటిని ఉపయోగిస్తాయి. 2024లో భారతదేశపు డేటా సెంటర్లు సుమారు 150 బిలియన్ లీటర్ల నీటిని వినియోగించుకున్నాయి, అలాగే 2030 నాటికి ఈ సంఖ్య 358 బిలియన్ లీటర్ల కు దాదాపు రెట్టింపు లేదా మూడు రెట్లు అవుతుంది. ఇప్పటికే తీవ్ర నీటి కొరతను ఎదుర్కొంటున్న భారతదేశంలో, ఇది స్థానిక జలాశయాలను మరింత దెబ్బతీస్తుంది. పెద్ద నగరాల్లో డేటా సెంటర్లు కేంద్రీకృతమై ఉండటం వలన ఈ నీటి సంక్షోభం మరింత తీవ్రమవుతుంది.

**డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్,**
ramkishore.1504@gmail.com

# మణిపూర్‌కు కొత్తగా ఎన్నికయ్యే సర్కార్ అవసరం

**పల్లభ్ సేన్ గుప్తా**

మణిపూర్ ఇంకా రక్తం ఓడుతూనే ఉంది. ఇది తక్షణమే ఆగిపోవాలి. రాష్ట్రంలో హింస చెలరేగి మూడేళ్లకు పైగా గడుస్తున్నా, గాయాలు ఇంకా పచ్చిగా, లోతుగానే ఉన్నాయి. హత్యలు, బలవంతపు వసూళ్లు, సాయుధ దాడులు, కిడ్నాపులు, ఇళ్లు, ఆస్తుల ధ్వంసం, వేలాది మందిని బలవంతంగా నిర్వాసితులను చేయడం వంటివి సాధారణ ప్రజల జీవితాలను ఇప్పటికీ ఛిన్నాభిన్నం చేస్తూనే ఉన్నాయి. కుటుంబాలు విడిపోయాయి, వర్గాలు వేరుపడ్డాయి, ఒక తరం భయం, అనిశ్చితి, మానసిక క్షోభల మధ్య బతకాల్సిన పరిస్థితి నెలకొంది. వేలాది మంది ఇప్పటికీ తమ ఇళ్లకు తిరిగి వెళ్లలేక, సహాయక శిబిరాల్లో లేదా నిరంతర అభద్రతాభావం మధ్య, సాధారణ స్థితి వస్తుందనే ఆశ లేకుండా జీవిస్తున్నారు.

మణిపూర్‌లో కొనసాగుతున్న ఈ విషాదం నేడు భారత యూనియన్ ఎదుర్కొంటున్న అత్యంత తీవ్రమైన మానవీయ, రాజకీయ సంక్షోభాలలో ఒకటిగా నిలుస్తుంది. ఇది మణిపూర్‌లోని ప్రస్తుత ప్రభుత్వ పూర్తి వైఫల్యానికి, అలాగే శాంతిని పునరుద్ధరించేందుకు, విశ్వాసాన్ని పునర్నిర్మించటానికి, ప్రజలందరికీ న్యాయం, భద్రతను కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం అసమర్థతకు నిదర్శనం.

జాతి, మతం, ప్రాంతం లేదా వర్గాలతో సంబంధం లేకుండా మణిపూర్ ప్రజలు ఈ సుదీర్ఘ సంఘర్షణ కారణంగా తీవ్రంగా నష్టపోయారు. ఈ విషాదం సమాజంలోని ఏదో ఒక వర్గానికి మాత్రమే పరిమితం కాలేదు. మైతీలు, కుకీలు, నాగాలతో పాటు ఇతర వర్గాల వారు కూడా హింస, భయం, నిర్వాసితులు కావడం వంటి పర్యవసానాలను అనుభవించారు. కుటుంబాలు తమకు ఆప్తులైన వారిని కోల్పోయాయి, జీవనోపాధి దెబ్బతిన్నది. విద్యా కార్యకలాపాలు చెల్లాచెదురైపోయాయి. తరాల తరబడి ఎంతో శ్రమతో నిర్మించుకున్న సామాజిక సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి.

తమ పౌరులకు భద్రతను కల్పించటం, చట్టబద్ధమైన పాలనను కాపాడటం బిజెపి ప్రభుత్వ ప్రథమ బాధ్యత. ఈ విషయంలో ప్రస్తుత బిజెపి ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. పలుమార్లు హామీలు ఇచ్చినప్పటికీ, పలు ప్రాంతాల్లో సాయుధ ముఠాలు యథేచ్ఛగా తమ కార్యకలాపాలు సాగిస్తున్నాయి. బలవంతపు వసూళ్లు విస్తృతంగా మారి సాధారణ పౌరులు, వ్యాపారులు, ట్రాన్స్‌పోర్టర్లు, ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపార సంస్థలను ప్రభావితం చేస్తున్నాయి. హత్యలు, దాడుల సంఘటనలు నిరంతరం జరుగుతుండటంతో భయం, అవిశ్వాస వాతావరణం నెలకొంది. పరిస్థితిని సమర్థవంతంగా అదుపు చేయడంలో అధికారులు విఫలం కావడంతో ప్రభుత్వం, దాని వ్యవస్థలపై ప్రజల్లో నమ్మకం సడలింది.

ఉగ్రవాద సంస్థలతో కుదుర్చుకున్న సస్పెన్షన్ ఆఫ్ ఆపరేషన్స్ (ఎస్ఓఒ) ఒప్పందాలు అనేవి ప్రధానమైన ఆందోళనల్లో ఒకటి. హింసను తగ్గించి, శాంతి, చర్చలకు అనుకూలమైన పరిస్థితులను సృష్టించడమే ఇలాంటి ఏర్పాట్ల ఉద్దేశం. అయితే, ఇటీవలి సంవత్సరాల అనుభవం వాటి అమలు, ప్రభావంపై తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తింది. ప్రస్తుతం కొనసాగుతున్న పరిస్థితి సాయుధ సమీకరణలు, హింస కొనసాగుతున్నాయని సూచిస్తోంది. కాబట్టి సస్పెన్షన్ ఆఫ్ ఆపరేషన్స్ ఒప్పందాల మొత్తం నిబంధనలపై సమగ్రమైన సమీక్ష అత్యంత అత్యవసరం.

అదే సమయంలో భారతదేశం, మయన్మార్ మధ్య బలహీనమైన, విస్తృతంగా తెరిచి ఉన్న సరిహద్దుల వల్ల సవాళ్లు ఎదురవుతున్నాయి. మయన్మార్‌లోని రాజకీయ అస్థిరత, సాయుధ ఘర్షణలు సరిహద్దు ప్రాంతాలపై ప్రత్యక్ష ప్రభావం చూపాయి. సాయుధ శక్తుల కదలికలు, ఆయుధాల అక్రమ రవాణా, మాదకద్రవ్యాలు, ఇతర చట్ట విరుద్ధ కార్యకలాపాలు మణిపూర్‌లో, విస్తృత ఈశాన్య ప్రాంతంలో భద్రతా పరిస్థితిని మరింత క్లిష్టతరం చేశాయి. అంతర్గత పరిస్థితిని బాహ్య శక్తులు మరింత దిగజార్చకుండా నిరోధించడానికి సమర్థవంతమైన సరిహద్దు నిర్వహణ, హెచ్చించిన నిఘా, సంబంధిత అధికారుల సమన్వయ చర్యలు అవసరం.

అయితే, మణిపూర్ సంక్షోభాన్ని కేవలం శాంతిభద్రతల సమస్యగా చూడలేమని సిపిఐ గట్టిగా విశ్వసిస్తోంది. కేవలం భద్రతా చర్యల ద్వారానే శాశ్వత శాంతిని స్థాపించలేము. ఈ రాష్ట్రానికి అన్ని వర్గాల మధ్య చర్చలు, సయోధ్య, న్యాయం, పరస్పర గౌరవం ఆధారంగా ఒక రాజకీయ పరిష్కారం అవసరం. హింస వల్ల ఏర్పడిన గాయాలు చాలా లోతైనవి, వీటిని నయం చేయడానికి నిరంతర ప్రయత్నాలు అవసరం. వర్గాల మధ్య నమ్మకాన్ని పునరుద్ధరించడం అనేది ఏ శాంతి ప్రక్రియకైనా ప్రధాన లక్ష్యం కావాలి.



ఇటీవల మణిపూర్ రాష్ట్ర సమితి సమావేశంలో మాట్లాడుతున్న పల్లభ్‌సేన్‌గుప్తా

దురదృష్టవశాత్తూ, ప్రస్తుత బిజెపి ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రజల విశ్వాసాన్ని కోల్పోయింది. నిష్పక్షపాతంగా, సమర్థవంతమైన అధికార సంస్థగా వ్యవహరించడంలో అది విఫలం కావడంతో విభేదాలు, అవిశ్వాసం మరింత పెరిగాయి. ప్రజా విశ్వాసం లేని ప్రభుత్వం సయోధ్య ప్రక్రియను విజయవంతంగా ముందుకు తీసుకెళ్లలేదు.

ఈ నేపథ్యంలో 2026 జూన్ 5,6 తేదీలలో జరిగిన భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) మణిపూర్ రాష్ట్ర సమితి సమావేశం ఒక ముఖ్యమైన రాజకీయ పరిణామం. ప్రస్తుత పరిస్థితిపై సమగ్ర సమీక్ష తర్వాత, ప్రజల ప్రాణాలు, ఆస్తులు, భద్రతను పరిరక్షించడంలో ప్రస్తుత ప్రభుత్వం తన రాజ్యాంగ బాధ్యతలను నిర్వర్తించడంలో పూర్తిగా విఫలమైందని రాష్ట్ర సమితి నిర్ధారించింది. సుదీర్ఘమైన కేంద్ర జోక్యం, పదేపదే ఇచ్చిన హామీల తర్వాత కూడా హత్యలు, బలవంతపు వసూళ్లు, సాయుధ కార్యకలాపాలు, నిర్వాసితులు కావడం నిరంతరాయంగా కొనసాగుతున్నాయని ఈ సమావేశం గుర్తించింది. ప్రభుత్వం పెద్ద సంఖ్యలో ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని, రాష్ట్రాన్ని శాంతి, సయోధ్య వైపు నడిపించగల విశ్వసనీయమైన, నిష్పక్షపాత అధికార సంస్థగా వ్యవహరించే స్థితిలో ఇక ఎంతమాత్రం లేదని రాష్ట్ర సమితి అభిప్రాయపడింది. కాబట్టి ప్రస్తుత ప్రభుత్వం వెంటనే రాజీనామా చేయాలని సిపిఐ మణిపూర్ రాష్ట్ర సమితి డిమాండ్ చేసింది. అన్ని వర్గాల విశ్వాసాన్ని చూరగొనగలిగిన, ప్రజల్లో విశ్వాసాన్ని పునరుద్ధరించగలిగిన, మణిపూర్ ఐక్యత, ప్రాదేశిక సమగ్రతను కాపాడే లక్ష్యంతో సమగ్ర చర్చలు, సయోధ్య ప్రక్రియను ప్రారంభించగల కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చింది.

నిష్పక్షిక పాలన, ప్రజాస్వామ్య సంప్రదింపులు, సమగ్ర చర్చలకు కట్టుబడే ప్రభుత్వం ఏర్పడాలని సిపిఐ పిలుపునిస్తోంది. అలాంటి ప్రభుత్వం అన్ని వర్గాల మధ్య విశ్వాసాన్ని పెంపొందించే చర్యలను ప్రారంభించాలి. నిర్వాసితులైన వ్యక్తులు సురక్షితంగా తిరిగి రావడానికి, వారికి పునరావాసం కల్పించడానికి చర్యలు తీసుకోవాలి. హింస బాధితులకు న్యాయం చేకూర్చాలి. సాయుధ ముఠాలు, వసూళ్ల నెట్‌వర్క్‌ల కార్యకలాపాలను గట్టిగా అణచివేయాలి. సహాయక, పునరావాస ప్రయత్నాలను బలోపేతం చేయాలి. జాతుల వివక్ష లేకుండా నష్టపోయిన వారందరికీ తగిన పరిహారం అందించాలి.

మణిపూర్‌లో కొనసాగుతున్న అస్థిరత కేవలం ఒక రాష్ట్ర సమస్య మాత్రమే కాదు. ఇది దేశం మొత్తానికి సంబంధించిన సవాలు. అన్ని జాతీయ రాజకీయ పార్టీలు, ప్రజాస్వామ్య శక్తులు ఈ సంక్షోభాన్ని దానికి తగిన తీవ్రతతో పరిగణించాలి. సుదీర్ఘమైన హింస, నిర్వాసితులను చేయడం, సాధారణ పౌర జీవితం స్తంభించిపోవడం మణిపూర్ ప్రజలకు అపారమైన బాధను కలిగించడమే కాకుండా, జాతీయ సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రత, ప్రజాస్వామ్య సంస్థల అధికారంపై తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. తన భూభాగంలో ఒక భాగం ఇంత సుదీర్ఘకాలం పాటు అభద్రత, సాయుధ ఘర్షణలు, తీవ్రమైన సామాజిక విచ్ఛిన్నతను ఎదుర్కొంటున్నప్పుడు ఏ దేశమూ ఉదాసీనం గా ఉండలేదు.

ఈ సంక్షోభం కొనసాగే ప్రతి రోజూ ప్రజల గాయాలను మరింత లోతు చేస్తుంది. ప్రజాస్వామ్య పాలనపై ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని బలహీనపరుస్తుంది. గణతంత్ర పునాది అయిన భిన్నత్వంలో ఏకత్వం అనే ఆదర్శాలను దెబ్బతీస్తుంది. కాబట్టి మణిపూర్‌లో శాంతి, న్యాయం,సాధారణ స్థితిని పునరుద్ధరించడం కేవలం మానవతా దృక్పథంతో కూడిన విధి మాత్రమే కాదు, అదొక జాతీయ బాధ్యత. మణిపూర్ రక్తం ఓడుతుంటే దేశం చూస్తూ ఊరుకోలేదు. గాయాలను నయం చేయడానికి, అన్ని వర్గాల మధ్య విశ్వాసాన్ని పునరుద్ధరించడానికి, భారతదేశ ఐక్యత, సమగ్రతను కాపాడటానికి అత్యవసరమైన, నిజాయితీతో కూడిన నిర్ణయాత్మక చర్యలు అవసరం.

శాంతి, భద్రత, గౌరవం, ప్రజాస్వామ్య హక్కుల కోసం మణిపూర్ ప్రజలు చేస్తున్న పోరాటంలో భారతకమ్యూనిస్టు పార్టీ వారికి అండగా నిలుస్తుంది. ప్రస్తుత ప్రభుత్వం తక్షణమే రాజీనామా చేయడం, సస్పెన్షన్ ఆఫ్ ఆపరేషన్స్ ఒప్పందాలపై సమగ్ర సమీక్ష జరపడం, భారత–మయన్మార్ సరిహద్దును సమర్థవంతంగా నిర్వహించడం, మణిపూర్ సమాజంలోని అన్ని విభాగాలను ఏకం చేయగల కొత్త ప్రభుత్వాన్ని స్థాపించడం సాధారణ స్థితిని పునరుద్ధరించడానికి అవసరమైన ముఖ్యమైన అడుగులు. ఇలాంటి ప్రజాస్వామ్యయుత, సమగ్ర విధానం ద్వారానే మణిపూర్‌లో శాశ్వత శాంతి, స్థిరత్వం, పురోగతిని సాధించగలుగుతాము.

# 'సూపర్ ఎల్ నినో' 2026... భారత్ సిద్ధంగా ఉందా?



డా.ముచ్చుకోట సురేష్ బాబు
9989988912

2026 జూన్ 4న నైరుతి రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకడం వ్యవసాయం, తాగు నీరు, సాగునీరు, జీవనోపాధి కోసం వర్షాలపై ఆధారపడే కోట్లాది భారతీయులకు ఉపశమనం కలిగించాల్సింది. కానీ, అది ఆందోళనలను మరింత పెంచింది. సాధారణ తేదీ కంటే మూడు రోజులు ఆలస్యంగా, భారత వాతావరణ శాఖ అంచనా వేసిన తేదీ కంటే తొమ్మిది రోజులు ఆలస్యంగా రుతుపవనాలు ప్రవేశించాయి. అంతకంటే ముఖ్యంగా, దేశవ్యాప్తంగా వర్షపాత నమూనాలను తీవ్రంగా ప్రభావితం చేసే అవకాశం ఉన్న శక్తివంతమైన ఎల్ నినో ప్రభావం నీడలో ఇవి ప్రారంభమయ్యాయి.

ఐఎండీ తన రుతుపవనాల అంచనాను దీర్ఘకాల సగటు లో 90 శాతానికి తగ్గించింది. అంతేకాకుండా లోటు లేదా తీవ్ర లోటు వర్షపాతం నమోదయ్యే అవకాశం 60 శాతంగా పేర్కొంది. అమెరికా జాతీయ సముద్ర, వాతావరణ సంస్థ సహా అంతర్జాతీయ వాతావరణ సంస్థలు అభివృద్ధి చెందుతున్న ఎల్ నినో, చరిత్రలోనే అత్యంత బలమైన వాటిలో ఒకటిగా మారే అవకాశం ఉందని, 2026–27 శీతాకాలం వరకు కొనసాగవచ్చని హెచ్చరించాయి. ఈ హెచ్చరికల నేపథ్యంలో ఒక కీలక ప్రశ్న ముందుకొస్తోంది: సూపర్ ఎల్ నినోను ఎదుర్కొనేందుకు భారత్ తగినంతగా సిద్ధమైందా?

1987, 2002, 2009, 2015 సంవత్సరాల్లో భారత్ తీవ్ర ఎల్ నినో కరువులను ఎదుర్కొంది. ఆ సందర్భాల్లో వ్యవసాయ ఉత్పత్తి తగ్గింది, నీటి వనరులు క్షీణించాయి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ దెబ్బతింది, ఆహార ధరలు పెరిగాయి. అయినప్పటికీ విపత్తు నిర్వహణలో ముందస్తు చర్యల కంటే ప్రతిస్పందనాత్మక విధానాలే ఇప్పటికీ ఎక్కువగా కనిపిస్తున్నాయి. కరువు పరిస్థితులు ఏర్పడిన తర్వాత చర్యలు తీసుకోవడం జరుగుతోంది కానీ ముందస్తు ప్రణాళికలు అమలు కావడం లేదు.

సూపర్ ఎల్ నినో అనేది ఊహించని విపత్తు కాదు. ఆధునిక శాస్త్రీయ పరిశీలనల ద్వారా దాని ప్రభావాలను నెలల ముందే అంచనా వేయవచ్చు. అందువల్ల సిద్ధతలో వైఫల్యం కేవలం వాతావరణ సమస్య మాత్రమే కాదు, పాలనా వైఫల్యంగా కూడా పరిగణించాల్సి ఉంటుంది.

భారత్ ఎదుర్కొంటున్న అతిపెద్ద బలహీనతల్లో నీటి నిర్వహణ ఒకటి. దశాబ్దాలుగా సాగునీటి ప్రాజెక్టులు, వాటర్‌షెడ్ అభివృద్ధి కార్యక్రమాలు, నీటి సంరక్షణ పథకాలపై భారీ పెట్టుబడులు పెట్టినా దేశం ఇప్పటికీ రుతుపవనాలపై అత్యధికంగా ఆధారపడుతోంది. దేశంలోని సాగుభూమిలో సగానికి పైగా ఇప్పటికీ వర్షాధారంగానే ఉంది. అనేక ప్రాంతాల్లో భూగర్భ జలమట్టాలు నిరంతరం పడిపోతున్నాయి. వర్షపాతం గణనీయంగా తగ్గితే జలాశయాలు పూర్తిస్థాయిలో నిండకపోవచ్చు. దీంతో అనేక రాష్ట్రాల్లో తాగునీటి కొరత తీవ్రమయ్యే ప్రమాదం ఉంది. భారత్‌కు ఏటా భారీ వర్షపాతం లభిస్తున్నప్పటికీ, అందులో చిన్న భాగాన్నే సమర్థవంతంగా నిల్వ చేసుకోగలుగుతోంది.




బలహీనమైన రుతుపవనాల ప్రభావాన్ని వ్యవసాయ రంగమే అత్యధికంగా అనుభవించాల్సి ఉంటుంది. ఖరీఫ్ పంటల విజయవంతమైన సాగు కాలంలో, సమానంగా కురిసే వర్షాలపై ఆధారపడి ఉంటుంది. రుతుపవనాల ఆలస్యం, దీర్ఘకాలిక పొడి విరామాలు, అస్థిర వర్షపాతం కారణంగా వరి, పప్పుధాన్యాలు, నూనెగింజలు, చెరకు, పత్తి వంటి పంటల దిగుబడులు తగ్గే ప్రమా దం ఉంది. వాతావరణ మార్పులను తట్టుకునే వ్యవసాయం గురించి సంవత్సరాలుగా చర్చ జరుగుతున్నప్పటికీ, కరువు ప్రభావిత ప్రాంతాల్లో ఇప్పటికీ అధిక నీరు అవసరమయ్యే పంటల సాగు కొనసాగుతోంది. ప్రభుత్వ కొనుగోలు విధానాలు, సబ్సిడీలు, మార్కెట్ ప్రోత్సాహకాలు కూడా అలాంటి పంటలను ప్రోత్సహిస్తున్నాయి. అంతర్జాతీయ తృణధాన్యాల సంవత్సరంలో మిల్లెట్లకు ప్రాధాన్యం లభించినప్పటికీ, రైతులు పెద్దఎత్తున వాటిని స్వీకరించేలా దీర్ఘకాలిక విధాన మద్దతు కనిపించడం లేదు.

మరో ప్రధాన ఆందోళన తీవ్రమైన వడగాలుల ప్రమాదం. బలమైన ఎల్ నినో పరిస్థితులు సాధారణంగా అధిక ఉష్ణోగ్రతలు, దీర్ఘకాలిక వేడి తరంగాలకు కారణమవుతాయి. గత కొన్ని సంవత్సరాల్లో భారత్ రికార్డు స్థాయి వడగాలులను అనుభవించింది. ఇవి ప్రజారోగ్యం, శ్రమ ఉత్పాదకత, విద్యుత్ డిమాండ్‌పై తీవ్ర ప్రభావం చూపాయి.

కొన్ని నగరాలు హీట్ యాక్షన్ ప్లాన్లను రూపొందించినప్పటికీ, వాటి అమలు దేశవ్యాప్తంగా సమానంగా లేదు. రైతులు, నిర్మాణ కార్మికులు, వీధి వ్యాపారులు వంటి లక్షలాది మంది బహిరంగ కార్మికులు తగిన రక్షణ లేకుండా ప్రమాదకర ఉష్ణోగ్రతలకు గురవుతున్నారు. లోటు రుతుపవనాల ప్రభావం వ్యవసాయ రంగానికే పరిమితం కాదు. రైతుల ఆదాయం తగ్గిపోవడం వల్ల గ్రామీణ కొనుగోలు శక్తి క్షీణిస్తుం ది. జలాశయాల నీటి మట్టాలు పడిపోవడం వల్ల జలవిద్యుత్ ఉత్పత్తి, పారిశ్రామిక కార్యకలాపాలు కూడా ప్రభావితమవుతాయి. ఈ పరిస్థితులను ఎదుర్కోవడానికి కేవలం సహాయక ప్యాకేజీలు సరిపోవు. బలమైన సరఫరా వ్యవస్థలు, మెరుగైన ఆహార నిల్వలు, వ్యూహాత్మక ధాన్య నిల్వలు, ముందస్తు మార్కెట్ జోక్యాలు అవసరం. లేకపోతే సూపర్ ఎల్ నినో భారతదేశ ఆర్థిక వ్యవస్థ మొత్తంపైనా పడుతుంది.

అత్యంత ఆందోళనకర అంశం ఏమిటంటే, దేశవ్యాప్తంగా అమలు చేయదగిన సమగ్ర సన్నద్ధత వ్యూహం కనిపించకపోవడం. శాస్త్రీయ సంస్థలు పదేపదే హెచ్చరికలు జారీ చేస్తున్నప్పటికీ నీటి సంరక్షణ, వ్యవసాయ అనుసరణ, వడగాలి నిర్వహణ, ప్రజారోగ్య సన్నద్ధత, విపత్తు ప్రమాద తగ్గింపు వంటి అంశాల్లో సమన్వయ పూర్వక చర్యలు కనిపించడం లేదు. భారత్ అత్యాధునిక వాతావరణ అంచనా సామర్థ్యాలను అభివృద్ధి చేసుకున్నప్పటికీ, అంచనాలు మాత్రమే ప్రజలను రక్షించలేవు. ముందస్తు హెచ్చరికలను ముందస్తు చర్యలతో అనుసంధానం చేయాలి. విపత్తులు సంభవించే ముందు చర్యలు తీసుకోవడం, తర్వాత సహాయక చర్యలు చేపట్టడం కంటే మరింత సమర్థవంతమైనది, తక్కువ వ్యయంతో కూడుకున్నది. సూపర్ ఎల్ నినోను ఆపడం సాధ్యం కాదు. కానీ దాని ప్రభావాలను సమయానుకూల చర్యల ద్వారా గణనీయంగా తగ్గించవచ్చు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నీటి సంరక్షణ కార్యక్రమాలను బలోపేతం చేయాలి, వర్షపు నీటి సేకరణను ప్రోత్సహించాలి, కరువు నిరోధక వ్యవసాయాన్ని విస్తరించాలి, హీట్ యాక్ష న్ ప్లాన్లను అమలు చేయాలి, వాతావరణ హెచ్చరికలను సమర్థవంతంగా ప్రజలకు చేరవేయాలి.

2026 రుతుపవనాలు మరో వర్షాకాలం ప్రారంభం మాత్రమే కాదు; అవి ఒక హెచ్చరిక. భారత్ ఒక నియంత్రించగల వాతావరణ సవాలును ఎదుర్కొంటుందా, లేక పెద్ద సామాజిక ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటుందా అనేది నేడు తీసుకునే సన్నద్ధత చర్యలపై ఆధారపడి ఉంటుంది.





కేంద్ర ఒబిసి జాబితాలో చేర్చని 40 బిసి కులాలకు..

# ఇడబ్ల్యుఎస్ సర్టిఫికెట్ల జారీకి చర్యలు

## ప్రభుత్వాన్ని కోరిన రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేంద్ర ఓబిసి జాబితాలో చేర్చబడని 40 బిసి కులాలకు చెందిన వారికి కేంద్ర ప్రభుత్వ విద్యాసంస్థలలో ప్రవేశాలు, ఉద్యోగ అవసరాల నిమిత్తం ఇడబ్ల్యుఎస్ సర్టిఫికెట్ల జారీకి రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ కోరారు. ఖైరతాబాద్‌లోని రాష్ట్ర బిసి కమిషన్ కార్యాలయంలో బుధవారం చైర్మన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కమిషన్ సభ్యు లు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి రంగు, కమిషన్ మెంబర్ సెక్రెటరీ బి. బాల మాయ దేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జి.నిరంజన్ మాట్లాడుతూ బిసి ఎ గ్రూప్‌లో అనాధలుగా గుర్తించడానికి ప్రస్తుతం ఉన్న 10 సంవత్సరాల వయస్సు నిబంధనను 49 సంవత్సరాలకు పెంచాలని వచ్చిన వినతిపై ఈ నెల 24న విచారణ జరపాలని కమిషన్ నిర్ణయించిందని తెలిపారు. అలాగే బిసి జాబితాలోని 'డి' గ్రూప్‌లో సాతాని (చాత్తాద శ్రీవైష్ణవ) కులం వారు సాతాని పదాన్ని తొలగించాలని కోరిన విషయంలో కూడా విచారణ నిర్వహించాలని కమిషన్ నిర్ణయించిందన్నారు. కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి జిల్లాలలో ఉన్న లొద్ద కులం వారిని బిసిలుగా గుర్తించాలని వచ్చిన వినతులపై సుదీర్ఘంగా చర్చించిన కమిషన్ వారి సామాజిక, విద్య, ఆర్థిక స్థితిగతులను అధ్యయనం చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. రాష్ట్రంలోని విద్యుత్ సంస్థలలో రిజర్వేషన్ల ఉల్లంఘన ఫిర్యాదులపై విచారిస్తున్న కమిషన్ ఆయా సంస్థలను సందర్శించిన విషయం తెలిసిందే. ఈ విషయంలో ఆయా సంస్థల నుండి మరింత సమాచారాన్ని కోరనున్నట్లు తెలిపారు. 2022 సంవత్సరంలో ఎంబిసి కులాలకు చెందిన వారి పిల్లలకు మహాత్మా జ్యోతిబాపూలే విద్యాసంస్థల ప్రవేశాలలో 5 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను ఇకముందు కూడా కొనసాగించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో డిప్యూటి డైరెక్టర్ యు. శ్రీనివాస రావు, సహాయ కార్యదర్శి కె. మనోహర్ రావు, ప్రత్యేక అధికారి కుమారి ఎన్. సునీత, సెక్షన్ ఆఫీసర్ జి. సతీష్ కుమార్, రీసెర్చ్ ఆఫీసర్ జి. లక్ష్మి నారాయణ హాజరయ్యారు.

# ఘనా అభివృద్ధికి తెలంగాణ చేయూత

## ఫార్మా హబ్ ఏర్పాటుకు పూర్తి సహకారం : మంత్రి శ్రీధర్ బాబు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆఫ్రికా దేశమైన ఘనా పారిశ్రామిక, ఆర్థిక పరివర్తనలో తెలంగాణ కీలక భాగస్వామిగా నిలవనుందని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ప్రకటించారు. ఘనాలో ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేయనున్న ఫార్మా హబ్‌కు తెలంగాణ ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. పారిశ్రామిక అభివృద్ధి, ఫార్మా రంగంలో తెలంగాణ సాధించిన విజయాలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని ఘనా ప్రభుత్వం ఆసక్తి వ్యక్తం చేయడంతో రెండు ప్రాంతాల మధ్య ద్వైపాక్షిక సహకారానికి కొత్త అవకాశాలు తెరుచుకున్నాయి. రాష్ట్ర సచివాలయంలో బుధవారం రిపబ్లిక్ ఆఫ్ ఘనా ప్రెసిడెన్షియల్ అడ్వైజర్ ఆగస్టస్ ఒబువాడుం టానో నేతృత్వంలోని ఉన్నతస్థాయి బృందం మంత్రి శ్రీధర్ బాబును మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా ఘనా చేపట్టిన '24 అవర్ ఎకానమీ అండ యాక్సలరేటెడ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్', ఫార్మా హబ్ ఏర్పాటు, పెట్టుబడుల ఆకర్షణ వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఘనా పారిశ్రామిక అభివృద్ధికి తెలంగాణ అనుభవం, నైపుణ్యం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్న ఆగస్టస్ ఒబువాడుం టానో, తమ దేశ ఆర్థిక రూపాంతరానికి సహకరించాలని మంత్రి శ్రీధర్ బాబును కోరారు. దీనిపై స్పందించిన మంత్రి శ్రీధర్ బాబు, తక్కువ కాలంలోనే తెలంగాణ దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందిన పారిశ్రామిక రాష్ట్రంగా అవతరించిందన్నారు. ఫార్మా, లైఫ్ సైన్సెస్, ఎలక్ట్రానిక్స్, ఏరోస్పేస్, ఫుడ్ ప్రాసెసింగ్, డిఫెన్స్, అడ్వాన్స్‌డ మ్యానుఫ్యాక్చరింగ్ రంగాల్లో తెలంగాణ అంతర్జాతీయ గుర్తింపు పొందిందని తెలిపారు. పెట్టుబడిదారులకు అనుకూలంగా రూపొందించిన ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాలు రాష్ట్ర విజయానికి ప్రధాన కారణమని వివరించారు. ఫార్మాస్యూటికల్ తయారీ, వ్యాక్సిన్ ఉత్పత్తి, పరిశోధన, గ్లోబల్ సప్లై చైన్ నిర్వహణ, లైఫ్ సైన్సెస్ రంగాల్లో తెలంగాణకు ఉన్న అనుభవాన్ని ఘనాతో పంచుకునేందుకు సిద్ధంగా ఉన్నామని మంత్రి పేర్కొన్నారు. ఘనా పారిశ్రామిక, ఆర్థిక అభివృద్ధి ప్రయాణంలో తెలంగాణ విశ్వసనీయ భాగస్వామిగా నిలుస్తుందని ఆయన భరోసా ఇచ్చారు.

నూతన కార్మిక కోడ్‌ల రాష్ట్ర నిబంధనలపై

# సంప్రదింపుల కమిటీ ఏర్పాటు

## 11 నుంచి 16 వరకు యజమానులు, కార్మిక సంఘాలతో సమావేశాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేంద్ర ప్రభుత్వం అమలు చేయనున్న నాలుగు నూతన కార్మిక కోడ్‌లకు సంబంధించిన రాష్ట్ర నిబంధనల ఖరారు ప్రక్రియలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం నాలుగు అధికారుల కమిటీలను ఏర్పాటు చేసింది. ఈ కమిటీలు యజమానుల సంఘాలు, ఉద్యోగులు, కార్మిక సంఘాలు, ట్రేడ్ యూనియన్ల ప్రతినిధులతో సంప్రదింపు సమావేశాలను నిర్వహించనున్నాయి. ఈ సమావేశాలు జూన్ 11 నుంచి జూన్ 16 వరకు హైదరాబాద్‌లోని ఆర్‌టిసి క్రాస్ రోడ్స్ వద్ద ఉన్న టి.అంజయ్య భవన్‌లోని కార్మిక కమిషనర్ కార్యాలయంలో జరుగుతాయని కార్మిక కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు.

**సమావేశాల షెడ్యూల్..**

సోషల్ సెక్యూరిటీ కోడ్ 2020 : జూన్ 11, ఉదయం 11 గంటలకు

కోడ్ ఆన్ వేజెస్ 2019 : జూన్ 12, ఉదయం 11 గంటలకు

ఆక్యుపేషనల్ సేఫ్టీ, హెల్త్ అండ్ వర్కింగ్ కండిషన్స్ కోడ్ 2020 : జూన్ 15, ఉదయం 11 గంటలకు

ఇండస్ట్రియల్ రిలేషన్స్ కోడ్ 2020 : జూన్ 16, ఉదయం 11 గంటలకు

ప్రతిపాదిత నిబంధనలపై తమ అభిప్రాయాలు, సూచనలు తెలియజేయదలచిన యజమానుల సంఘాలు, కార్మిక సంఘాలు, ఉద్యోగుల ప్రతినిధులు, ఇతర వాణిజ్య సంఘాలు ఆయా తేదీల్లో నిర్వహించే సమావేశాలకు హాజరై తమ సూచనలు అందించాలని కార్మిక కమిషనర్ కోరారు. ఈ సంప్రదింపుల ద్వారా కార్మికులు, యజమానులు, ఇతర భాగస్వాముల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని రాష్ట్ర నిబంధనలను మరింత సమగ్రంగా రూపొందించనున్నట్లు తెలిపారు.

# ఒకటో తేదీనే జీతాలు.. ఉద్యోగుల ఆర్థిక కష్టాలకు చెక్

## మంత్రి జూపల్లి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలోని ప్రభుత్వ, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, గౌరవ వేతన సిబ్బందికి ప్రతి నెల ఒకటో తేదీనే జీతాలు చెల్లించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఉద్యోగుల జీవితాల్లో ఆర్థిక స్థిరత్వానికి కొత్త దారులు తెరుస్తుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు, ప్రొహిబిషన్ అండ ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు తీసుకున్న ఈ నిర్ణయం ఉద్యోగుల సంక్షేమంపై ప్రభుత్వ చిత్తశుద్ధి, నిబద్ధతకు నిదర్శనమని ఆయన అన్నారు.బుధవారం విడుదల చేసిన ప్రకటనలో మంత్రి మాట్లాడుతూ.. గత పాలనలో జీతాల చెల్లింపుల్లో నెలకొన్న అనిశ్చితి కారణంగా ఉద్యోగులు తీవ్ర ఆర్థిక, మానసిక ఒత్తిడిని ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. రుణాల ఇఎంఐలు సకాలంలో చెల్లించలేక జరిమానాలు, చెక్కులు బౌన్స్ కావడం, అద్దెలు, స్కూల్ ఫీజులు, వైద్య ఖర్చుల నిర్వహణలో ఇబ్బందులు ఎదుర్కొన్న పరిస్థితులను ప్రభుత్వం గుర్తించిందన్నారు.ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నారని జూపల్లి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తున్న విషయాన్ని గుర్తు చేస్తూ, ఇప్పుడు అదే విధానాన్ని కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, ఇతర తాత్కాలిక సిబ్బందికి వర్తింపజేయడం ఉద్యోగుల పట్ల ప్రభుత్వానికి ఉన్న బాధ్యతను చాటుతోందన్నారు.సకాలంలో జీతాలు అందడం వల్ల ఉద్యోగులు తమ ఆర్థిక ప్రణాళికలను మెరుగ్గా రూపొందించుకునే అవకాశం ఉంటుందని, రుణాల చెల్లింపులు, కుటుంబ ఖర్చులు, విద్యా, వైద్య అవసరాలను ఇబ్బందులు లేకుండా నిర్వహించగలరని చెప్పారు. దీనివల్ల మంచి క్రెడిట్ రికార్డు, సిబిల్ స్కోరు కొనసాగడమే కాకుండా కుటుంబాల్లో ఆర్థిక భరోసా పెరుగుతుందని పేర్కొన్నారు.

# ఓటరు నమోదులో 'ఐటి'ని వాడాలి

## సిఇఒ సుదర్శన్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఈ నెల 25వ తేదీ నుండి ప్రారంభం కానున్న 'ఎస్ఐఆర్' కార్యక్రమంలో సమాచార సాంకేతికత (ఐటి)ని విరివిగా వాడుకోవాలని, ఓటరు నమోదు ప్రక్రియలో ఎలాంటి తప్పులకు తావివ్వకుండా పూర్తి పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రధాన అధికారి సి. సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. 'ఎస్ఐఆర్' ప్రక్రియలో భాగంగా ఐటి వినియోగంపై జిల్లా, మండల స్థాయి మాస్టర్ ట్రైనర్లు, ఐటి సపోర్ట్ టీమ్, డేటా ఆపరేటర్లకు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియలో ఐటి అంశం అత్యంత కీలకమైనదని స్పష్టం చేశారు. సాంకేతికతను సిబ్బంది సమర్థవంతంగా వినియోగించుకోవడం ద్వారా ప్రక్రియ వేగవంతం అవడమే కాకుండా, ఓటరు జాబితా రూపొందించడంలో పూర్తి పారదర్శకత ఉంటుందని తెలిపారు. భారత ఎన్నికల కమిషన్ ఐటికి అత్యధిక ప్రాధాన్యతనిస్తూ ఈసినెట్, బిఎల్ఓ యాప్‌లను అందుబాటులోకి తెచ్చిందని, వీటిలోని వివిధ టూల్స్ వల్ల ఎస్ఐఆర్ ప్రక్రియ మరింత సులభతరం అవుతుందన్నారు. వీటిపై క్షేత్రస్థాయి డేటా ఆపరేటర్లకు పూర్తిస్థాయిలో శిక్షణ ఇవ్వాలని మాస్టర్ ట్రైనర్లు, ఐటి సపోర్ట్ టీమ్‌లను ఆయన ఆదేశించారు.

**ఆన్‌లైన్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి**

సొంతంగా ఓటరు నమోదు (ఎన్యుమరేషన్) చేసుకోవాలనుకునేవారు ఓటర్లు ఆన్‌లైన్ వేదిక అయిన voter.eci.gov.in వెబ్‌సైట్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఆన్‌లైన్ ద్వారా ఓటర్ల నమోదు ప్రక్రియపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను సిఈఓ ఆదేశించారు.

**సాంకేతిక అంశాలపై క్షుణ్ణంగా శిక్షణ**

అనంతరం రాష్ట్ర శిక్షణ నోడల్ అధికారి (ఎస్‌టిఎన్‌ఓ) బి. చెన్నయ్య మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియలోని వివిధ దశలను సవివరంగా వివరించారు. పిఎంఐటి డి. చిరంజీవి మాట్లాడుతూ ఈసిఐనెట్, బిఎల్ఓ యాప్‌లకు సంబంధించిన సాంకేతిక శిక్షణను అందించారు. ఎన్యూమరేషన్ ఫారమ్‌లను పూరించడం, ఓటర్ల మ్యాపింగ్ చేయడం, సేకరించలేని ఎన్యూమరేషన్ ఫారమ్‌లను వర్గీకరించడం, ఇతర అనుబంధ కార్యకలాపాల విధానాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో అదనపు ప్రధాన ఎన్నికల అధికారి డాక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డి, ఉప ప్రధాన ఎన్నికల ఎ.ఎస్. చారిలతో పాటు పలువురు నోడల్ అధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# తుమ్మిడిహెట్టి విషయంలో కాంగ్రెస్, బిజెపి డ్రామాలు

## మాజీ ఎంపి బోయినపల్లి వినోద్ కుమార్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్, బిజెపి తమ డ్రామాలను బంద్ చేయాలని బిఆర్‌ఎస్ మాజీ ఎంపి బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి జోగు రామన్న, మాజీ ఎంఎల్‌ఎ డాక్టర్ మెతుకు ఆనంద్ ,జెడ్‌పి మాజీ చైర్మన్ దఫేదార్ రాజు, కార్పొరేషన్ మాజీ చైర్మన్ ప్రవీణ్ కుమార్‌తో కలిసి వినోద్ కుమార్ మాట్లాడుతూ తుమ్మిడిహెట్టి, ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టును ప్రతిపాదించిందే అప్పటి సిఎం వైఎస్ఆర్ అని అన్నారు. ఈ ప్రాజెక్ట్ 152 మీటర్ల ఎత్తులో నిర్మిస్తామని ఉమ్మడి ఎపి ప్రభుత్వం చెప్పగా, దీనిపైన మహారాష్ట్ర కాంగ్రెస్ సిఎం పృథ్వీరాజ్ చవాన్ స్పందిస్తూ 152 మీటర్ల ఎత్తులో తుమ్మిడి హెట్టికి అనుమతి ఇవ్వబోమని అప్పటి ఉమ్మడి ఎపి సిఎం కిరణ్ కుమార్ రెడ్డికి లేఖ రాసిన విషయాన్ని గుర్తు చేశారు. ఆ సమయంలో కేంద్రంలో, మహారాష్ట్రలో, ఉమ్మడి ఎపిలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వాలే ఉన్నాయని, ప్రస్తుత సిఎం రేవంత్‌రెడ్డి ఎవరిని మోసం చేద్దామని అనుకుంటున్నారని వినోద్ కుమార్ ప్రశ్నించారు. ప్రాజెక్ట్ ఎత్తు విషయమై నాటి సిఎం కెసిఆర్ మహారాష్ట్ర సిఎం దేవేంద్ర ఫడ్నవీస్‌ను ఎంతో బతిమిలాడినా ఒప్పుకోలేదని వివరించారు. ముంబయిలో ఐదు రోజుల పాటు అక్కడే ఉండి తుమ్మిడి హెట్టి ప్రాజెక్టు కోసం ప్రయత్నించామన్నారు. సిఎం రేవంత్ రెడ్డి మహారాష్ట్ర సిఎంకు లేఖ రాయలేదని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు చెబుతున్నారని, సిఎం రేవంత్ రెడ్డి మహారాష్ట్ర సిఎంతో ఘర్షణ పూరితంగా ఎలా వెళ్తారన్నారు. ప్రాజెక్ట్ విషయంలో సిఎం రేవంత్ రెడ్డికి మహారాష్ట్ర సిఎం ఫడ్నవీస్ అపాయింట్ మెంట్ ఇవ్వరనే విషయం ముందే తెలుసని అన్నారు. తుమ్మిడిహెట్టికి ఆరు నెలల్లోనే అనుమతి తీసుకొస్తానని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఏడాది క్రితమే చెప్పినప్పటికీ ఇప్పటికీ అతీగతీ లేదని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డికి మేడిగడ్డనే దిక్కు అని, కాళేశ్వరం ప్రాజెక్టు మాత్రమే ఆప్షన్ ఉన్నదని ఆయన చెప్పారు. మేడిగడ్డ కొట్టుకుపోతుందని సిఎం రేవంత్ రెడ్డి చూశారని, కానీ ప్రస్తుతం ఆ బ్యారేజీకి మరమ్మత్తులను మొదలు పెట్టారని వినోద్ కుమార్ అన్నారు.

# సిపిఐ కన్నెర్ర


(మొదటి పేజీ తరువాయి)


ఎం.బాలనరసింహ, మేడ్చల్‌లో విఎస్ బోస్ తదితర నాయకులు ఆందోళనలకు నాయకత్వం వహించారు. ఖమ్మం, కరీంనగర్, వరంగల్, కలెక్టరేట్లలోకి చొచ్చుకు పోయేందు కు సిపిఐ శ్రేణులు ప్రయత్నించడంతో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. పోలీసులకు సిపిఐ నేతలు, కార్యకర్తలకు మధ్య తోపులాటలు జరిగాయి. కరీంనగర్‌లో సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కాగా పోలీసులు సిపిఐ నేతలను బలవంతంగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకోగా పలువురి సిపిఐ నేతల చొక్కాలు చిరిగిపోయాయి. కాగా ధరల పెరుగుదలను నిరసిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఖమ్మంలో పార్టీ శ్రేణులు కదం తొక్కాయి. వందలాది మంది సిపిఐ కార్యకర్తలు ధరల తగ్గింపు నిరసన ఆందోళనలో పాల్గొన్నారు. వి. వెంకటాయపాలెం స్టేజీ వద్ద నుంచి కలెక్టరేట్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. కలెక్టరేట్‌లోకి చొచ్చుకు పోయేందుకు సిపిఐ శ్రేణులు ప్రయత్నించడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పోలీసులకు, పార్టీ కార్యకర్తలకు మధ్య తోపులాట జరిగింది. ఈ సందర్భంగా ఆందోళనకారులను ఉద్దేశించి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ భారతదేశం మోడీ పాలనలో ఆర్థిక పతనం దిశగా పయనిస్తుందని విమర్శించారు. మోడీ విధానాలు దేశ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేశాయని భవిష్యత్తులో మరిన్ని ఆందోళనలు తప్పవని ఆయన హెచ్చరించారు. దేశంలో ప్రజల కోసం కాకుండా కార్పొరేట్ల కోసం పాలన సాగుతుందని మోడీది కార్పొరేట్ల పాలన అని ఆయన స్పష్టం చేశారు. సహజంగా సంపన్నులు, వ్యాపారులపై పన్నులు విధించి పేదలను ఆదుకునే ప్రయత్నం ప్రభుత్వాలు చేస్తాయని కానీ మోడీ ప్రభుత్వం ఇందుకు విరుద్ధంగా పేదలపై భారాలు మోపుతూ సంపన్నులు, కార్పొరేట్లకు లక్షల కోట్ల రూపాయలు రాయితీలు ప్రకటిస్తున్నారని కూనంనేని తెలిపారు. ప్రజలపై ధరాభారం మోపుతున్న ఈ మోడీకి వ్యతిరేకంగా యావత్ ప్రజానీకం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. మన్మోహన్ సింగ్ హయాంలో డాలర్ ధర రూ. 56 ఉంటే అప్పుడు గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న మోడీ రూపాయి పతనంపై ఆరోపణలు చేస్తూ రాజీనామాకు




డిమాండ్ చేశారని మరి ఇప్పుడు చరిత్రలో ఎన్నడులేని విధంగా ఒక డాలర్‌కు రూ.96.50లు చెల్లించే పరిస్థితి దాపురించిందని దీనికి మోడీ ఏమి సమాధానం చెబుతారని కూనంనేని ప్రశ్నించారు. పెట్రోల్, డీజిల్ ధరలు రెట్టింపుకు పైగా పెరిగాయని, గ్యాస్ బండ ఈ ఏడాదిలోనే మూడు సార్లు పెరిగిందని ఆయన తెలిపారు. ధరలను నియంత్రించ లేని మోడీ పరిపాలనకు అనర్హుడని కూనంనేని తెలిపారు. మోడీ ఇచ్చిన ఏ వాగ్దానాన్ని 12 ఏళ్ల కాలంలో అమలు చేయలేదని నల్ల ధనం తీసుకు రాలేదని, కోట్ల ఉద్యోగాలను కల్పించ లేదని ఆయన తెలిపారు. ప్రజా వ్యతిరేక చట్టాలను తీసుకు రావడంలో మాత్రం మోడీ ముందు వరుసలో నిలిచారని కూనంనేని ఆరోపించారు. హామీలు నెరవేరే వరకు నిరంతర ఆందోళనలు తప్పవని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ తెలిపారు. ఈ ఆందోళనను ఉద్దేశించి సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి తదితరులు మాట్లాడగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యర్రా బాబు, ఎస్‌కె జానిమియా, ఏపూరి లతాదేవి, సిద్దినేని కర్ణకుమార్, బిజి క్లెమెంట్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు. ఆందోళన అనంతరం డిమాండ్స్‌తో కూడిన వినతి పత్రాన్ని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్‌కు అందజేశారు. భద్రాద్రికొత్తగూడెం కలెక్టరేట్ వద్ద నిర్వహించిన భారీ ధర్నాలో కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ కేంద్ర ప్రభుత్వం పేదవాడి పొట్ట కొడుతోందని, ప్రజాపక్షాన ఉద్యమాలు మరింత తగా పెంచి అధికార దాహంతో మూసుకుపోయిన పాలకుల కళ్లు తెరిపిస్తామన్నారు. పెంచిన ఇంధన, గ్యాస్ ధరలకు సామాన్యుల నడ్డి విరుస్తున్నారని, ధనవంతులకు ఊడిగం చేస్తూ దేశ సంపదను దోచుకుంటున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కల్లూరి వెంకటేశ్వరరావు, మేయర్ మూడ్ గణేష్, జిల్లా నాయకులు నరాటి ప్రసాద్, సలిగంటి శ్రీనివాస్, మండల కార్యదర్శులు, జిల్లా సమితి సభ్యులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గన్నారు.

**ధరలు తగ్గిస్తారా.. గద్దె దిగుతారా..? : తక్కళ్లపల్లి**

ప్రజలకు భారంగా పరిణమించిన అధిక ధరలను తగ్గిస్తారా.. లేక గద్దె దిగుతారా.. అని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు కేంద్రంలోని మోదీ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బుధవారం హనుమకొండ కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. సిపిఐ హనుమకొండ జిల్లా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తొలుత ఆర్ట్స్ కళాశాల ఆడిటోరియం నుండి కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ధర్నాకు ముఖ్య అతిథిగా హాజరైన సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇప్పటికే పెట్రోల్ డీజిల్ ధరలను భారీగా పెంచిన ప్రభుత్వం తాజాగా వంట గ్యాస్ ధరలను పెంచి పేదలపై భారం మోపిందని అన్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి,రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి,రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, జిల్లా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

**మోదీ ఆర్థిక విధానాలతో అంధకారంలోకి దేశం : ఇటి.నరసింహా**

కేంద్రంలోని ప్రధాని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక, అనాలోచిత ఆర్థిక విధానాల వల్ల దేశం తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలోకి నెట్టబడుతోందని, తక్షణమే ఈ విధానాలను మార్చుకోకపోతే దేశ భవిష్యత్తు అంధకారంలో పడటం ఖాయమని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటి నరసింహా హెచ్చరించారు. సిపిఐ హైదరాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ నుండి జిఎస్‌టి భవన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను కళ్లకు కట్టేలా ఏర్పాటు చేసిన ప్రత్యేక ఎగ్జిబిషన్ ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం జిఎస్‌టి భవన్ ముందు సిపిఐ శ్రేణులు భారీ ధర్నాను నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటి నరసింహా మాట్లాడుతూ గత 12 ఏళ్లుగా పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను విపరీతంగా పెంచుతూ పేదవాడు బతకలేని పరిస్థితిని కేంద్రం సృష్టించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో పేదరికం నిత్యం పెరుగుతుంటే మోదీ అండతో అదానీ, అంబానీల ఆస్తులు మాత్రం ప్రపంచంలో 15వ స్థానానికి చేరుకున్నాయని విమర్శించారు. ప్రధాని మోదీ అసమర్థ ఆర్థిక విధానాల వల్లే నేడు డాలర్‌తో రూపాయి మారకం విలువ రూ.96 లకు పతనమైందని, ఈ తప్పుడు విధానాల వల్ల దేశ ఆర్థిక పరిస్థితి మరో శ్రీలంక, నేపాల్, పాకిస్తాన్ మాదిరిగా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే హిందూముస్లింల పేరిట, మత విద్వేషాల వైపు మోదీ ప్రజల దృష్టిని మళ్లిస్తూ 'మళ్లీ మాకే ఓట్లేస్తారనే' అహంకారం మోదీకి వచ్చిందని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి బి.స్టాలిన్, సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, కార్యవర్గ సభ్యులు ఎన్.శ్రీకాంత్, సలీంఖాన్, శంషుద్దీన్, కాంపల్లి శ్రీనివాస్ ఉమర్ ఖాన్, కౌన్సిల్ సభ్యులు షక్రీబాయి, ఆరుట్ల రాజ్ కుమార్, పడాల నళిని, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శులు బి.వెంకటేశం, ఎం.ప్రవీన్ కూమార్ గౌడ్, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అనిల్ కుమార్, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహా, ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నరేష్, ఎన్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ :: చింతల్ సర్కిల్-54**

**NIT No.** 06/DB/EE/Chintal circle-54/CMC/2026-27, తేది: 10.06.2026, **పని పేరు:** సిసి రోడ్లు, ఎబి కేబుల్ & నేమ్ బోర్డ్స్ ఏర్పాటు, **అంచనా విలువ:** రూ.12.64 లక్షలు, **ప్రారంభ తేది & సమయం:** 11.06.2026 మ.3.00గం.లకు, **బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం:** 20.06.2026 మ.3.00గం.ల వరకు, **టెండర్ ఆహ్వానించు అథారిటీ వివరాలు మరియు మొబైల్ నెం.** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సెల్ నెం. 9989930549, హెడ్ డ్రాఫ్ట్స్‌మెన్, సెల్ నెం. 8712034411. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @www.tender.telangana.gov.in లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, చింతల్ సర్కిల్-54, సిఎంసి.

DIPR R.O. No. : 4002-PP/CL/ADVT/2026-27, Date: 10-06-2026

**GHMC గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, డివిజన్-30, జిహెచ్‌ఎంసి.**

**NIT No.06 :** NIT No.06/E.E.30/GHMC/2026-27, తేది: 08.06.2026, **పని పేరు:** జిహెచ్‌ఎంసి, కెజెడ్, డివిజన్-30 కింద వివిధ సివిల్ ఇంజనీరింగ్ పనులు, **అంచనా విలువ:** రూ.15.15 లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 10.06.2026 ఉ.11.30గం.లకు మరియు బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం: 13.06.2026 ఉ.11.30గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-30, జిహెచ్‌ఎంసి, 5వ అంతస్తు అబిడ్స్ పార్కింగ్ కాంప్లెక్స్, అబిడ్స్, హైదరాబాద్. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-30, జిహెచ్‌ఎంసి.

DIPR R.O. No. : 3967-PP/CL/ADVT/2026-27, Date: 10-06-2026

తెలంగాణ ప్రభుత్వము

**మంచిర్యాల నగరపాలక సంస్థ, జిల్లా: మంచిర్యాల**

**ఆసక్తి వ్యక్తీకరణకు ఆహ్వానం**

ఇ1/ఇ.ఓ.ఐ/266/ఎం.ఎం.సి/2026 తేది: 10-06/2026

మంచిర్యాల నగరపాలక సంస్థలో (2) సంవత్సరాల కాలానికి ఆదాయ పంపిణి ప్రాతిపదికన పొడి వ్యర్థాల సేకరణ ఆపరేషన్ మరియు మెయింటెనెన్స్, శూన్య పేరుకుపోయిన వ్యర్థాలు, తడి వ్యర్థాల ప్రాసెస్ మరియు అవగాహన కార్యక్రమాల నిర్వహణ కొరకు కమీషనర్, మంచిర్యాల నగరపాలకసంస్థ వారు ప్రముఖ ఏజన్సీల నుండి ఆసక్తి వ్యక్తీకరణను ఆహ్వానిస్తున్నారు. ఘన వ్యర్థాల నిర్వహణ ఆపరేషన్లను క్రమబద్ధీకరించడం మరియు మూలం వద్దనే వేరు చేయు ప్రక్రియ గురించి కుటుంబాలకు అవగాహన కార్యాక్రమాలు (ఐఇసి కార్యకలాపాలు) నిర్వహించడం మరియు ఎస్‌డబ్ల్యుఎం రూల్స్, 2016 మరియు టిఎం చట్టం 2019 లకు అనుగుణంగా స్వచ్ఛ మంచిర్యాల నగరపాలక సంస్థను సాధించుటకు పరిష్కారాలు అందించడం ఆసక్తి వ్యక్తీకరణకు ఆహ్వానించుటకు గల ముఖ్య ఉద్దేశము.

ఆసక్తి గల ఏజన్సీలు ఇఓఐ డాక్యుమెంటు మరియు క్రింద పత్రాలు 1) రిజిస్ట్రేషన్ ఆఫ్ కంపెనీ, 2) జి.యస్.టి రిజిస్ట్రేషన్, 3) అనుభవం కలిగిన ఎస్‌డబ్ల్యుఎం వృత్తి నిపుణుల జాబితా, 4) ప్రస్తుత వర్క్ ఎంఓయు, యుఎల్బిలతో పని యొక్క కాపీ మరియు ఏవైనా ఇతర ఎంఓయులను జతచేయడంతో పాటుగా కమీషనర్, మంచిర్యాల నగరపాలక సంస్థ పేరిట రూ.5000.00లు (నాన్ రిఫండబుల్) డిమాండ్ డ్రాఫ్ట్‌ను సమర్పించడం / అందజేయడం చేయవలెను.

1. బిడ్ల సమర్పణ రెండు కవర్ సిస్టమ్‌లో అనగా టెక్నికల్ మరియు ఫైనాన్సియల్ రెండింటిని వేరు వేరుగా ఒకే కవర్‌లో ఉంచవలెను.
2. ఆసక్తి గల ఏజన్సీలు వ్యర్థాలను మరియు పేరుకు పోయిన వ్యర్థాలను తొలగించుటకు వ్యర్థాల నిర్వాహణ పై కార్యాచరణ ప్రణాళికను సమర్పించవలెను.
3. ఆసక్తి గల ఏజన్సీలు తమ ఆఫర్‌ను పై వివరాలతో సీల్ కవర్‌లో క్రింది సంతకందారుకు తేది: 16.06.2026 సా.4.00గం.ల వరకు సమర్పించవలెను.

ఏవైనా ఇతర వివరాల కొరకు మున్సిపల్ కమీషనర్, మంచిర్యాల నగరపాలక సంస్థ గారి ఫోన్ నెం. 9849905886 మరియు శానిటరి ఇన్‌స్పెక్టర్, మంచిర్యాల నగరపాలక సంస్థ ఫోన్ నెం.9000767290 లను సంప్రదించగలరు. ఏ కారణము తెలియజేయకనే ఆఫర్లలో ఏ ఒక్క దానినైనను లేదా మొత్తములను అంగీకరించుటకు లేదా తిరస్కరించుటకు కమీషనర్ తనకు గల హక్కును అట్టిపెట్టికొని యున్నారు.

సం/- కమీషనర్ మంచిర్యాల నగర పాలక సంస్థ

DIPR R.O. No. : 3977-PP/CL/ADVT/2026-27, Date: 10-06-2026




## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

### ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధికా గుప్తా

**ప్రజాపక్షం/ఉప్పల్:** రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎంఎంసి ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధికా గుప్తా సూచించారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి ఆదేశాల మేరకు ఉప్పల్ పోలీసులు ఉప్పల్ రింగ్‌రోడ్‌లో నిర్వహించిన అరైవల్ అలైవ్ రోడ్డు భద్రతా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ జోన్ డిసిపి సురేష్ రెడ్డి, మల్కాజిగిరి ఏసిపి వెంకటరెడ్డి, ట్రాఫిక్ ఏసిపి సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ట్రాఫిక్ నిబంధనల ప్రాముఖ్యత విషయమై ఆ మార్గంలో వెళ్లే వాహనదారులకు అవగాహన కల్పించారు. అతి వేగం, రాంగ్ రూట్ డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడిపించటం, హెల్మెట్ ధరించటం, సీట్ బెల్టు ధరించటం తదితర అంశాల గురించి వివరించారు. దీంతో పాటు ప్రతి ఒక్క వాహనదారుడు విధిగా బీమా చేయించుకోవాలన్నారు.




## బహిరంగ ప్రదేశాలలో చెత్త వేయొద్దు

**ప్రజాపక్షం/చర్లపల్లి:** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా బుధవారం చెత్త ఎక్కువగా వేసే జివిపి పాయింట్స్‌లో శుభ్రంచేసి ముగ్గులు ఇచ్చట చెత్త వేయకూడదని అనే నినాదంతో అవగాహన కార్యక్రమం కుషాయిగూడ వాసవి శివ నగర్ ప్రాంతంలో చేపట్టారు. ముగ్గులు వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని బహిరంగా ప్రదేశాలలో చెత్తను వేయరాదని,వాణిజ్య వ్యాపార,ఇండ్ల స్థలాల నుండి వెలుబడే చెత్త చెదారాన్ని వీధుల్లోకి వచ్చే మున్సిపల్ ఆటోలలో వేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సానిటరీ సూపర్‌వైజర్ సుదర్శన్, జవాన్, ఎస్‌ఎఫ్‌ఏ, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## ఉపాధి కల్పనతో పాటు ఉన్నత విద్య అందించటమే ధ్యేయం

**ప్రజాపక్షం/దుండిగల్ :** విద్యాభ్యాసంలో తమ పేదరికం ఎప్పటికీ అడ్డు కాదు అంటూ బహదూర్ పల్లి కే.ఏం పందు మెమోరియల్ ఒకేషనల్ జూనియర్ కాలేజ్ విద్యార్థులు 2026వ సంవత్సరంలో సాధించిన ఫలితాలే నిదర్శనం. ఈ క్రమంలో మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ కోర్సులో జీ.భాగ్యశ్రీ (981) మార్కులు సాధించగా, ఎం.ఎల్.టీ కోర్సులో కే.పూజిత (970) మార్కులు సాధించగా, కంపెనీ సెక్రటరీ కోర్సులో ఏ.అక్షయ (966), టీ.రోషిని (966) మార్కులు సాధించగా, ఎలక్ట్రికల్ టెక్నీషియన్ కోర్సులో ఎం.లిఖిత (943), పి.శ్రీహరి (936) సాధించగా, ఎంపీసీ 2 లో 1000 మార్కులకు గాను పి.జోష్ణ (981), వి.వర్షిత (951), వడ్ల వర్షిత (940) సాధించగా, బైపిసి1 లో 470 మార్కులకు గాను వాలియా జబీన్ (428) సాధించగా, సిఇసి 2 లో 1000 మార్కులకు గాను బి.సంజన (839) మార్పులను సాధించగా, హెచ్‌ఈసి2 లో 1000 మార్కులకు గాను కె.మాలతి (882) మార్కులు సాధించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ మాట్లాడుతూ విద్యాభ్యాసం ద్వారానే మనలోని అజ్ఞానాన్ని రూపుమాపవచ్చని కె.ఎం.పాండు సంకల్పానికి నిదర్శనంగా ప్రతి నిరుపేద విద్యార్థులకు ఉపాధి కల్పనతో కూడిన ఉన్నత విద్యను అందించాలనే ధ్యేయంతో ఏర్పాటు చేసిన ఈ వోకేషనల్ జూనియర్ కళాశాలలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో కేఎం.పాండు గవర్నమెంట్ వోకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ షేక్ మైమూన్, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ నాగేందర్, కళాశాల సిబ్బంది, వెలుగు ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఫౌండర్ నారాయణ రావు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



## ద్విచక్ర వాహనదారులకు 40 హెల్మెట్ల పంపిణీ

**ప్రజాపక్షం/నవాబుపేట్ :** నవాబుపేట్ మండలంలో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించేందుకు సామాజిక సేవా దృక్పథంతో ముందుకు వచ్చిన ప్రముఖ సామాజికవేత్త నవాబుపేట మండలం ఎల్లకొండ గ్రామానికి చెందిన పన్నాల రామచంద్రారెడ్డి ద్విచక్ర వాహనదారులకు 40 హెల్మెట్లను డొనేట్ చేశారు. రోడ్డు ప్రమాదాల్లో ప్రాణనష్టం తగ్గించాలనే ఉద్దేశ్యంతో ఆయన ఈ హెల్మెట్లను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన పన్నాల రామచంద్రారెడ్డి, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని అన్నారు. హెల్మెట్లు అందుకున్న వాహనదారులు పన్నాల రామచంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, సమాజ హితం కోసం ఆయన చేస్తున్న సేవలు ఆదర్శప్రాయమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, యువకులు, వాహనదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేయాలి

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేయటం ద్వారా రానున్న ఎలాంటి ఎన్నికల్లో అయినా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు భారీ మెజార్టీతో విజయం సాధించేలా కృషి చేయాలని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు సూచించారు. బుధవారం మల్కాజిగిరిలోని వెంకటేశ్వరనగర్ శ్రీదేవి ఫంక్షన్ హాలులో బూత్ లెవెల్ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో టిపిసిసి ఉపాధ్యక్షులు సమీర్ కౌశల్‌తో కల్సి కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్, మల్కాజిగిరి కాంగ్రెస్ ఇన్‌చార్జి తోట లక్ష్మి కాంతరెడ్డి, కాంగ్రెస్ శ్రేణులు, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి

**అరైవ్ అలైవ్ కార్యక్రమంలో ఐజిపి షా నవాజ్ ఖాసీం, కలెక్టర్ దీపక్ తివారి, ఎస్పీ స్నేహ మెహ్రా ఐపిఎస్ సూచనలు**

**ప్రజాపక్షం/నవాబుపేట్:** రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నిబంధనల పట్ల ప్రజల్లో అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా నవాబ్ పేట్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని లక్ష్మారెడ్డి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన అరైవ్ అలైవ్ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఐజీపీ షా నవాజ్ ఖాసీం ఐపీఎస్, వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా హాజరై రోడ్డు భద్రతపై ప్రజలకు పలు సూచనలు చేశారు.



ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా ప్రతి సంవత్సరం వేలాది మంది రోడ్డు ప్రమాదాల కారణంగా ప్రాణాలు కోల్పోతున్నారని, వీటిలో చాలా ప్రమాదాలు నిర్లక్ష్యం వల్లే జరుగుతున్నాయని అన్నారు. ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు.



గ్రామాలలో ఎక్కువ ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడి చనిపోతున్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనాల్లో ప్రయాణించే వారు సీటు బెల్ట్ వినియోగించాలని సూచించారు. మొదట గ్రామ సర్పంచులు తమ గ్రామంలోని ప్రజలకు రోడ్డు భద్రతను గురించి వివరించి రూల్స్ పాటించే విధంగా గ్రామ సర్పంచ్ బాధ్యత వహించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, మొబైల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఉల్లంఘించడం వంటి చర్యలు ప్రాణాంతక ప్రమాదాలకు దారితీస్తున్నాయని హెచ్చరించారు. వాహనం నడిపే సమయంలో వ్యక్తిగత భద్రతతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా దృష్టిలో ఉంచుకుని బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. యువతలో ట్రాఫిక్ నిబంధనల పట్ల అవగాహన పెంపొందించడం ఎంతో అవసరమని, విద్యార్థులు తమ కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా రోడ్డు భద్రత సందేశాన్ని చేరవేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో పోలీస్ శాఖతో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రతకు సంబంధించిన అవగాహన వీడియో లు ప్రదర్శించారు. ట్రాఫిక్ నియమాలపై నిపుణులు వివరణాత్మకంగా అవగాహన కల్పించారు. ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అత్యవసర పరిస్థితుల్లో స్పందించాల్సిన విధానం గురించి కూడా వివరించారు. ఈ కార్యక్ర



మంలో భాగంగా చిన్నారులతో నృత్య ప్రదర్శన ప్రజలను అకట్టుకోంది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, డీఎస్పీ అంజయ్య, డిపిఓ జయసుధ, మూమెంట్ సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకట్, రఘు, నవాబుపేట ఎస్సై గిరి, స్థానిక సర్పంచ్ నర్సింహారెడ్డి, డిప్యూటీ తాసిల్దార్ నవీన్ కుమా



ర్, ఎంపిడిఓ అనురాధ, వ్యవసాయ అధికారి జ్యోతి, పోలీస్ అధికారులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ సర్పంచ్‌లు, యువజన సంఘాల నాయకులు, విద్యార్థులు, మహిళలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రైతులకు ఉచిత విత్తనాల పంపిణీ



**ప్రజాపక్షం/నవాబుపేట్:** నవాబుపేట్ మండల కేంద్రం లోని రైతు వేదికలో మండల వ్యవసాయ అధికారి జ్యోతి ఆధ్వర్యంలో బుధవారం రైతులకు జనుము, కంది విత్తనాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. రైతులు ఆధునిక సాగు పద్ధతులను అవలంబిస్తూ వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన విత్తనాలను సద్వినియోగం చేసుకుని పంటల ఉత్పాదకతను పెంచుకోవాలని రైతులకు సూచించారు. మండల వ్యవసాయ అధికారి జ్యోతి మాట్లాడుతూ, రైతులకు అవసరమైన విత్తనాలు, సాంకేతిక సూచనలు అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. రైతులు వ్యవసాయ శాఖ సూచనలను పాటిస్తూ పంటల సాగు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ నర్సింహారెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాథోడ్ గీతాసింగ్, వైస్ చైర్మన్ బలవంత్ రెడ్డి, మాజీ పిఏసిఎస్ చైర్మన్ పోలీస్ రామిరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ నవీన్ కుమార్, ఎంపిడిఓ అనురాధ, నాయకులు రావుగారి వెంకట్ రెడ్డి, చిట్టెపు మల్లారెడ్డి, వ్యవసాయ శాఖ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, వివిధ గ్రామాల సర్పంచ్ లు, నాయకులు రైతులు, తదితరులు పాల్గొన్నారు.

**మూలమాడ దళిత కుటుంబంపై దాడి అమానుషం**

వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలం మూలమాడ గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఒక దళిత కుటుంబంపై జరిగిన దాడిపై చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితులకు తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఆయన భరోసా ఇచ్చారు. బుధవారం ఆయన మూలమాడ గ్రామాన్ని సందర్శించి, బాధితులను పరామర్శించి వారికి



ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ, స్థానిక సర్పంచ్ భర్త నరేందర్ రెడ్డి గ్రామంలో అరాచకాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఎస్సీ కాలనీపై పక్కా ప్రణాళికతో దాడికి తెగబడిన నరేందర్ రెడ్డిపై తక్షణమే రౌడీ షీట్ ఓపెన్ చేయాలని జిల్లా ఎస్పీని డిమాండ్ చేశారు. గతంలోనూ సదరు వ్యక్తిపై అట్రాసిటీ కేసులు ఉన్నాయని, ఇలాంటి వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. గత స్థానిక ఎన్నికల్లో నరేందర్ రెడ్డికి వ్యతిరేకంగా దళిత వర్గానికి చెందిన అభ్యర్థి పోటీ చేశారనే కక్షతోనే, రాజకీయ కోణంలో ఈ దాడికి పాల్పడ్డారని ఎమ్మెల్యే ఆరోపించారు.

**బిఆర్ఎస్ నేతల తీరుపై ధ్వజం**

ఇదే సమయంలో గ్రామాన్ని సందర్శించిన మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ ల తీరును కాలే యాదయ్య తీవ్రంగా తప్పుబట్టారు. బాధితులను పరామర్శించి న్యాయం చేయాల్సింది పోయి, కేవలం నిందితుల వైపు ఉన్న వర్గాన్ని మాత్రమే కలిసి మాట్లాడటం వారి స్థాయిని దిగజార్చుకోవడమేనని విమర్శించారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి బాధితులకు తగిన న్యాయం చేయాలని స్థానిక పోలీస్ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రామ్ రెడ్డి, మల్ రెడ్డి, నాగిరెడ్డి, ప్రభాకర్‌తో పాటు మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలే భవిష్యత్‌కు బాటలు

### బడిబాటకు విశేష స్పందన

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాల పెంపు లక్ష్యంగా ఘట్‌కేసర్‌లో బడిబాట కార్య క్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయ బృందాలు ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులను కలుసుకుని ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్న నాణ్యమైన విద్య, ఉచిత సౌకర్యాల గురించి అవగాహన కల్పించారు.ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన భవనాలు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఆంగ్ల మాధ్యమ బోధన,ఉచిత యూనిఫాంలు,పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, మధ్యాహ్న భోజనం,కంప్యూటర్ విద్య,క్రీడలు,యోగా,డిజిటల్ అక్షరాస్యత సాంస్కృతిక కార్యక్రమాలు వంటి అనేక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని ప్రజలకు వివరించారు.ఘట్‌కేసర్‌లోని ప్రాథమిక పాఠశాలలు, ఉన్నత పాఠశాలల్లో ప్రవేశాలు కొనసాగుతున్నాయని, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు.ఇటీవల ప్రకటించిన పదో తరగతి ఫలితాల్లో ఘట్‌కేసర్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని యామిని 576 మార్కులు సాధించి ప్రతిభ కనబర్చగా బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి 561 మార్కులు సాధించడం ప్రభుత్వ పాఠశాలల విద్యా ప్రమాణాలకు నిదర్శనమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కొమిడి పాపిరెడ్డి, జి,విజయ,ఉపాధ్యాయులు రాయాను జాచారి, యశ్‌పాల్,శైలజ మాజీ కౌన్సిలర్ శశికళబర్ల దేవేందర్ ముదిరాజ్.ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.




## కుషాయిగూడలో యువతి అదృశ్యం

**ప్రజాపక్షం/చర్లపల్లి:** యువతి అదృశ్యమైన సంఘటన కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సిఐ భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం జి. రుక్మిణి కూతు రు వర్ష (19) పారా మెడికల్ కాలేజీలో డిగ్రీ మొదటి సంవత్సరం పూర్తి చేసి కాప్రా హై టెన్షన్ లైన్‌లో స్కిన్ కేర్ హస్పిటల్‌లో పార్ట్ టైం జాబ్ చేస్తుంది.ప్రతి రోజులాగానే డ్యూటీకి వెళ్లి సాయంత్రం తిరిగి ఇంటికి వస్తుంది. మంగళవారం డ్యూటీకి వెళ్లి తిరిగి రాలేదు. కూతురుకు కాల్‌చేస్తే ఫోన్ స్విచాఫ్ ఉందని చుట్టుపక్కల వెతికిన ఎక్కడ ఆచూకీ లభించకపోవడంతో పిఎస్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.



## రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలి

### పిఎసి చైర్మన్ అరికెపూడి గాంధీ


**ప్రజాపక్షం/కూకట్‌పల్లి :** శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలో ఉషముళ్ళపూడి కమాన్ నుంచి గాజులరామారం వరకు వయా ఎల్లమ్మ బండ ప్రధాన రహదారిపై జరుగుతున్న 100 ఫీట్ రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలని పిఎసి చైర్మన్ అరికెపూడి గాంధీ అధికారులకు సూచించారు. బుధవారం మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, సిఎంసి ఇంజినీరింగ్, జలమండలి, విద్యుత్ శాఖ అధికారులతో కలిసి పిఏసి చైర్మన్ అరికెపూడి గాంధీ రోడ్డు పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్లమ్మబండ ప్రధాన రహదారిపై రోజు రోజుకూ ట్రాఫిక్ సమస్య తీవ్రతరమవుతోందని, ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని 100ఫీట్ రోడ్డు విస్తరణ చేపట్టినట్లు తెలిపారు. రోడ్డు విస్తరణకు అడ్డంకిగా ఉన్న రాళ్లు, విద్యుత్ స్థంభాలు, ఇతర అవరోధాలను తొలగించి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. విస్తరణ పనుల కారణంగా దెబ్బతిన్న మంచి నీటి పైప్‌లైన్‌లను వెంటనే పునరుద్ధరించాలని సూచించారు. పనుల్లో నాణ్య త విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. ఈ రోడ్డు పూర్తయితే ట్రాఫిక్ సమస్యలు తగ్గడంతో పా టు ప్రజలకు సమయం, ఇంధనం ఆదా అవుతుందని తెలిపారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధి కి నిరంతరం కృషి చేస్తానని, ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాల కల్పనకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జలమండలి, సిఎంసి ఇంజినీరింగ్, విద్యుత్ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



**ఎమ్మెల్యే గాంధీకి అభినందనల వెల్లువ**

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టిముక్కలు జశ్వంత్ రావు (దేశాల్) మియాపూర్‌లో నిర్వహించిన ముఖ్యమంత్రి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీని కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం సీనియర్ జర్నలిస్ట్ హరికృష్ణ జన్మదినం సందర్భంగా శాలువాతో ఘనం గా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే సోదరుడు స్వామి జన్మదిన వేడుకలు సందర్భంగా దేశాల్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అరికెపూడి గాంధీతో పాటు బండి రమేష్‌ని కలిసి వారి అశీస్సులు తీసుకున్నారు.





## భార్యను తుపాకీతో కాల్చి చంపిన రియల్ ఎస్టేట్ వ్యాపారి

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** రియల్ ఎస్టేట్ వ్యాపారి అనుమానంతో తన భార్యను తుపాకితో కాల్చి చంపిన ఉదంతం మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం మారుతీనగర్ ప్రాంతంలో నివాసం ఉంటూ రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేసే అరుణ్‌కుమార్ తన భార్య నిషారాణిని అనుమానిస్తున్న కారణంగా వారిద్దరి మధ్య గత కొద్ది కాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో అతడు బుధవారం తెల్లవారు జామున మరో వ్యక్తితో కల్సి ఇంటికి వచ్చి తుపాకితో భార్య నిషారాణిపై కాల్పులు జరిపి పరారయ్యాడు. బుల్లెట్ గాయాలతో తీవ్రంగా గాయపడ్డ ఆమె కింద పడిపోయి అక్కడికక్కడే మృతి చెందింది. కాల్పుల శబ్దం విన్న సమీపవాసులు అక్కడికి వచ్చి చూసే సరికి రక్తం మడుగులో గాయాలతో చనిపోయిన మహిళ విషయం పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనాస్థలికి చేరుకొన్న పోలీసులు మృతదేహాన్ని శవపంచనామా నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. నిందితుడైన అరుణ్‌కుమార్ 25 ఏళ్ల క్రితం వివాహం చేసుకొన్న స్వర్ణలతతో విడాకులు తీసుకొని ఆమె సోదరి అయిన మృతురాలు నిషారాణిని కొద్ది కాలం క్రితం ఆలయంలో ప్రేమ వివాహం చేసుకొన్నాడు. అప్పటి నుండి వారిద్దరు మారుతీనగర్‌లో నివాసం ఉంటుండగా అతడు భార్య నిషారాణిని అనుమానిస్తూ వేధిస్తూ ఘర్షణ పడేవాడు. మార్చి 26న వాహనాలు తనిఖీ చేస్తున్న అంబర్‌పేట పోలీసులకు అరుణ్‌కుమార్ తుపాకితో చిక్కటంతో అతడిని అరెస్టు చేసి జైలుకు పంపారు. జైలు నుండి తిరిగి వచ్చిన నిందితుడు ఇంటికి తిరిగి వచ్చి భార్య నిషారాణితో ఎప్పటి మాదిరిగానే ఘర్షణ పడుతున్న క్రమంలో బుధవారం తుపాకితో వచ్చి ఆమెపై కాల్పులు జరిపి హతమార్చాడు.



## కీసర రామలింగేశ్వరస్వామి అభిషేక కార్యక్రమంలో ఎంపి ఈటల

**ప్రజాపక్షం/చర్లపల్లి:** శ్రీ కీసరగుట్ట రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో స్వామి వారికి అభిషేక కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ అతిథిగా మల్కాజ్‌గిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్ ప్రత్యేక పూజలు చేసి ప్రధాని మోదీ అత్యధిక రోజులు పరిపాలించిన నాయకులుగా అయనకు గుర్తింపుదక్కిందని,ఆయురారోగ్యాలతో ఉండాలని ఆయన స్వామివారికి అభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బుద్ధి శ్రీనివాస్, సుదర్శన్‌రెడ్డి, చంద్రారెడ్డి, వేణుగోపాల్, జంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మార్కెట్ కమిటీ చైర్మన్ జన్మదిన వేడుకలు

### ఉన్నత పదవులు పొందాలని ఆశీర్వదించిన డిసిసి వజ్రేష్‌యాదవ్

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మేడ్చల మార్కెట్ కమిటి చైర్మన్ బొమ్మలపల్లి శ్రీనివాస్‌యాదవ్ జన్మదిన వేడుకలు బుధవారం ఉమ్మడి శామీర్‌పేట మండలంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ కమిటి అధ్యక్షుడు (డిసిసి) తోటకూర వజ్రేష్‌యాదవ్ ఎఎంసి చైర్మన్ నర్సింహాయాదవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కట్‌చేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. భవిష్యత్తులో మరెన్నో ఉన్నత రాజకీయ పదవులు పొందాలని ఆశీర్వదించారు. అలాగే శామీర్‌పేట కట్టమైసమ్మ ఆలయంలో ఎఎంసి చైర్మన్ జన్మదినం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటి చైర్మన్ భూమిరెడ్డి, వైస్ చైర్మన్ నరల్ల రమేష్, కోశాధికారి బాల్‌రాజ్‌లు చైర్మన్‌కు పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. జిల్లా ఆర్‌టిఎ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డి ఎఎంసి చైర్మన్‌ను శాలువా కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మూడుచింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు దోసకాయల వెంకటేష్ గజమాలతో ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుంకి రమేష్, కట్టమైసమ్మ మాజీ చైర్మన్ మ్యాకల మహేందర్‌యాదవ్, నాయకులు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



## గురుకుల డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లకు దరఖాస్తులు : ప్రిన్సిపాల్ డాక్టర్ ఇష్రత్

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో (జగద్గిరిగుట్ట) శామీర్‌పేట కళాశాలలో 2026–27 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లకు అర్హులైన విద్యార్థినిలు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇష్రత్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో బికామ్, (సిఏ. బిఏ), బిఎస్‌సి, బిజడ్‌సి, ఎంజడ్‌సి, ఎంఎస్‌డిఎస్, ఎంఏసిఎస్, ఎఎల్‌ఎంఎల్ కోర్సుల్లో సీట్లు ఉన్నాయని చెప్పారు. ఇంటర్ మీడియట్ పూర్తిచేసుకున్న షేడ్యుల్డ్ క్యాస్ట్ (ఎస్‌సి) మహిళ అభ్యర్థులకు అడ్మిషన్లు చేసుకోవచ్చని చెప్పారు. ఆసక్తి గలవారు ఈ నెల 20 లోపు పదవతరగతి, ఇంటర్ మీడియట్ మార్కుల మెమోలు, కుల, ఆదాయ, సిర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, ఇంటర్‌మీడియట్ టీసి, బోనోఫైడ్‌తో పాటు 8 పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలతో శామీర్‌పేట విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా ఉన్న కళాశాలకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇట్టి అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆ ప్రకటనలో ప్రిన్సిపల్ డాక్టర్ ఇష్రత్ కోరారు.

## బాలయ్య మృతి సిపిఐకి తీరనిలోటు

రంగారెడ్డి జిల్లా సిపిఐ కార్యదర్శి పాలమాకుల జంగయ్య



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం/ఎల్‌బి నగర్:** నమ్మిన సిద్ధాంతం కోసం పని చేసి పార్టీ బలోపేతం పాటు పార్టీ పోరాటాలు నిర్వహించిన నాయకుడిగా పేద ప్రజల కోసం అనునిత్యం ప్రజల్లో ఉండే సిపిఐ పార్టీ మంచాల్ మండలం కార్యదర్శిగా పని చేస్తున్న బండికంటి బాలయ్య మృతి పార్టీకి తీరనిలోటని రంగారెడ్డి జిల్లా సిపిఐ కార్యదర్శి పాలమాకుల జంగయ్య, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్రచారి అన్నారు. బుధవారం బాలయ్య మతదేహానికి పూలమాలలు వేసి. పార్టీ జెండా కప్పి నివాళిలర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలయ్య కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఓరుగంటి యాదయ్య, ముత్యాల యాదిరెడ్డి, టి.రామకృష్ణ, కావలి నరసింహ, బాతరాజు నరసింహ, నీలమ్మ, మండల కార్యదర్శి కావలి సురేష్, శేరిలింగంపల్లి మండల కార్యదర్శి చందు యాదవ్, గ్యార క్రాంతి కుమార్, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు సుధాకర్, రాజు నాయక్ తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

## సమస్యల పరిష్కారానికి గ్రామ సభ

మండల వ్యవసాయధికారి రవినాథ్



**ప్రజాపక్షం/యాచారం :** ప్రజా సమస్యల పరిష్కారం కోసమే గ్రామ సభలను ప్రభుత్వం నిర్వహిస్తుందని మండల వ్యవసాయాధికారి అర్ రవినాథ్ అన్నారు. బుధవారం యాచారం మండల పరిధిలోని నజ్జిక్‌సింగారం, కొత్తపల్లి,కేస్లి తండా ,తాడిపర్తి, ధర్మన్నగూడ, మంథనిగౌరేల్లి గ్రామంలో 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామ సభలను అయా గ్రామాల సర్పంచ్‌ల ఆధ్వర్యంలో గ్రామ సభలను నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కృష్ణ,నీలం జాన్సీ, అరవింద్‌నాయక్, చిక్కుడు వేన్నేల అయా గ్రామ పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కృషి



**ప్రజాపక్షం/యాచారం :** రంగారెడ్డి జిల్లా కందుకూర్ మండలం మిరఖాన్ పేట్ గ్రామ సమీపంలో అత్యాధునిక హంగులతో నిర్మించిన ఫోర్త్ సిటి భవన నిర్మాణం కోసం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరౌతన్న నేపథ్యంలో యాచారం మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యక్తలు మండల అధ్యక్షులు మోటే శ్రీశైలం అధ్వ ర్యంలో తరలి వేళ్ళారు. ఈ సంధర్భంగా శ్రీశైలం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం కట్టుబడి పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో మేడిపల్లి గ్రామ సర్పంచ్ సుగుణ సంపత్,అడాల గణేశ్,మధుకర్ రెడ్డి,ఎరుకలి బాల్‌రాజ్,చంద్రయ్య, సుందరయ్య తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్య పరిష్కరించాలి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** వనస్థలిపురం డివిజన్ పరిధిలో నెలకొన్న తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ వనస్థలిపురం డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు చింతల రవికుమార్ గుప్తా ఆధ్వర్యంలో బుధవారం జలమండలి డిప్యూటీ జనరల్ మేనేజర్(డిజిఎం) నాగరాజు వారి కార్యాలయంలో కలిసి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ లగ్గొని శ్రీధర్ గౌడ్, కొలిశెట్టి సంజయ్‌కుమార్, కాలనీల అధ్యక్షులు కరుణాకర్‌రెడ్డి, దూసరి మధు గౌడ్, ఆనంద్‌రాజ్, బాబురావు, గడాల రాజు, పివి నరసింహరావు, మిట్ట రామ్మోహన్, అశోక్, రవి కాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శ మున్సిపాలిటీయే లక్ష్యం



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** ఆదర్శ మున్సిపాలిటీగా అభివృద్ధి చేయాలన్నదే లక్ష్యంగా పని చేస్తున్నామని మున్సిపల్ వైస్ చైర్మెన్ అందె మోహన్ ముదిరాజ్ వివరించారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని 13,14వ వార్డుల్లోని ముదిరాజ్ భవనం వద్ద కౌన్సిలర్ రిజ్వానా ముబారక్ అలీఖాన్, వైస్ చైర్మెన్ అందె మోహన్ ముదిరాజ్ అధ్యక్షతన వార్డు సభ ఏర్పాటు చేశారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్, కమిషనర్ సునీతారెడ్డి, కొండే యాదయ్య, వార్డు ఆఫీసర్ రమేష్‌తోపాటు ప్రజలు పాల్గొన్నారు.

## సంఘటితమై హక్కులు సాధించుకోవాలి



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** సంఘటితమై హక్కులను సాధించుకునేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉందని తెలంగాణ ఉద్యమకారుల వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పి.వెంకట్‌రాంరెడ్డి అన్నారు. బుధవారం షాద్‌నగర్‌లో ఎస్సీ కార్పోరేషన్ మాజీ చైర్మెన్, తెలంగాణ ఉద్యమకారుల సంఘం వ్యవస్థాపకులు డాక్టర్ పిడమర్తి రవి ఆధ్వర్యంలో ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ దిలీప్, మంగులాల్‌నాయక్, జాంగారి రవి, శ్రీనివాస్‌రెడ్డి, మేకల వెంకటేష్, రవి కుమార్ గౌడ్, బోరెల్లి సురేష్, రహీమ్ తదితరులు పాల్గొన్నారు.

# వర్షాకాలంలో పరిశుభ్రతకు ప్రాధాన్యం





సిఎంసి కమిషనర్ డాక్టర్ జి.సృజన

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి) పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణను మరింత బలోపేతం చేయాలని కమిషనర్ డాక్టర్ జి. సృజనఅధికారులను ఆదేశించారు. సిఎంసి ప్రధాన కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఘన వ్యర్థాల నిర్వహణ, పరిశుభ్రత కార్యక్రమాల అమలుపై విస్తృతంగా చర్చించారు. అన్ని వార్డుల్లో పారిశుద్ధ్యం ఆటోలు ప్రతిరోజూ విధిగా నిర్వహించబడేలా చూడాలని, విధులకు హాజరు కాని పారిశుద్ధ్య కార్మికులను గుర్తించి నివేదికలు సమర్పించాలని సూచించారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జరిమానాల అమలుపై రోజువారీ నివేదికలు అందించాలని ఆదేశించారు. 'నో బిన్ నో ట్రేడ్' విధానాన్ని కఠినంగా అమలు చేసి వ్యాపార సంస్థల్లో వ్యర్థాల నిర్వహణపై బాధ్యత పెంచాలన్నారు. హెచ్‌ఎండబ్ల్యూఎస్ఎస్‌బి అధికారులతో కలిసి సంయుక్త తనిఖీలు నిర్వహించాలని సూచించారు. డ్రై, వెట్, శానిటరీ, స్పెషల్ కేర్ వ్యర్థాల నాలుగు విధాల వర్గీకరణను సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. నిర్మాణ, కూల్చివేత వ్యర్థాల సేకరణను మెరుగుపర్చేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన సైబరాబాద్ నిర్మాణమే లక్ష్యమని కమిషనర్ డాక్టర్ జి.సృజన అన్నారు.

## పారిశుధ్ద్యం, పచ్చదనానికి ప్రాధాన్యత

ఎంఎంసి కమిషనర్ టి.వినయ్ కృష్ణా రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పారిశుద్ధ్యం, పచ్చదనం పెంపుదలకు మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్(ఎంఎంసి) ప్రాధాన్యత ఇస్తోందని కమిషనర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి తెలిపారు. నాగోల్ పరిధిలోని ఫతుల్లాగూడ ప్రాంతంలో బుధవారం పర్యటించి పారిశుధ్ద్య, అర్బన్ బయోడైవర్సిటీ, దోమల నివారణ కార్యక్రమాలను పరిశీలించారు. ఇందు అరణ్య నుంచి గోల్డెన్ లీవ్స్ విల్లాస్ వరకు పరిశుభ్రతను సమీక్షించిన కమిషనర్, ఫుట్‌పాత్‌ల వెంట మొక్కల పెంపుదల ద్వారా పచ్చదనాన్ని విస్తరించాలని అధికారులకు సూచించారు. ఫతుల్లాగూడ చెరువును పరిశీలించి చెరువులో దోమల లార్వా కనిపించకపోయినా, సమీప బాక్స్ డ్రెయిన్‌లలో లార్వా ఉన్నట్లు గుర్తించారు. వెంటనే యాంటీ లార్వల్ ఆపరేషన్లు చేపట్టి దోమల ఉత్పత్తిని అరికట్టాలని ఆదేశించారు. వర్షాకాల సన్నద్ధతలో భాగంగా పలు ప్రాంతాల్లో నీటి నిల్వ సమస్యలను పరిశీలించిన కమిషనర్, స్టార్మ్ వాటర్ డ్రెయినేజీ వ్యవస్థను సమర్థవంతం గా నిర్వహించి, నీటి ముంపు సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.



## దోమల నివారణపై శిక్షణ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వర్షాకాలాన్ని పురస్కరించుకుని డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా వంటి వెక్టర్ బోన్ వ్యాధుల నివారణ, నియంత్రణే లక్ష్యంగా జిహెచ్‌ఎంసి పరిధిలోని మెట్రోపాలిటన్ సర్వైలెన్స్ యూనిట్ ఆధ్వర్యంలో బుధవారం క్షేత్రస్థాయి ఎంటమలాజీ సిబ్బందికి ప్రత్యేక పునశ్చరణ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. జిహెచ్‌ఎంసి చీఫ్ మెడికల్ ఆఫీసర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ కె. పద్మజ అధ్యక్షతన జరిగిన శిక్షణా కార్యక్రమాన్ని చార్మినార్, శంషాబాద్, ఖైరతాబాద్ జోన్‌లను కవర్ చేస్తూ రెండు బ్యాచ్‌లుగా నిర్వహించారు. కార్యక్రమానికి సికింద్రాబాద్, గోల్కొండ జోన్‌ల అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్స్ ఆఫ్ హెల్త్ (ఏఎంఓహెచ్‌లు), సీనియర్ ఎంటమలాజిస్టులు, వార్డు ఎంటమోలజీ సూపర్‌వైజర్లు, క్షేత్రస్థాయి సిబ్బందితో సహా మొత్తం 383 మంది ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సిఎమ్‌ఓహెచ్ మాట్లాడుతూ నగర ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటంలో జిహెచ్‌ఎంసి ఎల్లప్పుడూ ముందుంటుందని, అందుకోసమే సిబ్బందికి ఎప్పటికప్పుడు సామర్థ్య పెంపు శిక్షణ ఇస్తూ, పర్యవేక్షణను కఠినతరం చేస్తున్నామని తెలిపారు.



# నాటుసారా, నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌పై ఉక్కుపాదం





డిప్యూటీ కమిషనర్ దశరథ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** నాటుసారా, నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్, ప్యూరియస్ లిక్కర్ అక్రమ రవాణా మరియు విక్రయాలను పూర్తిస్థాయిలో అరికట్టాలని రంగారెడ్డి ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ పి. దశరథ్ అధికారులను ఆదేశించారు. మద్యం విక్రయాలపై ప్రభావం చూపుతున్న అక్రమ కార్యకలాపాలపై కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేసి, రెవెన్యూ పెంపుకు కృషి చేయాలని సూచించారు. బుధవారం అబ్కారీ భవన్‌లో నిర్వహించిన రంగారెడ్డి డివిజన్ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని ఐదు ఎక్సైజ్ జిల్లాల పరిధిలో ఆశించిన స్థాయిలో ఆదాయం రావాలంటే ఎక్సైజ్ స్టేషన్ల సిబ్బందితో పాటు ఎన్‌ఫోర్స్‌మెంట్, డీటీఎఫ్ బృందాలు మరింత చురుకుగా పనిచేయాలని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి విమానాశ్రయం మరియు ఇతర మార్గాల ద్వారా వస్తున్న నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌ను పూర్తిగా నియంత్రించాలని, నాటుసారాను పూర్తిగా నిర్మూలించే దిశగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే సింథటిక్ డ్రగ్స్ విక్రయాలు, వినియోగం, రవాణాపై ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న గంజాయి, డ్రగ్స్, నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్, బెల్లం, గుడుంబా తదితర వస్తువులను స్టేషన్లలో నిల్వ ఉంచకుండా సకాలంలో డిస్పోజల్ చేయాలని దశరథ్ ఆదేశించారు. ఇందుకు అవసరమైన అనుమతుల కోసం వెంటనే ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. సమావేశంలో శంషాబాద్, సరూర్‌నగర్, మల్కాజిగిరి, మేడ్చల్, వికారాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు కృష్ణప్రియ, ఉజ్వలరెడ్డి, నవీన్, ఫయాజోద్దీన్, విజయ్ భాస్కర్‌గౌడ్‌తో పాటు ఎఇఎస్‌లు, ఎన్‌ఫోర్స్‌మెంట్, డిటిఎఫ్ బృందాలు, సిఐలు పాల్గొన్నారు.

# రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం

'అరైవ్ అలైవ్' ద్వారా ప్రజలకు భద్రతా సందేశం




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రోడ్డు ప్రమాదాల నివారణ, ప్రజల ప్రాణాల రక్షణ లక్ష్యంగా మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్(ఎంఎంసి), తెలంగాణ పోలీస్ శాఖ సంయుక్తంగా 'అరైవ్ అలైవ్' పేరుతో రహదారి భద్రతా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తా, డిసిపిలు, ఏసిపిలు, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం, నాలుగు చక్రాల వాహనాల్లో సీటుబెల్ట్ వినియోగించడం, మద్యం సేవించి వాహనం నడపకపోవడం, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగాన్ని నివారించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. సురక్షితంగా ఇంటికి చేరుకోవడమే అసలు విజయమని, రోడ్డు భద్రతలో ప్రతి ఒక్కరూ తమ బాధ్యతను నిర్వర్తించాలని అధికారులకు పిలుపునిచ్చారు.

## కెసిఆర్ నిర్లక్ష్యంతోనే లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ పనుల్లో జాప్యం

మహబూబ్‌నగర్ ఎంపి డికె అరుణ



**ప్రజాపక్షం/కొందుర్గు:** మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ నిర్లక్ష్య వైఖరీ కారణంగానే లక్ష్మీ దేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణ పనులు, భూసేకరణలో తీవ్ర జాప్యం చోటు చేసుకుందని మహబూబ్‌నగర్ ఎంపి డికె అరుణ వివరించారు. బుధవారం కొందుర్గు మండల పరిధిలోని ఉమ్మెంత్యాల, రేగడిచిల్కమర్రి, జిల్లేడు చౌదరిగూడ మండల పరిధిలోని గుర్రంపల్లి గ్రామంలో హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. అదే విధంగా లక్ష్మీ దేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించి కొందుర్గులో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపిఅరుణ మాట్లాడుతూ లక్ష్మీ దేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణం పనులు చేస్తామని చెప్పి మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ఓట్లు దండుకున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర ఏళ్లు అవుతున్న నేటికి తట్టేడు మట్టి తీయలేదని ఆరోపించారు. రిజర్వాయర్ పేరులో కాలయాపన చేస్తున్నారే తప్పా అభివృద్ధి, ఈ ప్రాంత ప్రజల ఇబ్బందులను ఏమాత్రం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కొందుర్గు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు లేక రోగుల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే జిల్లా వైద్యాధికారులు స్పంధించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అందె బాబయ్య, నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి, రంగయ్య గౌడ్, మహేందర్‌రెడ్డి, భూపాలచారి, చిట్టెం లక్ష్మీ కాంత్‌రెడ్డి, శ్రీశైలం, పర్వతాపూర్ సర్పంచ్ అశోక్, షాద్‌నగర్ కౌన్సిలర్ ప్యాట అశోక్ పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యం..

తెలంగాణ ఈగల్ ఫోర్స్ అడిషనల్ ఎస్‌పి పి.కృష్ణమూర్తి



**ప్రజాపక్షం/కొత్తూరు:** డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా బాధితుల జీవితాల్లో వెలుగులు నింపడమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని తెలంగాణ ఈగల్‌ఫోర్స్ అడిషనల్ ఎస్పీ పి.కృష్ణమూర్తి సూచించారు. బుధవారం కొత్తూరు మండల కేంద్రంలో డి..ఎడిక్షన్ సెంటర్ల వద్ద మొక్కలు నాటారు. ప్రస్తుతం డి..ఎడిక్షన్ సెంటర్లలో చికిత్స పొందుతున్న వారితోపాటు ఇదివరకు విజయవంతంగా ట్రీట్‌మెంట్ పూర్తి చేసుకొని సాధారణ జీవితం గడుపుతున్న వారందరు ఉత్సాహంగా పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ కృష్ణమూర్తి మాట్లాడుతూ ఈగల్ ఫోర్స్ అంటే కేవలం డ్రగ్స్ సరఫరా చేసే ముఠాలను, విక్రేతలను పట్టుకొని జైలుకు పంపడమే కాదని స్పష్టం చేశారు. డ్రగ్స్ మహమ్మారి బారిన పడి తమ జీవితాలను పాడు చేసుకుంటున్న బాధితులను రక్షించడం, వారిలో మానసిన మార్పు తీసుకురావడం కూడా ఈ ఫోర్స్ ముఖ్య లక్ష్యమన్నారు. డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తెలంగాణను మార్చేందుకు ప్రజలందరు, యువత సహకరించాలని కోరారు.

## నూతన ఆవిష్కరణలతో భవిష్యత్తు



**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** ఎఐ, డేటా భద్రతలో అగ్రగామి ఆవిష్కర్త అయిన థియోమ్ తమ నూతన కార్యలయాన్ని హైద్రాబాద్‌లోని గచ్చిబౌలిలో ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐకమ్ (తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్ హబ్ ) వ్యవస్థాపక సిఇఓ ఫణి నాగార్జున, జిన్నోవ్ మేనేజింగ్ పార్టనర్ కార్తిక్ పద్మనాభన్, థియోమ్ సహ వ్యవస్థాపకుడు సీఈఓ నవీంద్ర యాదవ్ విచ్చేసి కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ నూతన ఆవిష్కరణలతో భవిష్యత్తు ఉంటుందన్నారు. హైద్రాబాద్‌లో తమ నూతన కార్యాలయాన్ని ప్రారంభించడం ద్వార దేశంలో తమ కార్యకలాపాలను విస్తరిస్తున్నామని , తమ కార్యకలాపాలను విస్తరిస్తున్న థియోమ్ ఇప్పుడు భారత్‌లో ఉత్పత్తి అవిష్కరణ, డేటా భద్రత, క్లౌడ్ రక్షణ, ఏఐ ఆధారిత ఎంటర్‌ప్రైజెస్ స్థిరత్వంలో అత్యాధునిక పురోగతులను సాధించేలా, నిర్వహణ నైపుణ్యానికి వ్యూహాత్మక కేంద్రంగా నిలువనుందని తెలిపారు. థియోమ్ హైద్రాబాద్ కార్యాలయం మా లక్ష్యానికి అనుగుణంగా డేటా భద్రత రంగాలలోని ఆవిష్కరణల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మా నూతన థియోమ్ కార్యాలయం ద్వార యువతకు మరిన్ని ఉద్యోగ అవకాశాలు అందించనున్నామని తెలిపారు.

# పేదల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తున్నాం

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** పేద ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పని చేస్తుందని, ఇచ్చిన హామీలను ప్రణాళిక బద్దంగా అమలు చేస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. బుధవారం షాద్‌నగర్‌లో బుడగ జంగాల కమ్యూనిటి హాల్ నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఇటీవల కాలంలోనే తన సొంత ప్లాట్‌ను బుడగ జంగాలకు ఇచ్చిన మాట ప్రకారం రిజిస్ట్రేషన్ చేయడంతోపాటు సుమారు రూ.20లక్షల మంజూరు చేసి కమ్యూనిటి హాల్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ సమాజంలో అన్ని వర్గాల అభ్యున్నతే తన లక్ష్యమని, ఆ దిశగానే అనేక పథకాలను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు వివరించారు. బుడగ జంగాలకు సామాజిక కార్యక్రమాలు, సమోవేశాలు నిర్వహించేందుకు ఈ భవనం ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్, కౌన్సిలర్లు రాజునాయక్, మురళిమోహన్, దిలీప్, కోఆప్షన్ సభ్యులు సయ్యద్ ఖదీర్, నేతలు బాల్‌రాజ్ గౌడ్, శ్రీనునాయక్, శ్రీశైలం గౌడ్, జయప్రకాష్, మంగ అశోక్, సుదర్శన్, రొమియో రమేష్, అన్వర్‌తోపాటు బుడగ జంగం సభ్యులు పాల్గొన్నారు.

### గ్రామీణ వైద్యులు నిబంధనలకు అనుగుణంగా సేవలందించండి

గ్రామీణ వైద్యులు ప్రభుత్వ నిబంధనలకు లొబడి ప్రజలకు వైద్యసేవలు అందించేందుకు కృషి చేయాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. బుధవారం పట్టణంలోని ధన్వంతరీ గ్రామీణ వైద్యులకు గుర్తింపు కార్డులను అంధించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉండే పేదలకు అత్యవసర వైద్యసేవలు అంధించి మెరుగైన సేవల కోసం ఉన్నతమైన ఆసుపత్రులకు తరలించేందుకు కృషి చేయాలని సూచించారు. భాదితులకు నాణ్యమైన వైద్యసేవలు అంధించేందుకు కృషి చేయాలని, పేదల ప్రాణాలతో చెలగాటం అడితే ఉపేక్షించేది లేదని సూచించారు. గ్రామీణ ప్రాంతాలోని పేద ప్రజలకు వైద్యసేవలు అంధించి అదుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ నడికుడ శ్రావణి, బాల్‌రాజ్ గౌడ్, శ్రీశైలం గౌడ్, కుమారస్వామిగౌడ్, యాదగిరి యాదవ్, మంగ అశోక్, మంగ మధు, ధన్వంతరీ గ్రామీణ వైద్యులు పాల్గొన్నారు.

## ఆర్‌టిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఐటి)గా బాధ్యతలు స్వీకరించిన ఎం.రాజశేఖర్

ఐటి విభాగాన్ని మరింత బలోపేతం చేసి, ప్రయాణికులకు డిజిటల్ సేవలు విస్తరిస్తాం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మారుతున్న కాలానికి అనుగుణంగా ఆర్‌టిసి ఐటి విభాగాన్ని మరింత బలోపేతం చేస్తామని, ప్రయాణికులకు టికెట్ బుకింగ్‌తో పాటు లైవ్ బస్ ట్రాకింగ్ వంటి డిజిటల్ సేవలను మరింత సులభతరంగా అందుబాటులోకి తీసుకువస్తామని ఈడీ(ఐటి) ఎం.రాజశేఖర్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిజిఎస్ ఆర్‌టిసి) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఐటీ,పి, ఎ.ఎం అండ్ లీగల్)గా సీనియర్ అధికారి ఎం. రాజశేఖర్ బుధవారం హైదరాబాద్‌లోని బస్ భవన్‌లో అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన టిజిఎస్ ఆర్‌టిసి ఎండి వై.నాగిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా నూతన ఈడీకి సంస్థ ఉన్నతాధికారులు, సిబ్బంది స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎం. రాజశేఖర్ మాట్లాడుతూ ఐటి విభాగంతో పాటు పర్సనల్, అస్సెట్ మేనేజ్మెంట్, లీగల్ విభాగాల బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహిస్తూ, సంస్థ ఆదాయ వనరులను పెంచడంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని చెప్పారు. సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ, అంతర్గత పరిపాలనను వేగవంతం చేస్తామని, అలాగే సంస్థకు సంబంధించిన న్యాయపరమైన అంశాలను సకాలంలో పరిష్కరించి ఆర్‌టిసి ప్రయోజనాలను కాపాడుతామని ఆయన పేర్కొన్నారు.



## ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజు దోపిడీని అరికట్టాలి

ప్రభుత్వానికి ఎఐఎస్ఎఫ్ డిమాండ్

**ప్రజాపక్షం/సుల్తాన్‌బజార్ :** ప్రభుత్వ విద్యా సంస్థల్లో నెలకొన్న మౌలిక సదుపాయాల కొరత, ఉపాధ్యాయుల ఖాళీలు, విద్యార్థులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను వెంటనే పరిష్కరించాలని.. అలాగే ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు వసూలు చేస్తున్న అధిక ఫీజుల దోపిడీపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎఐఎస్ఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు అనిల్ కుమార్, జిల్లా కార్యదర్శి చైతన్య యాదవ్‌లు హైదరాబాద్ విద్యాశాఖ అధికారిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో తగిన మౌలిక వసతులు, శాశ్వత అధ్యాపకుల నియామకాలు, ప్రమాణాలతో కూడిన విద్య అందించే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యను వ్యాపారంగా మార్చిన కార్పొరేట్ విద్యాసంస్థలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, ఫీజు నియంత్రణ చట్టాలను కఠినంగా అమలు చేయాలని వారు కోరారు. డిఎంఒను కలిసిన వారిలో ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి జోసెఫ్ భాను, ఉపాధ్యక్షుడు అరుణ్ కుమార్, నాయకులు సుమన్, గోపగోని ఉదయ్, ఆంజనేయులు తదితరులున్నారు.




## ఘనంగా బాలకృష్ణ జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం/ముషీరాబాద్:** టిడిపి నేత, ఎపి ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలు సికింద్రాబాద్ పార్లమెంట్ నాయకులు నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్‌గౌడ్ ఆధ్వర్యంలో హైదరాబాద్ జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో హైదరాబాద్ కోఆర్డినేటర్ నగు నగేష్, తెలుగుతమ్ముళ్లు తడక వినోద్, శ్యామ్‌సుందర్, భానుప్రకాష్, వెంకటేష్‌చౌదరి, ప్రమీల, ఝాన్సీ, ఎస్.ప్రకాష్, సాంబ శివరావు, రామారావు, ఆనంద్, విక్రం, కెడి.దినేష్, ఎల్.రవి, సత్తన్న, బి.రాజు, యాదగిరి, జోగిందర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



## పనులు త్వరగా పూర్తిచేయాలి

యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్‌మెరాజ్

**ప్రజాపక్షం/యాకుత్‌పురా:** వర్షాకాలం నేపథ్యంలో నాలాలు, వరద ప్రభావిత ప్రాంతాల్లో చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మెరాజ్, చార్మినార్ జెడ్‌సి కన్నం సత్యనారాయణ బుధవారం నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మౌలాకాచిల్లా, తలబ్‌కట్టా, అమర్‌నగర్, భవానీనగర్, గంగానగర్ నాలా, డబీర్ పురా నాలాల్లో జరుగుతున్న పూడికతీత పనులు, నీటి ప్రవాహానికి ఉన్న అడ్డంకులు, డ్రైనేజీ సమస్యలు, వర్షపు నీరు నిల్వ కాకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. పర్యటనలో మాజీ కార్పొరేటర్లు డాక్టర్ సమీనాబేగం, సయ్యద్ సోహెల్ ఖాద్రి, జీహెచ్‌ఎంసీ యాకుత్‌పురా డిసి సుభాష్‌రావు, ఇంజినీరింగ్ విభాగం ఎస్‌ఈ ఇందిరాదేవి, ఈ. యాదగిరి, శానిటేషన్ డిఈ రంజిత్‌రెడ్డి, డిఈలు, ఏఈలు, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు

## ఎక్లాట్ హెల్త్ వాటాల కొనుగోలు

**ప్రజాపక్షం/బంజారాహిల్స్ :** హెల్త్‌కేర్ టెక్నాలజీ, రెవెన్యూ సైకిల్ మేనేజ్మెంట్ ఎక్లాట్ హెల్త్ సొల్యూషన్స్, ప్రైవేట్ ఈక్విటీ గల్ఫ్ క్యాపిటల్ నుంచి వాటాలను కొనుగోలు చేసింది. దీంతో పూర్తి యాజమాన్య హక్కులు వ్యవస్థాపకులు, మేనేజ్మెంట్ బృందానికి దక్కాయి. గల్ఫ్ క్యాపిటల్‌తో ఐదేళ్ల భాగస్వామ్యంలో ఎక్లాట్ తన ఆదాయాన్ని పది రెట్లు పెంచుకుంది. అమెరికా, ఇండియా, ఫిలిప్పీన్స్ దేశాల్లో ఉద్యోగుల సంఖ్యను 450 నుంచి 4,000 పైగా పెంచుకుంది. రాబోయే కాలంలో సొంత కృత్రిమ మేధ ప్లాట్ఫారం ఎవైర్ సహాయంతో హెల్త్‌కేర్ రంగంలో మరిన్ని ఆవిష్కరణలతో ముందుకు సాగనుంది.

# అక్రమంగా నవజాత శిశువు విక్రయం

జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు




**ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ:** నవజాత మగ శిశువు విక్రయం వ్యవహారాన్ని కుల్సుంపురా పోలీసులు బట్టబయలు చేశారు. జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి తదుపరి దర్యాప్తు నిమిత్తం నందిగామ పిఎస్ (రంగారెడ్డి జిల్లా)కు బదిలీ చేయడం జరిగింది. వివరాలలోకి వెళితే.. ఈనెల 9న సాయంత్రం 4 గంటలకు మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యాలయానికి చెందిన ప్రొటెక్షన్ అధికారి కె.రాము కుల్సుంపురా పోలీస్‌స్టేషన్‌లో లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులోని ముఖ్యాంశాలు...ఒక నవజాత మగ శిశువును చట్టవిరుద్ధంగా విక్రయించి, బదిలీ చేస్తున్నారనే నమ్మదగిన సమాచారం రావడంతో శిశు సంక్షేమ శాఖ ప్రాథమిక విచారణ చేపట్టింది. ఈ విచారణలో దిగ్భ్రాంతికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. సుమారు 18 సంవత్సరాలుగా పిల్లలు లేని మధుసూదన్, మీనా అనే దంపతులు పిల్లల కోసం వెతుకుతున్నారు. ఈక్రమంలోనే వారు జియాగూడ, పుకట్‌నగర్ నివాసి పోతరాజు సురేష్‌ను సంప్రదించి, తమకు ఒక బాబును ఇప్పించాల్సిందిగా సహాయం కోరారు. దీంతో సురేష్ పరిచయం ఉన్న పద్మ పల్తియా అనే మహిళను సంప్రదించాడు. వీరిద్దరూ మధ్యవర్తులుగా ఒక నవజాత మగ శిశువును అప్పగించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ క్రమంలోనే గత నెల 28న చందర్, సంధ్య దంపతులకు తుక్కుగూడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో శిశువు మోహన్ జన్మించాడు. అయితే, ఆ బాబు శారీరక వైకల్యంతో జన్మించినట్లు దర్యాప్తులో తెలిసింది. ఈ క్రమంలోనే బంధువు అయిన పద్మకు ఆ బాబును అప్పగించేందుకు మోహన్, సంధ్య దంపతులు అంగీకరించారు. ఈ ఒప్పందం ప్రకారం, రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం పరిధిలోని జెపి దర్గా వద్ద మధ్యవర్తి సురేష్ సమక్షంలో మధుసూదన్, మీనా దంపతులు రూ.1,70,000ల నగదును మధ్యవర్తి అయిన పద్మకు చెల్లించి, ఆ నవజాత శిశువును తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఈ మొత్తం లావాదేవీ, బదిలీ ప్రక్రియ అంతా కూడా చట్టప్రకారం దత్తతకు నిర్దేశించిన ఎటువంటి చట్టపరమైన నిబంధనలను పాటించకుండా పూర్తిగా అక్రమంగా నిర్వహించారు. విశ్వసనీయ సమాచారం అందడంతో సుమారు 12 రోజుల వయస్సు ఉన్న సదరు అపరిచిత మగ శిశువును చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఆదేశాల ప్రకారం సురక్షిత రక్షణ, సంరక్షణ కల్పించే నిమిత్తం అమీర్‌పేట్ మధురానగర్ మెట్రోస్టేషన్ సమీపంలో ఉన్న 'శిశు విహార్'లో చేర్చడం జరిగింది. నేరం జరిగిన ప్రదేశం రంగారెడ్డి జిల్లాలోని నందిగామ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వస్తున్నందున.. కుల్సుంపురా పోలీస్ స్టేషన్లో జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి తదుపరి దర్యాప్తు, రీరిజిస్ట్రేషన్ నిమిత్తం నందిగామ పోలీస్‌స్టేషన్‌కు కుల్సుంపురా సిఐ ఎ.రాములు బదిలీ చేయడం జరిగింది.

# ముదిమి వయస్సులో కడుపుకోత

కుమారులకు తలకొరివి పెట్టిన తండ్రి

మరో జీవన పోరాటం ప్రారంభం



**ప్రజాపక్షం/కాచిగూడ:** ఏ తండ్రి అయినా కొడుకుల చేత తలకొరివి పెట్టించుకోవాలని కోరుకుంటాడు. కానీ ఓ తండ్రి ఏకంగా ముగ్గురు కుమారులకు తానే తలకొరివి పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆరేండ్ల క్రితం క్యాన్సర్‌తో భార్యను కోల్పోయిన నాగభూషణం... 65 ఏండ్ల వయస్సులో భగవంతుడు నాకు పరీక్ష పెడుతున్నాడని కన్నీటి పర్యంతం అయ్యాడు. పుణ్యస్థానం కోసం వెళ్లి గోదావరి నదిలో మునిగి ముగ్గురు కుమారులు చనిపోవడంతో చప్పల్ బజార్‌లో నివాసముండే నాగభూషణం కడుపుకోతను తట్టుకోలేకపోతున్నాడు. ఫుట్ పాత్ వ్యాపారం చేసుకుని జీవనం సాగించే ముగ్గురు కుమారులు కళ్లముందే విగత జీవులుగా మారడాన్ని ఆయన జీర్ణించుకోలేకపోతున్నాడు. చేతికి అందివచ్చిన కుమారులు అనంతలోకాలకు వెళ్లడంతో వారి పిల్లల బాధ్యత వృద్ధాప్యంలో ఆయనపై పడింది. పిల్లల అక్షరాభ్యాసం కోసం చప్పల్‌బజార్‌లో అద్దెకు ఉండే నాగభూషణం కుమారులు చంద్రశేఖర్, రామచందర్, మల్లేష్‌కుమార్ బాసరకు వెళ్లారు. ఈ క్రమంలోనే వారు బాసరలోని గోదావరి నదిలోకి స్నానం కోసం వెళ్లారు. అనూహ్యంగా ముగ్గురు అన్నదమ్ములు గల్లంతయ్యారు. గాలింపు చర్యలు చేపట్టిన స్థానిక అధికారులు వారి మృతదేహాలను వెలికితీశారు. ఈ క్రమంలోనే వారి మృతదేహాలను స్థానికుల సహకారంతో చప్పల్‌బజార్‌కు చేర్చారంటే వారి ఆర్థిక పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. సికింద్రాబాద్‌లో ఫుట్‌పాత్ వ్యాపారం చేసుకుని జీవనం సాగిస్తున్న వారిలో చిన్నవాడు మల్లేష్‌కుమార్‌కు ఇంకా వివాహం కాలేదు. ఇదిలా ఉండగా ముగ్గురు మృతుల అంత్యక్రియలను కాచిగూడలోని హిందూ శ్మశానవాటిక ట్రస్ట్ కమిటీ బుధవారం ఉచితంగా నిర్వహించింది. ఈ సందర్భంగా బాధితులను మాజీ కార్పొరేటర్లు కన్నె ఉమ, దిడ్డి రాంబాబు, కాలేరు పద్మ, బిజెపి నేత నందకిశోర్‌యాదవ్, ఎక్కాల కన్న, బిఆర్ఎస్ నేతలు బద్దుల శిరీష, దాత్రిక్ నాగేందర్, భీష్మాదేవ్, కాచిగూడ సిఐ ఎస్.రాజశేఖర్ ఓదార్చి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

# బివి ఆర్‌ఐటిలో అంతర్జాతీయ సదస్సు



**ప్రజాపక్షం/సుల్తాన్‌బజార్ :** బివి రాజు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అంతర్జాతీయ ఐఈఈఈ వైర్లెస్, యాంటెన్నాస్ అండ్ మైక్రోవేవ్ సింపోజియం ప్రారంభమయ్యింది. సదస్సును ముఖ్యఅతిథిగా విచ్చేసిన యూఎస్ఎకు చెందిన లినిట్రిస్ సంస్థ చీఫ్ ఇంజనీర్ ఫిల్ వెనెజియా, గౌరవ అతిథులు ఐఈఈఈ యాంటెన్నాస్ అండ్ ప్రొపగేషన్ సొసైటీ మాజీ అధ్యక్షుడు (ఆస్ట్రేలియా) ప్రొఫెసర్ క్రిస్టోఫ్ ఫ్యూమోక్స్, ఎస్వీఇఎస్ కార్యదర్శి ఆదిత్య విస్సం లాంఛనంగా ప్రారంభించారు. జూన్ 10 నుంచి 13 వరకు జరిగే ఈ నాలుగు రోజుల సదస్సులో 18 దేశాలకు చెందిన శాస్త్రవేత్తలు, పరిశోధకులు హాజరవుతున్నారు. 1,059 పరిశోధనా పత్రాలలో 753 పత్రాలు ఎంపికయ్యాయి. 6జీ సాంకేతికత, అధునాతన యాంటెన్నా వ్యవస్థలు, భవిష్యత్ వైర్లెస్ కమ్యూనికేషన్ రంగాలపై అంతర్జాతీయ నిపుణులు తమ పరిశోధనలను పంచుకోనున్నారు. కార్యక్రమంలో బివిఆర్ఐటి ప్రిన్సిపాల్ సంజయ్ దూబే, డబ్ల్యుఎఎంఎస్ సొసైటీ అధ్యక్షుడు, అదానీ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ధవల్ పుజారా, డబ్ల్యుఎఎంఎస్ సొసైటీ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ అనంత భారతి, డబ్ల్యుఎఎంఎస్2026 సలహాదారులు, ఐఈఈఈ లైఫ్ ఫెలో (అమెరికా) డాక్టర్ సుధాకర్ కే రావు తదితరులు పాల్గొని ప్రసంగించారు.



## ఆసుపత్రుల ద్వారా మెరుగైన వైద్యసేవలు అందించాలి

జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ పుట్ట శ్రీనివాస్

**ప్రజాపక్షం/హైదకాబాద్ సిటీ :** జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా మెరుగైన వైద్యసేవలు అందాలని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ పుట్ట శ్రీనివాస్ ఆదేశించారు. అమీర్‌పేటలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని తెలిపారు. మెరుగైన వైద్యసేవలు అందినప్పుడే ప్రభుత్వ ఆసుపత్రులకు గుర్తింపు రావడంతో పాటు ప్రభుత్వ వైద్యసేవలపై, ఆసుపత్రులపై ప్రజలకు నమ్మకం కుదురుతుందన్నారు. ఆసుపత్రిలో జరుతున్న మాతా శిశుసంరక్షణ, వ్యాధినిరోధక టీకాల కార్యక్రమం, నాన్ కమ్యూనికేబుల్ వ్యాధుల కార్యక్రమాన్ని సమీక్షించారు. వివిధ ఆరోగ్య కార్యక్రమాల, పథకాల లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అమీర్‌పేట క్లస్టర్ సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హేమలత, వైద్యులు, జిల్లా మాస్‌మీడియా అధికారి జక్కుల రాములు పాల్గొన్నారు.

## అంబర్‌పేట శంకర్‌పై బెదిరింపుల కేసు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అపార్ట్‌మెంట్ నిర్మాణంలో భాగస్వాముల మధ్య తలెత్తిన వివాదం వివాదానికి దారి తీసింది. హైదరాబాద్‌లో ప్రముఖ బిల్డర్ ఆంజనేయులును అంబర్‌పేట్ శంకర్, గ్యాంగ్ బెదిరింపులకు పాల్పడిన ఘటన కలకలం రేపింది. తనను, తన కుటుంబాన్ని హత్య చేస్తామని బెదిరిస్తూ భారీ మొత్తంలో డబ్బు డిమాండ్ చేస్తున్నారని శంకర్‌పై ఆంజనేయులు బంజారాహిల్స్ పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు దిశ బాధితుడు బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.పోలీసుల వివరాల ప్రకారం.. ఆంజనేయులు తన వ్యాపారంలో భాగస్వామితో కలిసి సుమారు 600 గజాల స్థలంలో అపార్ట్‌మెంట్ నిర్మాణాన్ని చేపట్టారు. ఈ ప్రాజెక్టులో శంకర్‌తో పాటు బిల్డర్ సేత్ అంబర్‌పేట్ శంకర్, అయాన్ గ్యాంగ్ సభ్యులు కూడా భాగస్వాములుగా ఉన్నారు. అయితే వాటాల విషయంలో విభేదాలు తలెత్తడంతో వివాదం ముదిరింది. ఈ నేపథ్యంలో గత నెల 24న శంకర్‌కు చెందిన కార్యాలయానికి వెళ్లిన ఆంజనేయులును శంకర్ గ్యాంగ్ సభ్యులు బెదిరింపులకు పాల్పడి భారీ మొత్తంలో డబ్బు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా గత నెల 27న మరోసారి కార్యాలయానికి వెళ్లి శంకర్, ఆయన అనుచరులపై దాడికి యత్నించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అక్రమ వసూళ్లు, బెదిరింపులు, దౌర్జన్యాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితుడు పోలీసులను కోరారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా, నిందితుల కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నట్లు సమాచారం.

## న్యాయ సాధనలో 'ధన్వంతరి' బాధితుల ముందడుగు

విక్టిమ్స్ రైట్స్ ప్రొటెక్షన్ ట్రస్టు కన్వీనర్ గిరిప్రసాద్ శర్మ



**ప్రజాపక్షం/హిమాయత్‌నగర్ :** ధన్వంతరి ఫౌండేషన్ ఇంటర్నేషనల్‌కు సంబంధించిన వందల కోట్ల రూపాయల డిపాజిట్ మోసం కేసులో ఇటీవల చోటుచేసుకొన్న పరిణామాల పట్ల విక్టిమ్స్ రైట్స్ ప్రొటెక్షన్ ట్రస్టు ఆశావహంగా స్పందించింది. వేలాది మంది మంది పెట్టుబడిదారులను ప్రభావితం చేసిన ఈ కేసులో న్యాయం సాధన దిశగా ఒక ముందడుగు వేసినట్టు ట్రస్టు కన్వీనర్ గిరి ప్రసాద్ శర్మ తెలిపారు. బుధవారం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లో ఆయన మాట్లాడారు. ధన్వంతరి ఫౌండేషన్ బాధితుల ప్రయోజనాల పరిరక్షణకు, దర్యాప్తును వేగవంతానికి మరిన్ని చర్యలు తీసుకొంటామని సిసిఎస్ ప్రకటించడం, మరోవైపు హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలవడం విశేష పరిణామమన్నారు.
బెంగళూరు చాముండి అగ్రహారం పేరుతో సేకరించిన నిధుల వ్యవహారంపై ట్రస్టు దృష్టిసారించినట్టు తెలిపారు. ఇప్పటికే జప్తు చేయబడిన, అటాచ్ చేయబడిన ధన్వంతరి ఆస్తులను ప్రభుత్వ పర్యవేక్షణలో పారదర్శకంగా వేలం వేసి, వచ్చిన మొత్తాన్ని చట్ట ప్రకారం బాధితులకు పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు. సిసిఎస్ అధికారులు 'ధన్వంతరి' కుట్రలో పాల్గొన్న ప్రతి వ్యక్తిని చట్టం ముందు నిలబెట్టడం, దర్యాప్తును త్వరితగతిన చేయాలని విజ్ఞప్తి చేశారు.
ఇందుకు ట్రస్టు సంపూర్ణ సహకారంతోపాటు పోరాటాన్ని కొనసాగిస్తుందన్నారు. ధన్వంతరి ఆస్తుల రికవరీ, బాధ్యులపై చట్టపరమైన చర్యలే తమ లక్ష్యమని స్పష్టంచేశారు. బాధితులందరూ ఐక్యంగా సహనంతో, అప్రమత్తంగా ఉండాలని గిరిప్రసాద్ శర్మ పేర్కొన్నారు. సమావేశంలో కో-కన్వీనర్ మామిళ్లపల్లి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




## మధ్యాహ్నం సమయంలోనూ చెత్త తొలగించాలి

చార్మినార్ జెడ్‌సి కన్నం సత్యనారాయణ ఆదేశం

**ప్రజాపక్షం/చార్మినార్:** తమ పరిధిలోని ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు పర్యటిస్తూ పారిశుధ్య సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని చార్మినార్ జెడ్‌సి కన్నం సత్యనారాయణ పారిశుధ్య విభాగం అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. ఈ మేరకు యాకుత్‌పురా, సంతోష్‌నగర్, చార్మినార్ సర్కిళ్లకు చెందిన పారిశుధ్య నిర్వహణ, అధికారులు, సిబ్బంది పనితీరుపై జెడ్‌సి కార్యాలయంలో బుధవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పారిశుధ్య నిర్వహణ, రాంకీ సంస్థ సిబ్బంది చెత్త తరలింపు, స్వచ్ఛ ఆటో టిప్పర్ సిబ్బంది, ఎస్ఎఫ్ఏల పనితీరు, ఇతర సమస్యలపై జోనల్ కమిషనర్ సత్యనారాయణ ఆరా తీశారు. రోడ్లపై పేరుకుపోయే చెత్తను ఉదయం, రాత్రి వేళలతో పాటు ప్రత్యేకంగా మధ్యాహ్నం సమయంలో తొలగించాలని జోనల్ కమిషనర్ సత్యనారాయణ రాంకీ సంస్థ ప్రతినిధులు నందకిషోర్, అరవింద్‌లకు సూచించారు. సమీక్ష సమావేశంలో యాకుత్‌పురా, సంతోష్‌నగర్ సర్కిళ్ల డిసిలు సుభాష్‌రావు, భాస్కర్‌రెడ్డి, శానిటేషన్ డీఈ వెంకట్‌రాజు, సానిటరీ సూపవైజర్లు, సానిటరీ జవాన్లు, ఎస్ఎఫ్ఏలు పాల్గొన్నారు.



## భారీ వర్షంతో ఇబ్బందులు

**ప్రజాపక్షం/ముషీరాబాద్:** తొలకరి పలకరింపుతో కురిసిన భారీ వర్షంతో గాంధీనగర్ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో సుమారు 70కి పైగా భారీ చెట్లు కుప్పకూలాయి. విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. లోతట్టు ప్రాంతాలైన అరుంధతినగర్, సబర్మతినగర్, దోభిఘాట్ బస్తీల్లో వరద నీరు ఇళ్లలోకి చేరి ప్రజలు భయాందోళన చెందారు. గాంధీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఎ.పావని సూచనలతో బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, బీజేవైఎం నాయకులతో కలిసి బుధవారం సాయంత్రం వరకు నిర్విరామంగా ఎమర్జెన్సీ అధికారులతో కలిసి కూలిన చెట్ల కొమ్మలు, విరిగి పడిన విద్యుత్ తీగలు తొలగించడంలో సహకరించారు.



## రాజకీయాల్లోకి యువత

వైద్య శాఖ మాజీ డైరెక్టర్ డాక్టర్ గడల శ్రీనివాసరావు


**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** రాజకీయాల ప్రక్షాళన కోసం యువత రాజకీయాల్లోకి రావాలని వైద్య శాఖ మాజీ డైరెక్టర్ డాక్టర్ గడల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... పవన్‌కళ్యాణ్‌ను ఆదర్శంగా తీసుకొని రాజకీయాల్లోకి వచ్చానని తెలిపారు. సమావేశంలో జనసేన నాయకులు వేముల మహేష్, గడ్డి నరేష్, మిర్యాల రామకృష్ణ పాల్గొన్నారు.



## ఉప సర్పంచ్‌లకు చెక్ పవర్ ఇవ్వాలి

తెలంగాణ గిరిజన ఉపసర్పంచుల సంఘం

**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** తెలంగాణ, గ్రామ పంచాయతీల్లో ఉప సర్పంచ్‌లకు చెక్ పవర్‌ను రద్దు చేయవద్దని తెలంగాణ గరిజన ఉప సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భానోత్ సురేష్ నాయక్ డిమాండ్ చేశారు. బుధవారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ గిరిజన ఉప సర్పంచ్‌ల సంఘం అద్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా తాండా గ్రామ పంచాయితీల్లో సుమారు 1,250 మంది ఉప సర్పంచ్‌లు ఆయా గ్రామాల అభివృద్ధి కోసం పాటు పడుతున్నారని వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీలే అధికంగా ఉప సర్పంచులు ఉన్నారని గుర్తుచేశారు. బడుగుల హక్కులను ప్రభుత్వం కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో గిరిజన ఉప సర్పంచ్‌ల సంఘం నాయకులు భుఖ్య భావుసింగ్, భుఖ్య జయంత్ లాల్, మాతంగి రమేష్, జాతవ్ జాయ్ సింగ్, అనురాధ పాల్గొన్నారు.



## ఇష్టం ఉన్నవారే 'యాక్టింగ్ తహసీల్దార్'గా వెళ్లొచ్చు

సిసిఎల్ఎ కీలక నిర్ణయం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నయాబ్ తహసీల్దార్లకు (డిటి) ఎలాంటి పదోన్నతి లేకుండా 'యాక్టింగ్ తహశీల్దార్స్'గా ఇతర జిల్లాలకు బదిలీ చేయడాన్ని మెజారిటీ డిటిలు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ సమస్యపై తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (టిజిఆర్ఎస్ఎ) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బాణాల రాంరెడ్డి, వి.భిక్షం నేతృత్వంలో ప్రతినిధులు బుధవారం తెలంగాణ ఉద్యోగుల జెఎసి చైర్మన్ వి.లచ్చిరెడ్డిని ఆశ్రయించారు. లచ్చిరెడ్డి చొరవతో టిజిటిఎ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్. రాములు, రమేష్ పాక, టిజిఆర్ఎస్ఎ ప్రతినిధుల బృందం సిసిఎల్ఎ లోకేశ్ కుమార్‌తో ప్రత్యేకంగా భేటీ అయింది. ఆసక్తి లేని వారిని బలవంతంగా ఇతర జిల్లాలకు పంపించవద్దని వారు కోరారు. దీనిపై సిసిఎల్ఎ సానుకూలంగా స్పందిస్తూ ఎవరికైతే ఇష్టం ఉంటుందో వారు మాత్రమే యాక్టింగ్ తహసీల్దార్‌గా వెళ్లవచ్చని, ఇష్టం లేని వారు ఆయా జిల్లా కలెక్టర్లకు రాతపూర్వకంగా రాసి ఇస్తే సరిపోతుందని స్పష్టం చేశారు. దీంతో డిటిల బదిలీల ఉత్కంఠకు తెరపడింది. కాగా, ఇదే సమయంలో 290 మంది సీనియర్ అసిస్టెంట్లకు డిటిలుగా పదోన్నతి కల్పించడం పట్ల ఉద్యోగ సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేశారు.

అసాధారణ అధికారాలను ఉపయోగించి...

## 'పోక్సో' చట్టం కింద విధించబడిన ఓ వ్యక్తి శిక్షను రద్దుచేసిన 'సుప్రీంకోర్టు'



**న్యూఢిల్లీ :** రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 కింద తన అసాధారణ అధికారాలను ఉపయోగించి సుప్రీంకోర్టు పోక్సో చట్టం కింద ఓ వ్యక్తికి విధించ బడిన శిక్షను రద్దు చేసింది. బాధితురాలు మేజర్ అయిన తర్వాత నిందితుడిని వివాహం చేసుకున్న విషయాన్ని గమనించిన అత్యున్నత న్యాయస్థానం దోషిపై విధించిన పోక్సో కేసు శిక్షను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. తన ముందున్న ఏ కేసులోనైనా సంపూర్ణ న్యాయం జరిగేలా చూడటానికి అవసరమైన ఏ ఉత్తర్వును అయినా జారీ చేసే అధికారాన్ని రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 సుప్రీంకోర్టుకు కల్పిస్తుంది.

ఈ కేసులో ఆ అబ్బాయి, అమ్మాయి ఇరువురూ ఆ అమ్మాయి 12వ తరగతి చదువుతున్నప్పుడు ప్రేమలో పడ్డారు. అతను ఆమెను పెళ్లి చేసుకోవడానికి నిరాకరించినప్పుడు ఆమె అతడిపై ఫిర్యాదు చేసింది. ఫలితంగా మైనర్‌తో శారీరక సంబంధం పెట్టుకున్న అతడికి పిల్లలపై లైంగిక నేరాల రక్షణ చట్టం (పోక్సో) కింద 10సంవత్సరాల జైలు శిక్ష విధించబడింది. ఆ మహిళ తర్వాత మరొక వ్యక్తిని పెళ్లి చేసుకుంది. కానీ ఆమె గత సంబంధం గురించి తెలిసిన కొద్ది రోజులకే అతడు ఆమెను విడిచిపెట్టాడు. బెయిల్‌పై బయట ఉన్నప్పుడు ఆ వ్యక్తి ఆమెతో రాజీపడి పెళ్లి చేసుకుని కలిసి జీవించడం మొదలు పెట్టారు. వివాహం తర్వాత ఆ జంట కలిసి జీవించడం ప్రారంభించింది. ఆ తర్వాత పోక్సో చట్టం కింద తన భర్తకు విధించిన శిక్షను రద్దు చేయాలని కోరుతూ ఆ మహిళ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించింది. అయితే, హైకోర్టు ఆమె అభ్యర్థనను తిరస్కరించడంతో ఆ జంట సుప్రీంకోర్టును ఆశ్రయించింది. న్యాయమూర్తులు జస్టిస్ జె.కె.మహేశ్వరి, జస్టిస్ అతుల్ ఎస్.చందుర్కర్‌లతో కూడిన ధర్మాసనం అప్పీల్‌దారుడు, భార్యాభర్తలుగా సమాజంలో శాంతియుతంగా తమ జీవితాన్ని గడపటానికి స్వేచ్ఛ ఉందని పేర్కొంది. 'ఈ కేసు యోగ్యతలలోకి ప్రవేశించకుండా, ప్రస్తుత వాస్తవాల దృష్ట్యా పోక్సో చట్టంలోని సెక్షన్ 5(1) కింద ఉన్న అభియోగంపై అప్పీల్‌దారుడికి విధించిన తీర్పు, శిక్షను రద్దుచేయడానికి భారత రాజ్యాంగంలోని 142 అధికరణం కింద మా సంపూర్ణ అధికారాన్ని వినియోగించడం సముచితమని మేం భావిస్తున్నాం. అప్పీల్‌దారుడు ఆ అభియోగం నుండి నిర్దోషిగా విడుదల చేయబడినాడు' అని ధర్మాసనం తెలిపింది. ఈ ఉత్తర్వు కేసులోని వాస్తవాల ఆధారంగానే జారీ చేయబడిందని, దీనిని మరే ఇతర కేసుకూ ఆదర్శంగా పరిగణించబోమని సుప్రీంకోర్టు పేర్కొంది. 'జూన్ 3, 2019ఉత్తర్వు ద్వారా హైకోర్టు అప్పీల్‌దారుడికి విధించిన ప్రధాన జైలుశిక్షను నిలిపివేసినందున, వేరే ఏదైనా కేసులో అవసరమైతే తప్ప ఆయన లొంగిపోవాల్సిన అవసరం లేదు' అని ధర్మాసనం స్పష్టం చేసింది.

### విద్యాశాఖ మంత్రి రాజీనామా

## చేయకపోతే దేశవ్యాప్త నిరసన

సిజెపి వ్యవస్థాపకుడు దీప్కే హెచ్చరిక



**పుణె :** పరీక్షలలో పదేపదే జరుగుతున్న అక్రమాలు దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీస్తున్నాయని 'కాక్రోచ్ జనతా పార్టీ' (సిజెపి) వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే ఆందోళన వ్యక్తం చేశారు. అక్రమాలకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ బాధ్యత వహిస్తూ తన రాజీనామా చేయాలన్న డిమాండ్‌ను దీప్కే పునరుద్ఘాటించారు. బుధవారం పుణెలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులపై ప్రభావం చూపే సమస్యల విషయంలో దేశ యువత ఇకపై మౌనంగా ఉండటానికి సిద్ధంగా లేరని హెచ్చరించారు. విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయకపోతే దేశవ్యాప్త నిరసన చేపడతామని హెచ్చరించారు. ఒక విషయం ఇప్పుడు రుజువైందని, ఈ దేశ యువత ఇక భయపడరు, వెనక్కి తగ్గరు అని స్పష్టం చేశారు. ఇప్పటివరకు నీట్ పరీక్షకు సంబంధించిన సమస్యల కారణంగా పలువురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం ఉందని దీప్కే చెప్పారు. నీట్, సిబిఎస్ఇ, క్యూట్ వంటి పరీక్షలకు సంబంధించిన సమస్యల వల్ల కోటి మందికిపైగా విద్యార్థులు ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు. ఈ పరిస్థితికి బాధ్యత వహించడానికి ఎవరూ సిద్ధంగా లేరని విమర్శించారు. తాము ఈ నెల 6న జంతర్ మంతర్ (ఢిల్లీలో) వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించి, ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశామన్నారు. వ్యవస్థ వైఫల్యం కారణంగా, వైద్యులుగా మారి ప్రాణాలను కాపాడగలిగే సామర్థ్యం ఉన్న విద్యార్థులు తమ ప్రాణాలనే కోల్పోయారని మండిపడ్డారు. శనివారంలోగా మంత్రి రాజీనామా చేయాలని తమ పార్టీ కోరిందని, లేనిపక్షంలో దేశవ్యాప్త ఆందోళనను ప్రారంభిస్తామని దీప్కే తెలిపారు. 'రాజీనామా రాకపోతే, మేము దేశవ్యాప్త ఉద్యమాన్ని ప్రారంభిస్తాము. ఇది పుణె నుండే మొదలవుతుంది. గురువారం సాయంత్రం 4 గంటలకు పుణెలో శాంతియుత నిరసన చేపడతాము. ఆ తర్వాత లక్నో, అమృత్‌సర్, జైపూర్, బెంగళూరులలో కూడా నిరసనలు నిర్వహిస్తాము' అని ఆయన చెప్పారు. ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలని కోరుతూ లక్షలాది మంది అభ్యర్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడిందని దీప్కే ఆరోపించారు. 'ప్రశ్నపత్రాల లీకేజీలు జరుగుతున్నాయి, సర్వర్లు పనిచేయడం లేదు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి ఎవరు బాధ్యత వహిస్తారు? ఇది ఎంతకాలం కొనసాగుతుంది? అని ఆయన ప్రశ్నించారు. తమ ఆందోళన కార్యక్రమాలను వివరిస్తూ ప్రధాన్ పదవి నుంచి తప్పుకోకపోతే 20న దేశవ్యాప్తంగా ఉన్న యువత ఢిల్లీలో సమావేశమవుతారని తెలిపారు. తానే స్వయంగా నిరసనలో పాల్గొని, ప్రజలను జాతీయ రాజధానికి రావాలని విజ్ఞప్తి చేస్తానన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయకపోతే, దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులు, యువత ఢిల్లీకి వచ్చి, ఆయన రాజీనామా చేసే వరకు వెనుదిరగరని దీప్కే హెచ్చరించారు.

### ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన...

## 'నేడు' నీతి ఆయోగ్

### 11వ పాలకమండలి సమావేశం

**న్యూఢిల్లీ :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురువారం జరుగనున్న నీతి ఆయోగ్ 11వ పాలకమండలి సమావేశానికి అధ్యక్షత వహించనున్నారు. ఈ సమావేశంలో వికసిత్ భారత్ @ 2047 కోసం ప్రభుత్వ సమగ్ర మానవ అభివృద్ధి దార్శనికతను సాకారం చేసే విధానంపై చర్చించి, దానిని దేశ వ్యాప్తంగా ప్రతీ పౌరుడికి స్పష్టమైన, కొలువగల ఫలితాలుగా అనువదించడంపై చర్చించనున్నారు. ఒక అధికారిక ప్రకటన ప్రకారం... ఈ సంవత్సర పాలకమండలి సమావేశంలో ముఖ్యమంత్రులు, లెఫ్టినెంట్ గవర్నర్లు కలిసి 'సమ్మిళిత మానవ అభివృద్ధి చట్రం'పై చర్చిస్తారు. ఈ చట్రం ప్రాథమిక మానవ మూలధనం, భవిష్యత్తుకు సిద్ధంగా ఉండే నైపుణ్యాలు, ఉత్పాదక ఉపాధి, వ్యవస్థాపకత, వికేంద్రీకృత వృద్ధి, ఆరోగ్యం, పోషణ, శ్రేయస్సు, అందరికీ సమానత్వం, గౌరవం అనే నాలుగు స్థంభాలపై ఆధారపడి ఉంటుంది. దేశ వ్యాప్తంగా వ్యవస్థాపకతను ప్రోత్సహించడం, నైపుణ్యాభివృద్ధి, సుస్థిర ఉపాధి అవకాశాలు కల్పించే చర్యలపై కూడా ఈ సమావేశంలో చర్చిస్తారని అది తెలిపింది. పాలన, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (డిపిఐ), కన్వర్జెన్స్, భాగస్వామ్యాలు, డేటా ఆధారిత వ్యవస్థలతో సహా కీలకమైన సాధనాలను ఉపయోగించుకునే ఒక రోడ్ మ్యాప్‌ను సమష్టిగా రూపొందించడంపై ఈ చర్చలు దృష్టి సారిస్తాయి. దీంతోపాటు జవాబుదారీతనం, కొలువగల ప్రభావాన్ని నిర్ధారిస్తూ, స్వల్ప, మధ్యకాలిక, దీర్ఘకాలిక ఫలితాలను పర్యవేక్షించడానికి ఒక వ్యవస్థీకృత యంత్రాంగాన్ని కూడా ఏర్పాటు చేస్తాయి. సమ్మిళిత మానవ అభివృద్ధిపై జాతీయ దృక్పథంతో రాష్ట్రాల దృక్పథాలను సమన్వయం చేయడం, సమానమైన, సుస్థిరమైన వృద్ధి దిశగా ఏకీకృత సహకార విధానాన్ని బలోపేతం చేయడంపై ప్రధానంగా దృష్టి సారిస్తామని అధికారిక ప్రకటన పేర్కొంది. ప్రకటన ప్రకారం 2025 డిసెంబరు 26–28 తేదీలలో జరిగిన 5వ జాతీయ ప్రధాన కార్యదర్శుల సదస్సు సిఫారసులపై పాలకమండలి దృష్టి సారించనుంది.

## మోదీకి మంత్రివర్గం ప్రశంసలు



**న్యూఢిల్లీ :** ప్రధాని నరేంద్రమోదీకి కేంద్ర మంత్రివర్గం శుభాకాంక్షలు తెలియజేసింది. భారతదేశానికి నిరంతరాయంగా అత్యధిక కాలం పనిచేసిన ఎన్నికైన ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ నిలిచిన సందర్భంగా, కేంద్ర మంత్రివర్గం బుధవారం ఆయన 'వికసిత భారత్' దార్శనికతకు మద్దతు తెలిపింది. జాతీయ భద్రత, సమ్మిళిత వృద్ధి, సామాజిక న్యాయంపై మోదీ నాయకత్వాన్ని ప్రశంసిస్తూ ఒక తీర్మానాన్ని ఆమోదించింది. మోదీ అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఆమోదించిన ఈ తీర్మానం, ఎన్నికైన ప్రధానమంత్రిగా జవహర్‌లాల్ నెహ్రూ నెలకొల్పిన 4,398 రోజుల రికార్డును అధిగమించినందుకు ఆయనను అభినందించింది. మోదీ నాయకత్వంలో భారతదేశం 'ఆత్మనిర్భర, సురక్షిత, సంపన్న దేశంగా కొత్త శిఖరాలను అధిరోహిస్తుందని' విశ్వాసం వ్యక్తం చేసింది. మోదీ పదవిలో 4,399 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా మంత్రివర్గ సభ్యులు ఆయనకు నిలబడి చప్పట్లు కొట్టి ఘనస్వాగతం పలికారు. ప్రభుత్వ రాజకీయ, అభివృద్ధి ఎజెండాకు గట్టి మద్దతు తెలుపుతూ, 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశాన్ని నిర్మించడంలో మోదీ నాయకత్వానికి మంత్రివర్గం 'సంపూర్ణ మద్దతు' ప్రకటించింది. అలాగే 'ప్రజా సేవకు ఆయన అవిశ్రాంత అంకిత భావాన్ని' ప్రశంసించింది. సమ్మిళిత వృద్ధి, సామాజిక న్యాయం కోసం మోదీ చేసిన కృషిని ఈ తీర్మానం ప్రశంసించింది. అలాగే, జాతీయ భద్రతను బలోపేతం చేయడంలో, భారతదేశ ప్రయోజనాలను పరిరక్షించడంలో ఆయన నాయకత్వాన్ని కొనియాడింది. పేదల కోసం సంక్షేమ కార్యక్రమాలను ముందుకు నడిపించడం, అణగారిన వర్గాలను సాధికారత కల్పించడం వంటి ఘనతలను కూడా క్యాబినెట్ ప్రధానమంత్రికి ఇచ్చింది. ఆయన హయాంలో 2.5 కోట్లకు పైగా ప్రజలు పేదరికం నుండి బయటపడ్డారని కూడా క్యాబినెట్ పేర్కొంది. మోదీ నాయకత్వంలో బిజెపి నేతృత్వంలోని జాతీయ ప్రజాస్వామ్య కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 12 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న తరుణంలో ఈ తీర్మానం వెలువడింది. వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చిన దాదాపు రెండేళ్లలోనే అత్యధిక కాలం పనిచేసిన ప్రధానమంత్రిగా మోదీ నిలిచారు. 2014 మే 26న, ఆ ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి విజయం సాధించడంతో మోదీ తొలిసారిగా పదవీ బాధ్యతలు చేపట్టారు. 2019లో ఆయన తిరిగి అధికారంలోకి వచ్చారు. లోక్‌సభలో బిజెపి బలం తగ్గుతున్నప్పటికీ, 2024 జూన్ 9న ఆయన వరుసగా మూడోసారి ప్రమాణ స్వీకారం చేశారు.

## స్టీల్ ప్లాంట్ ప్రమాదంలో 9కి చేరిన మృతులు

చికిత్స పొందుతూ ప్రాణం విడిచిన కార్మికుడు పైడి రాజు

**విశాఖపట్నం :** విశాఖ ఉక్కు కర్మాగారంలో జరిగిన ఘోర ప్రమాదంలో మరొక కార్మికుడు మతి చెందారు. దీంతో మృతుల సంఖ్య 9 కి చేరింది. ఈనెల 8వ తేదీ సాయంత్రం సలసల మరుగుతున్న ఉక్కు ద్రవం లావాలా ఎగసి కార్మికులపై పడటంతో 8 మంది మతి చెందారు. మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో స్థానిక సెవెన్ హిల్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పైడిరాజు బుధవారం ఉదయం మతి చెందినట్టు అధికారులు తెలిపారు.

**మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం**
**వైఎస్ జగన్ డిమాండ్**

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదంలో మృతుల కుటుంబాలకు కోటి రూపాయల చొప్పున పరిహారంతో పాటు ఆయా కుటుంబాల్లో పిల్లలకు ఉద్యోగాలు కూడా ఇవ్వాలని మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధ్యక్షుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఒకవేళ చంద్రబాబు ప్రభుత్వం ఆ పని చేయకపోతే... కొంచెం ఓపిక పట్టాలని, తమ ప్రభుత్వం ఏర్పడగానే నెల రోజుల్లో కోటి రూపాయల చొప్పున పరిహారం ఇస్తామని ఆయన వెల్లడించారు. సంస్థలో గతంలో జరిగిన ప్రమాదాల్లో బాధితులకు తగిన సహాయం అంది ఉండకపోతే, వారిని కూడా ఆదుకుంటామని ఆయన చెప్పారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న కార్మికులను జగన్ పరామర్శించారు.



## రాహుల్‌గాంధీ, అభిషేక్ బెనర్జీ భేటీ

**న్యూఢిల్లీ :** పరస్పర సమన్వయాన్ని బలోపేతం చేయడానికి, ఐక్యతను కాపాడుకోవడానికి ప్రతిపక్ష ఇండియా కూటమి యత్నిస్తోంది. ఈ నేపథ్యంలో లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, తృణమూల్ కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ బుధవారం ఢిల్లీలో సమావేశమయ్యారు. ప్రతిపక్ష కూటమిని మరింత పటిష్టం చేసే మార్గాలపై తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ తన నివాసంలో మాజీ కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీతో చర్చించిన మరుసటి రోజు 10 జనపథ్‌లో రాహుల్, అభిషేక్ భేటీ జరిగింది. సోమవారం ఢిల్లీలో జరిగిన ఇండియా కూటమి సమావేశంలోని చర్చల అనంతరం కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్‌ల మధ్య కొనసాగుతున్న సంప్రదింపులలో భాగంగానే రాహుల్ గాంధీ, అభిషేక్ బెనర్జీల మధ్య బుధవారం జరిగిన సమావేశాన్ని చూస్తున్నట్లు వర్గాలు తెలిపాయి. ఈ సమావేశ వివరాలు వెంటనే అందుబాటులోకి రానప్పటికీ, ఇటీవల జరిగిన పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత తృణమూల్ కాంగ్రెస్ తన శ్రేణులలోనే తిరుగుబాటును ఎదుర్కొంటున్న సమయంలో జరిగిన ఈ సమావేశానికి ప్రాధాన్యత సంతరించుకుంది. సోమవారం జరిగిన ఇండియా కూటమి సమావేశంలో, బిజెపి ఎదుర్కోవడంలో కూటమి భాగస్వాముల మధ్య మరింత సమన్వయం, ఐక్యత అవసరమని ప్రతిపక్ష నాయకులు నొక్కి చెప్పారు. ప్రజలకు సంబంధించిన సమస్యలపై విభేదాలను పక్కనపెట్టి కలిసి పనిచేయాలని కూటమిలోని భాగస్వామ్య పక్షాలను మమతా బెనర్జీ కోరారు.

## తృణమూల్‌కు మరో ఎదురుదెబ్బ

పార్టీకి, రాజ్యసభ సభ్యత్వానికి సుష్మితా దేవ్ రాజీనామా

ఒక్క వారంలోనే ఇద్దరు సభ్యులు రాజీనామా

**న్యూఢిల్లీ :** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత అంతర్గత సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీకి చెందిన రాజ్యసభ సభ్యురాలు సుష్మితా దేవ్ బుధవారం పార్టీకి, రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఎంపిగా దేవ్ సమర్పించిన రాజీనామాను రాజ్యసభ చైర్మన్ సి.పి.రాధాకృష్ణన్ ఆమోదించారు. 'పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తున్న రాజ్యసభ (కౌన్సిల్ ఆఫ్ స్టేట్స్) సభ్యురాలు సుష్మితా దేవ్ తన రాజ్యసభ స్థానానికి రాజీనామా చేశారు. ఆమె రాజీనామాను రాజ్యసభ చైర్మన్ జూన్ 10, 2026 నుండి అమల్లోకి వచ్చేలా ఆమోదించారు' అని రాజ్యసభ సచివాలయం ఒక ప్రకటనలో తెలిపింది. 2021లో కాంగ్రెస్ పార్టీని వీడి టిఎంసిలో చేరిన దేవ్, ఇప్పుడు రాజీనామా సమర్పించిన తర్వాత అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మను కలవడంతో, ఆమె బిజెపిలో చేరే అవకాశం ఉందని వర్గాలు పేర్కొన్నాయి. టిఎంసి అధినేత్రి మమతా బెనర్జీ గురించి లేదా తన భవిష్యత్తు రాజకీయ ప్రణాళికల గురించి వ్యాఖ్యానించడానికి నిరాకరించిన దేవ్, 'ఏ రకమైన రాజకీయాలు చేయాలి, నా నాయకుడు ఎవరు ఉండాలి అనేది నా వ్యక్తిగత నిర్ణయం. నాకు తగిన కారణాలు ఉన్నాయి, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నాను' అని అన్నారు. బిజెపిలో చేరతారన్న వార్తలపై స్పందిస్తూ, తాను ఏదైనా నిర్ణయం తీసుకున్నప్పుడు తెలియజేస్తానన్నారు. వ్యక్తిగత, రాజకీయ కారణాల వల్ల రాజీనామా చేశానని చెప్పిన దేవ్, తమ అభిప్రాయాన్ని మార్చుకునే హక్కు, ఏ రకమైన రాజకీయాలు చేయాలనేది నిర్ణయించుకునే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందని పేర్కొన్నారు. మాజీ కేంద్ర మంత్రి, కాంగ్రెస్ నాయకుడు సంతోష్ మోహన్ దేవ్ కుమార్తె అయిన ఆమె, గతంలో అసోంలోని సిల్చార్ నియోజకవర్గం నుండి లోక్‌సభ సభ్యురాలిగా పనిచేశారు. ఆమె అఖిల భారత మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా కూడా వ్యవహరించారు. కాగా, 'రాజ్యసభ సభ్యురాలిగా నా పదవీకాలంలో అందించిన సహాయ సహకారాలకు గాను గౌరవనీయులైన చైర్మన్, డిప్యూటీ చైర్మన్, రాజ్యసభ సచివాలయ అధికారులందరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను' అని చైర్మన్‌కు రాసిన లేఖలో దేవ్ పేర్కొన్నారు. ఈ వారంలో రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసిన రెండవ తృణమూల్ కాంగ్రెస్ ఎంపి దేవ్. అంతకుముందు మరొక టిఎంసి నాయకుడు సుఖేందు శేఖర్ రాయ్ కూడా పార్టీకి, రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)కి రాజీనామా చేసి బిజెపిలో చేరిన ఏడుగురు ఎంపిల మాదిరిగానే, తమ పార్టీకి చెందిన పలువురు ఎంపిలు కూడా ఒక ప్రత్యేక వర్గంగా ఏర్పడి అధికార ఎన్‌డిఎతో జతకట్టాలని నిర్ణయించుకుంటున్నట్లు సమాచారం. తృణమూల్ పార్టీకి చెందిన 80 మంది ఎమ్మెల్యేలలో మెజారిటీ సభ్యులు ఇప్పటికే ఒక ప్రత్యేక వర్గంగా ఏర్పడ్డారు.

## అమరావతిలో సెంట్రల్ సెక్రటేరియట్

రూ.1,299 కోట్లతో నిర్మాణం

మరో రూ.1,234 కోట్లతో ఉద్యోగుల నివాస సముదాయం

భారీ ప్రాజెక్టుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం

**అమరావతి :** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి కేంద్ర ప్రభుత్వం కీలక ప్రాజెక్టు ప్రకటించింది. సెంట్రల్ సెక్రటేరియట్ నిర్మాణానికి సంబంధించి సిపిడబ్ల్యుడి ప్రతిపాదనలకు బుధవారం ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశం ఆమోదం తెలిపింది. దీంతో అమరావతిలో రూ.2,534 కోట్లతో సెంట్రల్ సెక్రటేరియట్ నిర్మాణానికి రంగం సిద్ధమైంది. ఇందులో భాగంగా కామన్ సెంట్రల్ సెక్రటేరియట్ కోసం రూ.1,299.08కోట్లు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల నివాస సముదాయాలకు రూ.1,234.91 కోట్లు వెచ్చించనుంది. కామన్ సెంట్రల్ సెక్రటేరియట్‌లో కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఒకే ప్రాంగణంలో కొలువుదీరనున్నాయి. దాదాపు 23 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో కార్యాలయ సముదాయం నిర్మితమవుతుంది. అలాగే అమరావతి కేంద్రంగా పనిచేసే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 31.30 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో 11 టవర్లతో నివాస సముదాయాలను నిర్మించనున్నారు. ఆధునిక కమ్యూనిటీ హాల్స్, గ్రీన్ ఎనర్జీ సదుపాయాలు కల్పించనున్నారు. ప్రాజెకు సెంట్రల్ సెక్రటేరియట్ నిర్మాణం కోసం ఇప్పటికే సిఆర్‌డిఎ 22.53 ఎకరాలు కేటాయించింది. ఇందులో 5.53 ఎకరాల్లో సెక్రటేరియట్, 17 ఎకరాల్లో నివాస సముదాయం నిర్మాణం చేపట్టనున్నారు.

## నెహ్రూతో మోదీని పోల్చలేం

తొలి ప్రధాని దేశానికి చేసిన సేవలు మరువలేనివి : శరద్‌పవార్

**ముంబయి :** మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూను ఎన్‌పి (ఎస్‌పి) చీఫ్ శరద్ పవార్ ప్రశంసించారు. దేశ నిర్మాణానికి ఆయన చేసిన త్యాగాలను, సేవలను మరువలేమన్నారు. నెహ్రూకు ప్రధాని నరేంద్ర మోదీకి మధ్య పోలికే లేదని పేర్కొన్నారు. ఎన్‌సిపి (ఎస్‌పి) 27వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా బుధవారం ముంబయిలో జరిగిన మీడియాతో సమావేశంలో శరద్ పవార్ మాట్లాడారు. ప్రధాని మోదీ అత్యధిక కాలం ప్రధానిగా పనిచేసిన వ్యక్తిగా నిలిచారని, అయితే ఆయన స్థాయికి సాటి వచ్చే నాయకుడు లేరనే వాతావరణాన్ని చిత్రీకరిస్తున్నారన్నారు. దేశ నిర్మాణానికి, స్వాతంత్ర్య పోరాటానికి నెహ్రూ చేసిన సేవలను మరువలేమని, ఆయనను గౌరవించాలని పవార్ అన్నారు. 'ఆయనను మరెవరితోనూ పోల్చలేము.

మహాత్మా గాంధీ నాయకత్వంలో జరిగిన స్వాతంత్ర్య పోరాట సమయంలో నెహ్రూ చాలా సంవత్సరాలు జైలులో గడిపారు' అని మాజీ కేంద్ర మంత్రి అన్నారు. దేశంలో అత్యధిక కాలం ప్రధానిగా పనిచేసిన వ్యక్తిగా మోదీ నిలవడాన్ని ప్రస్తావిస్తూ, 'ఇది మంచి విషయం. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో, ప్రధానమంత్రి పదవి రాజ్యాంగబద్ధమైనది, మనం దానిని గౌరవించాలి. కానీ నెహ్రూ నెహ్రూనేను, ఆయన త్యాగాలను భారతీయులు మరువలేరు' అని అన్నారు. అధికారంలో ఉన్నవారు రైతులు, విద్యావంతులైన నిరుద్యోగులు, మహిళల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దేశం అనేక సమస్యలతో సతమతమవుతోందని చెప్పారు. దేశ విదేశాంగ విధానం కూడా ఆశించిన స్థాయిలో లేదన్నారు.

సిక్కులపై మాజీ ప్రధానులు ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ అఘాయిత్యాలకు పాల్పడ్డారని ఆరోపించిన మహారాష్ట్ర మంత్రి, బిజెపి నాయకుడు గిరీష్ మహాజన్‌పై పవార్ విమర్శలు గుప్పించారు. అలాంటి ప్రకటన ఆమోదయోగ్యం కాదని హితవు పలికారు. ఆపరేషన్ బ్లూ స్టార్ అనేది ఇందిరా గాంధీ చేసిన త్యాగమని, సిక్కులు దేశ సరిహద్దుల భద్రత కోసం, ఆహార భద్రత కోసం పనిచేశారన్నారు. కొందరు వేరే మార్గాన్ని ఎంచుకున్నారని, వాటిని మరచిపోలేమని, ఇందిరా గాంధీ దేశ ప్రతిష్ట, భద్రత విషయంలో ఎన్నడూ రాజీపడలేదని పవార్ స్పష్టం చేశారు.

## నేడు కాంగ్రెస్ విస్తృత సమావేశం

**న్యూఢిల్లీ :** ప్రస్తుత రాజకీయ పరిస్థితి, పార్టీ ప్రణాళికలపై చర్చించేందుకు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు, ఇన్‌చార్జ్‌లు, రాష్ట్ర యూనిట్ అధ్యక్షులతో గురువారం సమావేశం ఏర్పాటు చేసింది. ఈ కీలక సమావేశానికి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అధ్యక్షత వహిస్తారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ తెలిపారు. ప్రస్తుత రాజకీయ పరిణామాలపై చర్చించేందుకు ఎఐసిసి ప్రధాన కార్యదర్శులు, ఇన్‌చార్జ్‌లు, పిసిసి అధ్యక్షుల అత్యవసర సమావేశం గురువారం న్యూఢిల్లీలోని ఇందిరా భవన్‌లో జరగనుంది అని ఆయన తెలిపారు. రాజ్యసభ ఎన్నికలకు కాంగ్రెస్ మధ్యప్రదేశ్ అభ్యర్థి మీనాక్షి నటరాజన్ నామినేషన్‌ను తిరస్కరించిన అంశంపై వివాదం చెలరేగిన నేపథ్యంలో ఈ సమావేశం జరుగుతోంది. అంతేకాకుండా, టిఎంసికి చెందిన పలువురు ఎంపిలు, ఎమ్మెల్యేలు తిరుగుబాటు చేయడంతో ఆ పార్టీలో నెలకొన్న రాజకీయ సంక్షోభం నేపథ్యంలో కూడా ఈ సమావేశం జరుగుతోంది. సమన్వయాన్ని బలోపేతం చేయడానికి, ఐక్యతను కాపాడుకోవడానికి ప్రతిపక్ష ఇండియా కూటమి చేస్తున్న ప్రయత్నాల మధ్య, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, తృణమూల్ కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ బుధవారం ఇక్కడ సమావేశమయ్యారు.

ఈ వారం ప్రారంభంలో, నీట్, సిబిఎస్ఇ వివాదంపై విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఇండియా బ్లాక్ సభ్యులు ఇక్కడ సమావేశమై ఏకగ్రీవంగా నిర్ణయించారు.

## మాదే అసలైన 'టిఎంసి'

పార్టీపై పూర్తి హక్కు తమకే

కాంగ్రెస్ పార్టీలో విలీనమయ్యే ప్రణాళికలేవి : రీటాబ్రత

**కోల్‌కతా :** కాంగ్రెస్ నాయకత్వంతో తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ జరిపిన సమావేశాలు భవిష్యత్తుపై కొత్త ఊహాగానాలకు దారితీస్తున్నాయి. ఈ నేపథ్యంలో అసమ్మతి నాయకుడు రీటాబ్రత బెనర్జీ బుధవారం తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) పై తమకే హక్కు ఉందని ప్రకటించారు. తమ అసమ్మతి వర్గమే 'అసలైన టిఎంసి' అని, కాంగ్రెస్ పార్టీలో విలీనమయ్యే ప్రణాళికలేవీ తమకు లేవని ఆయన స్పష్టం చేశారు. తమ అసమ్మతి వర్గం బలం 58 నుండి 64 మంది ఎమ్మెల్యేలకు పెరిగిందని రీటాబ్రత పేర్కొన్నారు. పార్టీకి చెందిన మెజారిటీ శాసనసభ్యులు, ఎంపిల మద్దతు తమకు పెరుగుతుందని, తాము తృణమూల్ కాంగ్రెస్ పేరుతోనే కొనసాగుతామని రాష్ట్ర అసెంబ్లీ వెలుపల రీటాబ్రత విలేకరులతో అన్నారు. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీతో మమతా బెనర్జీ సమావేశం కావడం, ఢిల్లీలో అభిషేక్ బెనర్జీ, సీనియర్ కాంగ్రెస్ నాయకుల మధ్య చర్చలు జరిగాయన్న వార్తల నేపథ్యంలో రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతున్న తరుణంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. పార్టీ తన 28 ఏళ్ల చరిత్రలో అతిపెద్ద అంతర్గత సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న సమయంలో మమతా నేతృత్వంలోని బలహీనపడిన టిఎంసి వర్గం భవిష్యత్తు కార్యాచరణపై ఈ సమావేశాలు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. అయితే, తమ వర్గం కాంగ్రెస్ నేతృత్వంలోని ఏదైనా కూటమిలో భాగం కావచ్చునన్న ఊహాగానాలను రీటాబ్రత కొట్టిపారేశారు. 'మాతో ఉన్న ఎమ్మెల్యేల సంఖ్య ఇప్పటికే 64 దాటింది. మరో ఎమ్మెల్యే మాతో చేరితే ఆ సంఖ్య 65కి చేరవచ్చు. సహజంగానే, మేమే అసలైన తృణమూల్ కాంగ్రెస్. ఢిల్లీలో ఎవరు ఎవరిని కలుస్తారనేది వారి విషయం, అది మాకు అనవసరం' అని ఆయన అన్నారు. మారిన బలాన్ని శాసనసభ వర్గం తెలియజేస్తూ స్పీకర్‌కు కొత్తగా సమాచారం అందజేస్తామని ఆ అసమ్మతి నాయకుడు చెప్పారు. అసమ్మతి వర్గానికి కేవలం ఎమ్మెల్యేల మద్దతు మాత్రమే కాకుండా, ఎంపిలు, స్థానిక సంస్థల ప్రతినిధులు, జిల్లా స్థాయి నాయకుల మద్దతు కూడా ఉందని ఆయన పేర్కొన్నారు. లోక్‌సభలోని అసమ్మతి ఎంపిలు బిజెపి నేతృత్వంలోని నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ (ఎన్‌డిఎ)కు మద్దతు కొనసాగిస్తారని కూడా రీటాబ్రత పునరుద్ఘాటించారు. కాకోలీ ఘోష్ దస్తిదార్ నాయకత్వంలో ఒక ప్రత్యేక పార్లమెంటరీ కూటమిని ఏర్పాటు చేస్తున్నట్లు 20 మంది తిరుగుబాటు టిఎంసి ఎంపిలు ఇప్పటికే లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు తెలియజేసి, ఎన్‌డిఎకు మద్దతు ప్రకటించిన నేపథ్యంలో ఈ ప్రకటన ప్రాముఖ్యతను సంతరించుకుంది.

**ST. JOHN'S COLLEGE OF EDUCATION**
(Affiliated to OU, Approved by NCTE)
Opp: GAIL, Agape Centre, Chengicherla (V), Medipally (M), Medchal-Malkajgiri Dist-92. TS

**WANTED TEACHING FACULTY FOR B.Ed**
Applications are invited for the Post of Lecturers in :
Telugu & Social Sciences

Interested & Eligible candidates may Walk-in or forward their resume to mail ID: **principalstjohnscoe@gmail.com** on or before 15/06/2026. Subsequently candidates have to attend interview at the University College of Education, Osmania University.

**Qualifications:** P.G with M.Ed., (minimum 55% at both levels) and UGC NET OR SET qualified.

**Sd/- Correspondent**

**Contact: 9866519194, 9949490652.**

## అమెరికా వలస ప్రజల
# బహిష్కరణకు ఇక పూర్తిస్వేచ్ఛ

### 70 బిలియన్ డాలర్ల ఇమ్మిగ్రేషన్ బిల్లు ఆమోదం




**వాషింగ్టన్:** అమెరికాలో 70 బిలియన్ డాలర్ల కేటాయింపులతో కూడిన ఇమ్మిగ్రేషన్ బిల్లుకు కాంగ్రెస్ ఆమోదం లభించింది. ఈ బిల్లు ఆమోదం పొందడంవల్ల దేశంలో తిష్ఠవేశారని ట్రంప్ చెబుతున్న అక్రమ వలసప్రజలను బహిష్కరించడానికి ఇక పూర్తిస్వేచ్ఛ (బ్లాంక్ చెక్) ఇచ్చినట్లవుతుంది. వలస ప్రజల బహిష్కరణల పర్వానికి ఈ బిల్లు మరింత ఊపు ఇస్తుంది. జాతీయ సరిహద్దులకు మరింత భద్రత చేకూరుతుంది. 214-212 స్వల్ప ఓట్ల తేడాతో ఈ బిల్లు ఆమోదం పొందింది. బిల్లుకు అనుకూలంగా రిపబ్లికన్లు 214 మ ంది ఓటు వేయగా, ప్రతిపక్ష డెమోక్రాట్లు 212 మంది, ఇండిపెండెంట్ ఒకరు వ్యతిరేకంగా ఓటు వేయడంతో కేవలం రెండు ఓట్ల తేడాతో బిల్లుకు ఆమోదం లభించినట్లయింది. ఈ బిల్లు ఆమోదంతో అమెరికా ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్ఫోర్స్‌మెంట్ (ఐ.సి.ఇ) విభాగానికి మూడు సంవత్సరాలపాటు నిధుల హామీని ఇచ్చినట్లయింది. ఇప్పుడు ఈ బిల్లు ట్రంప్ సంతకానికి వెళుతుంది. ట్రంప్ పదవీకాలం పూర్తయ్యే వరకూ వలసలను నియంత్రించేందుకు, ప్రభుత్వం చేపట్టే వలస ప్రజల బహిష్కరణకు పూర్తి ఢోకా లభిస్తుంది. హోంల్యాండ్‌కు చెందిన రెండు సెక్యూరిటీ ఏజన్సీలకుపుష్కలంగా నిధులు సమకూరతాయి. అమెరికాలోకి అక్రమంగా ప్రవేశిస్తున్న వలస ప్రజలవల్లనే దేశంలో నేరాలు పెరుగుతున్నాయని, డ్రగ్స్ మాఫియా పేట్రేగిందని, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా వారివల్లనే జరుగుతోందని ట్రంప్ మండిపడుతున్నారు. వలస ప్రజలను అరికట్టి అమెరికా దేశం అమెరికన్లకే ఉండాలని, అధికారికంగా వచ్చే వలస కార్మికులు కూడా ప్రపంచ ప్రఖ్యాత నిపుణులైతేనే ద్వారాలు తెరచి ఆహ్వానించాలని, లేకపోతే ఎవరు అమెరికా వచ్చి స్థిరపడాలనుకున్నా వార ంతా భారీ మొత్తంలో ఫీజులు చెల్లించాలని ట్రంప్ కఠిన షరతులు తెరమీదకు తెచ్చారు.

# రష్యాలో కారు బాంబు పేలుడు: ఉన్నతాధికారి హతం

- ఫ్లెమింగో దీర్ఘశ్రేణి క్షిపణి ప్రయోగించిన ఉక్రేన్
- రిఫైనరీ,క్రిమియాలో చారిత్ర పురాతన పెయింటింగ్ భవనం ధ్వంసం
- 326 డ్రోన్లు కూల్చివేశామని క్రెమ్లిన్ ప్రకటన



**మాస్కో:** ఉక్రేన్-రష్యా మధ్య ఇటీవల విరామం లేకుండా దాడులు జరుగుతున్న నేపథ్యంలో మాస్కో పరిసర ప్రాంతాలలో జరిగిన కారు బాంబు పేలుడులో రష్యా సైనిక ఉన్నతాధికారి ఒకరు మరణించినట్లు వార్తలు అందాయి. రష్యా సైన్యాలకు భారీ ఆయుధాలను సరఫరా చేయడంలో ఈ సైనిక జనరల్ కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మరణించిన అధికారి రష్యా రక్షణ మంత్రిత్వశాఖ క్షిపణి,ఫిరంగి విభాగాధిపతి డామిర్ దామిడోవ్‌గా గుర్తించారు. ఇంకోవైపు రెండు దేశాలమధ్యా క్షిపణి,డ్రోన్ దాడులు భారీస్థాయిలో కొనసాగుతున్నాయి. బుధవారం తెల్లవారకముందే ఉక్రేన్ చేసిన దాడుల్లో 326 డ్రోన్లను, కొన్ని క్షిపణులను కూల్చివేసినట్లు రష్యా ప్రకటించింది. రష్యా సమర ప్రాంతంలోని రిఫైనరీపైన, రష్యా అధీనంలోని క్రిమియాలో 19వ శతాబ్దంనాటి క్రిమియా యుద్ధానికి సంబంధించిన నగర రక్షణ వ్యూహాన్ని చిత్రించిన ప్రఖ్యాత పెయింటింగ్ ఉన్న పురాతన భవనాన్ని ధ్వంసం చేసినట్లు దాడులు చేసినట్లు ఉక్రేన్ ప్రకటించింది. ఎఫ్‌పి-5 ఫ్లెమింగో దీర్ఘశ్రేణి క్షిపణిని 900 కి.మీ దూరంలో ఉన్న ఛెబోక్‌సరిలోని కేంద్రంపై ప్రయోగించినట్లు జెలెన్‌స్కీ ప్రకటించారు. ఉక్రేన్ దాడులతో దక్షిణ రోస్టోవ్‌లో ఇంధన ట్యాంకులు మంటల్లో దగ్ధమైనట్లు ఆ ప్రాంత గవర్నర్ ప్రకటించారు. ఐతే కారుబాంబు పేలుడు ఘటనలో మరణాల వివరాలు అధికారికంగా చెప్పకుండా రష్యా ప్రభుత్వం మౌనం పాటించింది. ఉక్రేన్ గతంలో కూడా రష్యా సైన్యాధికారులను వారి ఇంటి సమీపంలోనే కారు బాంబు పేలుళ్ళద్వారా హత్యలు చేసిన ఉదంతాలు ఉన్నాయి. బలాషిఖాలో ఈ కారు పేలుడు కారణంగా తునాతునకలు కావడంతో కారు డ్రైవర్ మరణించినట్లు ధృవీకరణ వచ్చింది. సైనికంగా రష్యాను బలోపేతం చేసేందుకు ప్రయత్నం చేసే పలువురు అధికారులు ఇదేవిధంగా మరణాలకు గురికావడం ప్రధానాంశం. యూరప్ మిత్రదేశాల యంత్రాంగం, ఆయుధాల సహాయంతో ఉక్రేన్ ఇటీవలికాలంలో తన ఆయుధశక్తిని పెంచుకుంటున్నది. ఈ బాంబు పేలుడువల్ల ఇంధన సరఫరాలకు ఆటంకం కలగడంతో ప్రజలు ఆదరాబాదరాగా భారీగా కొనుగోళ్ళు చేస్తున్నారని క్రాస్నోడార్ ప్రాంత గవర్నర్ చెప్పారు.

## విలువ ఎక్కువ

(మొదటి పేజీ తరువాయి)



సాంకేతిక విప్లవంతోనే ఈరోజు రాష్ట్ర ఆదాయంలో 60 శాతం సైబరాబాద్ నుంచి వస్తుందని, అంతేకాకుండా ఈ ప్రాంతంలో భూముల ధర ఒక ఎకరానికి 200 కోట్లకు పైగా పలుకుతుందంటే...బంగారం కంటే రంగారెడ్డి జిల్లా భూములకు విలువ ఎక్కువ అని చెప్పారు. ఫ్యూచర్ సిటీ కేవలం మన కోసం మాత్రమే కాదు.మొత్తం ప్రపంచానికని తెలిపారు. కేవలం 150 రోజుల్లోనే ఎఫ్‌సిడిఎ కార్యాలయ నిర్మాణం పూర్తి చేశామన్నారు.వచ్చే ఎనిమిదేళ్లలో న్యూ యా ర్క్, టోక్యో,సింగపూర్ తో పోటీపడేలా ఫ్యూచర్ సిటీని రూపొందిస్తామని అన్నారు. 2034 నాటికి ట్రిలియన్ డాలర్ ఎకానమీకి ఫ్యూచర్ సిటీ అభివృద్ధి కావాలని ఆయన ఆకాంక్ష వ్యక్తం చేశారు.మంగళవారం కురిసిన కొద్దిపాటి తొలకరి వర్షానికి రోడ్లు మొత్తం వరద నీటితో నిండిపోయాయి.రోడ్లపై వరద నీరు చేరి ట్రాఫిక్ సమస్యతో నగరం అతలాకుతమైందన్నారు. అభివృద్ధి చేశామని చెప్పుకునే వారు.. హైదరాబాద్ రోడ్ల మీద చేరిన వర్షపు నీటికి, ట్రాఫిక్ సమస్యకు కారణం ఎవరో చెప్పాలన్నారు. చెరువుల్లోకి వెళ్లాల్సి నీరు కబ్జాల వల్ల రోడ్లపైకి వస్తోంది.అంబర్‌పేటలో ఉన్న బతుకమ్మకుంటను బిఆర్ ఎస్ నాయకుడు ఎడ్ల సుధాకర్ రెడ్డి కి 15 ఎకరాల భూమి కెసిఆర్ రాసి ఇచ్చిండని సిఎం రేవంత్ రెడ్డి తీవ్రంగా ధ్వజమెత్తారు.ఆనాటి నాయకులు ప్రభుత్వ భూముల్ని ఆక్రమించారు.అందుకే, హైడ్రాతో అక్రమ కట్టడాలను తొలగిస్తున్నాం.చెరువులను పునరుద్ధరిస్తున్నాం.లేక్ ఎకానమీ సృష్టించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని ఆయన పేర్కొన్నారు.గ్లోబల్ సమ్మిట్ ద్వారా ప్రపంచదేశాలను ఇక్కడికి రప్పించాం.డిసెంబర్ లోనూ మరో సారి గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తాం అని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు.ఇకనుంచి ఫ్యూచర్ సిటీ కార్యాలయానికి వారానికి ఒకసారి మంత్రులు, మధ్య మధ్యలో తాను వస్తూ ఉంటామని సిఎం స్పష్టం చేశారు.అనంతరం ఎఫ్‌సీడీఏ కార్యాలయంలో తన ఛాంబర్ లో ఫ్యూచర్ సిటీ పరిధిలోని ప్రాంతాలకు మాస్టర్ ప్లాన్ రూపొందించడానికి ఎంపికైన కన్సల్టెంట్ సంస్థ ప్రతినిధులకు లెటర్ ఆఫ్ అవార్డు ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందించారు.అదేవిధంగా ఫ్యూచర్ సిటి పరిధిలోకి కొన్ని గ్రా మాలు తీసుకువస్తు సభా వేదికపైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతకం చేశారు.

ఈ కార్యక్రమంలో ఎంపిలు వేం నరేందర్ రెడ్డి,అనిల్ కు మార్ యాదవ్,మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి,తెలంగాణ అర్బన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్,రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డి,ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు,తదితరులు పాల్గొన్నారు.




## అఫ్ఘానిస్థాన్‌పై పాక్ దాడులు:13 మంది మృతి

**కాబూల్:** అఫ్ఘానిస్థాన్ లక్ష్యంగా పాకిస్థాన్ మరోసారి దాడులు చేసింది. ఈ దాడులలో 13 మంది మరణించారు. మరో 14 మంది గాయపడ్డారు. తాలిబన్ ప్రధాన అధికార ప్రతినిధి జబిహుల్లా ముజహిద్ బుధవారం మీడియాతో మాట్లాడుతూ, అఫ్ఘానిస్థాన్‌లోన ఖోస్ట్,కునార్, పక్తికా రాష్ట్రాలలో పౌర నివాస ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని గగనతల దాడులు చేసిందని చెప్పారు. ఈ దాడుల్లో 11 మంది పిల్లలు ఒక మహిళ, ఒక వృద్ధుడు మరణించారని చె ప్పారు. ఐతే ఈ దాడులు చేసింది తా మే అని వెంటనే పాకిస్థాన్ ధృవీకరించలేదు. ఈ రెండు దేశాలమధ్య గడచిన కొద్ది నెలలుగా సరిహద్దుల్లో ఘర్షణలు జరుగుతున్నాయి. ఈ పరస్పర దాడు ల్లో వందలమంది మరణించారు. అఫ్ఘానిస్థాన్ సరిహద్దుల్లోని వాయువ్య పాకిస్థాన్ ఖైబర్ పఖ్తూంఖ్వా రాష్ట్రం హసన్‌ఖేల్ ప్రాంతంలోని తమ భద్రతాకేంద్రంపై దాడులు జరిగాయ ని, ఈ దాడులకు పాల్పడింది తాలిబన్ ఉగ్రవాదులేననీ పాకిస్థాన్ చాలా గట్టిగా అనుమానిస్తోంది. దీనికి ప్రతీకారంగానే సరిహద్దుల్లోంచి వెళ్ళి అఫ్ఘానిస్థాన్‌లోని నివాసిత ప్రాంతాలపై దాడులు చేసినట్లు భావిస్తున్నారు. హసన్‌ఖేల్ ప్రాంతంలో చాలా ఉధృతస్థాయిలో కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో పాకిస్థాన్‌కు చెందిన ఆరుగురు ఫెడరల్ కానిస్టేబులరీ మరణించారు. అనేకమంది గాయపడ్డారు. స్థానిక అధికారుల సమాచారం ప్రకారం, మంగళవారంనాడు భద్రతాదళాలున్న చెక్‌పాయింట్‌పై దాడులు జరిగాయి. ఈ దాడుల్లో ఎనిమిదిమంది మరణించారు. పాకిస్థాన్ హోంమంత్రి మొహసిన్ నక్వీ తర్వాత పెషావర్‌లో వారి మృతదేహాలను ఖననం చేసే కార్యక్రమంలో పాల్గొని ప్రార్థనలు చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలియజేశారు. పాకిస్థాన్ శాంతి భద్రతలకు ముప్పు కలిగించే గ్రూపులపై ముమ్మర దాడులు చేస్తామని ప్రకటించారు. ఆ తర్వాత వెంటనే సరిహద్దుల్లో పాకిస్థాన్ దాడులు ప్రారంభించి బుధవారం తెల్లారకముందే 13 మంది అఫ్ఘానిస్థాన్ ప్రజలను హతమార్చింది. పాకిస్థాన్ దళాలు సరిహద్దులు దాటి అఫ్ఘానిస్థాన్‌లో ప్రవేశించి దా డులు ప్రారంభించినప్పటినుండి రెండు దేశాలమధ్యా సంఘర్షణలు కొనసాగుతున్నాయి. పాకిస్థాన్‌లో కూడా అంతర్గతంగా ఉగ్రవాద దాడులు పెరిగిన తర్వాత ఈ ఏడాది ఫిబ్రవరి అఫ్ఘానిస్థాన్‌పై బహిరంగ యుద్ధం ప్రకటించింది. మార్చినెలలో కాబూల్‌లో ఉన్న ఒక డ్రగ్-ట్రీట్‌మెంట్ సెంటర్‌పై పాకిస్థాన్ చేసిన వైమానిక దాడుల్లో 400 మంది మరణించారని అఫ్ఘానిస్థాన్ ప్రకటించగా పాకిస్థాన్ ఖండించింది. తాముమందుగుండు డిపోపై దాడి చేశామని పేరొ ్కంది. చైనా మధ్యవర్తిత్వంలో అంతకుముందు ఉరు మ్కిలో రెండు దేశాలమధ్య శాంతి చర్చలు జరిగాయి. ఆ తర్వాత కూడా దాడులు కొనసాగుతున్నాయి. తెహ్రిక్-ఎ-తాలిబన్, పాకిస్థానీ తాలిబన్ ఉగ్రవాదులకు అఫ్ఘానిస్థాన్ ఆశ్రయం ఇచ్చి తమపై ఎగదోస్తోందని పాకిస్థాన్ పదే పదే ఆరోపణలు చేస్తోంది.

## ట్రంప్‌పై విశ్వాసం కోల్పోయిన ఇజ్రాయెలీలు

### చర్చల్లో తమకు ప్రాధాన్యత లేదని ఆవేదన: ఐడిఐ సర్వే

**టెల్‌అవీవ్:** అమెరికా-ఇరాన్ మధ్య జరుగుతున్న చర్చల్లో డోనాల్డ్ ట్రంప్ ఇజ్రాయెల్ భద్రతకు ఎలా ంటి ప్రాధాన్యతా ఇవ్వడంలేదని ఆ దేశ ప్రజలు భావిస్తున్నారు. ఇజ్రాయెల్ ప్రజలు ట్రంప్ చర్ య్యలపై నమ్మకం కోల్పోయారని ఇజ్రాయెల్ డెమో క్రసీ ఇనిస్టిట్యూట్ (ఐడిఐ) నిర్వహించిన ఒక సర్వే వెల్లడించింది. ట్రంప్ ఎంతమాత్రం తమ దేశ భద్ర తను చర్చల్లో ఒక ప్రధాన అంశంగా భావించడంలేదని ఇజ్రాయెలీలు గట్టిగా నమ్ము తున్నారట. అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్తంగా ఇరాన్‌పై యుద్ధం ప్రారంభించిన మూడు నెలల తర్వాత ట్రంప్ సిబ్బంది ఇస్లామిక్ రిపబ్లిక్‌తో చర్చ లు ముమ్మరంగా కొనసాగిస్తున్న తరుణంలో ఈ సర్వే నివేదిక వెల్లడైంది. ఇరాన్‌తో తుదిదశలో ఉందని అమెరికా చెబుతున్న ఒప్పందంపట్ల ఇజ్రా యెల్ అధికారులు తీవ్ర ఆందోళన చెందు తున్నారని ఐడిఐ పేర్కొంది. నెతన్యాహూ మళ్ళీ ఎన్నికల్లో పోటీ చేయకూడదని 61 శాతం ప్రజలు కోరుకుంటున్నారు. భవిష్యత్తులో ఏ ప్రధా నమంత్రికైనా ఒక పరిపాలనా కాలపరిమితి ఉం డాలని కూడా వారు కోరుకుంటున్నారు.

మే 31 నుండి జూన్ ఐదో తేదీ మధ్యకాలంలో ఐడి ఐ ఈ సర్వే నిర్వహించింది. దీని ప్రకారం కేవలం 41 శాతం ఇజ్రాయెలీ యూదులు, మొత్తం ఇజ్రా యెల్‌లోని 44 శాతం మంది ప్రజలు మాత్రమే ట్రంప్‌పై నమ్మకం వ్యక్తం చేస్తున్నారు. ట్రంప్ తమ పట్ల బాధ్యతగానే ఉన్నారని వారు భావిస్తున్నారు. ఇజ్రాయెలీ యూదులలో 64 శాతంమందికి గడచిన మే నెలలో ట్రంప్ మీద విశ్వాసం ఉండేది. ఇప్పుడు ఆ విశ్వాసం గణనీయంగా క్షీణించింది. ఇరాన్‌తో అమెరికా చేసుకునే ఒప్పందం వల్ల ఇరాన్‌లో పాలన బలహీన పడుతుందని కేవలం 27 శాతం ఇజ్రాయెలీలు మాత్రమే నమ్ము తున్నా రు.

## 'ఎన్‌డిఎకు' దేశమే ప్రధానం

(మొదటి పేజీ తరువాయి)

మంది ప్రజలను పేదరికం నుండి బయటకు తీసుకువచ్చాం,మౌలిక సదుపాయాలను అసాధారణరీతిలో అభివృద్ధి చేశాం, మా ప్రభుత్వం వచ్చిన తరావ్త ప్రజలకు పరిపాలనపై విశ్వాసం పెరిగింది, జాతీయ రహదారులు,నగరాలు,పట్టణాలు ,గ్రామాలలో మౌలిక సదుపాయాలను, ఆసుపత్రులు, విద్యుత్ సదుపాయాలను అభివృద్ధి చేశాం, రైల్వే వ్యవస్థ విస్తరణ, విమానాశ్రయాల అభివృద్ధిపై దృష్టిపెట్టాం, దేశంలో నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించాం, గతంలో ఉగ్రవాదం పేరు చెబితేనే భయపడేవారు,ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఉగ్రవాదాన్ని ఎదుర్కొన్నాం,వారిస్థావరాలపై దాడులు చేశాం, గతంలో 370వ అధికరణ పేరు చెబితేనే మాట్లాడేందకు భయపడేవారు, మేం వచ్చిన తర్వాత ఆ ప్రత్యేక ప్రతిపత్తిని రద్దుచేశాం, ముందుచూపుతో మేం చేపట్టిన అనేక కార్యక్రమాలు ఇప్పుడు ఫలితాలనిస్తున్నాయి అని తన ప్రసంగంలో మోదీ చెప్పారు. వికసిత్ భారత్-2047 దిశగా దేశం వేగంగా అడుగులు వేస్తోందన్నారు. దేశంలో గ్రీన్ హైడ్రోజన్,గ్రీన్ అమోనియా ఉత్పత్తి పెరుగుతోంది,స్లోర్,పవనవిద్యుత్, అణు విద్యుత్ దిశగా దేశం ముందుకు అడుగులు వేస్తో ంది, మధ్య తరగతి వర్గాల సొంతింటి కలను సాకారం చేశాం, యువతరం కలలను సాకారం చేసే దిశగా అడుగులు వేస్తోంది, వారి ఆకాంక్షలను నెరవేరుస్తాం, ఎన్‌డిఎ ప్రభుత్వం చేపట్టిన పథకాలను, కార్యక్రమాలను ప్రజలు ఆమోదించారు,మేం తెచ్చిన పథకాలతో దేశంలో పెను మార్పులు సంభవించాయి, ఈ మార్పులు చూసి ఎంతో గర్వపడుతున్నాం,మా ప్రభుత్వం వచ్చాక ఈనాడు నవతరం యువతరం ఆశలు,ఆకాంశలు,ఆశయాలలో గణనీయమైన మార్పులు సంభవించాయి, దేశంలో మహిళలు,యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాం,2014లో మేం అధికారంలోకి రాకమునుపు దేశంలో అనేక సమస్యలుండేవి, క్రమంగా సమస్యలు పరిష్కరించుకుంటూ వచ్చాం, మధ్యతరగతివర్గం దేశంలో అనేక పన్నుల భారాలతో అతలాకుతలమయ్యేది, మేం అధికారం చేపట్టిన తర్వాత దేశ రూపురేఖల్లో మార్పులు తీసుకు వచ్చాం,పన్నుల వ్యవస్థల్లో సంస్కరణలు తీసుకు వచ్చాం, ఏకీకృత పన్నుల విధానాలు అమలులోకి తీసుకువచ్చాం, దేశ ద్రవ్యోల్బణాన్ని స్థిరంగా ఉంచేందుకు ఇప్పటికీ కృషి చేస్తున్నాం, ఈ విషయంలో ఫలితాలు సాధించాం,సంక్షోభ సమయాలు తలెత్తినప్పుడు కూడా దేశం 7.8 శాతం వృద్ధిరేటును నమోదు చేయడం సాధారమైన విషయం కాదు, ప్రపంచవ్యాప్తంగా కరోనా మహమ్మారి విజృంభించినప్పుడు కూడా దేశం సగర్వంగా తలెత్తుకుని నిలబడింది, కరోనా సమయంలో అనేక దేశాల ఆర్థిక వ్యవస్థలు అతలాకుతలమయ్యాయి, పతనం అయ్యాయి, కానీ ఆ సమయంలో కూడా దేశాన్ని స్థిరంగా నిలబెట్టాం, కాంగ్రెస్‌పార్టీ అధికారంలో ఉన్నప్పుడు వేలకోట్ల రూపాయల అవినీతి జరిగిది, వారి పరిపాలనాకాలంలో దేశ వృద్ధిరేటు చాలా దారుణంగా ఉండేది, మౌలిక సదుపాయాల అభివృద్ధిపై దృష్టిపెట్టేవారేకాదు, మేం కేవలం 12 సంవత్సరాల వ్యవధిలోనే ఎన్నో మార్పులు తీసుకువచ్చాం,సాంకేతిక విషయంలో దేశాన్ని ముందుకు నడిపించాం, దేశంలో ఇంటర్నెట్ సదుపాయాన్ని ఉపయోగింకునేవారిసఖ్యను 25 కోట్ల నుడి 100 కోట్లకు పెంచాం, భారత్‌లో వస్తున్న అనేక మార్పులను ప్రపంచం ఆసక్తిగా గమనిస్తోంది,అనేక సమస్యల పరిష్కారం కోసం ప్రపంచదేశాలు భారత్‌వైపు చూస్తున్నాయి అని మోదీ తన సుదీర్ఘ ప్రసంగంలో చెప్పారు.

కాగా అంతకుముందు బుధవారం ఉదయం జరిగిన మంత్రివర్గ సమావేశం మోదీకి అభినందనలు తెలియజేసింది. జవహర్‌లాల్ నెహ్రూ ప్రధానమంత్రిగా పనిచేసిన రికార్డును కూడా ఆయన అధిగమించారని పేర్కొంది.

## మోదీ భారత్‌కు బండరాయి

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. భారతదేశం ప్ర పంచ వ్యవహారాలలో ఒక శక్తిగా ఆవిర్భవించింది' అని రమేష్ అన్నారు. సార్వత్రిక వయోజన ఓటు హక్కును నిర్ధారించడానికి 17 కోట్ల మంది నమోది త ఓటర్లతో కూడిన ఓటర్ల జాబితాలను సిద్ధం చేశారని, స్వేచ్ఛా భారతదేశపు మొదటి సార్వత్రిక ఎన్నికలు అక్టోబర్ 1951, ఫిబ్రవరి 1952 మధ్య జరిగాయని ఆయన తెలిపారు. '1947-52 మధ్య నెహ్రూ ప్రధానిగా ఉన్నప్పుడు, సర్దార్ పటేల్, డాక్టర్ అంబేద్కర్, డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, సి. రాజగోపాలాచారి, మౌలానా అబుల్ కలాం ఆజాద్ వంటి దిగ్గజాలు కీలక పాత్ర పోషించిన భారతదేశపు విజయాల రికార్డును, నెహ్రూపై విపరీతమైన వ్యామోహం ఉన్న మోడీ ఇప్పుడు చెరిపివేయాలని చూస్తున్నారు' అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఆరోపించారు. 'ఆయన (మోదీ) ఈ రోజు స్వయంగా ప్రకటించుకున్న, సందేహాస్పదంగా సృష్టించిన ఒక మైలురాయిని దాటి ఉండవచ్చు, కానీ భారతదేశంలో ప్రజాస్వామ్య హత్యకు అధ్యక్షత వహిస్తూ, భారత దేశానికి ఉరితాళ్లా ఉన్నారు' అని రమేష్ ఆరోపించారు. ప్రజాస్వామ్యానికి పునాది వేసిన అవే వ్యవస్థలైన స్వతంత్ర ఎన్నికల సంఘం, పవిత్రమైన ఓటర్ల జాబితా వంటివి ఇప్పుడు ప్రమాదంలో పడ్డాయని ఆయన పేర్కొన్నారు. భారత ప్రజాస్వామ్యానికి సంబంధించి ఒక 'కల్పిత మైలురాయి'గా ప్రధాని మోదీ సుదీర్ఘ కాలం అధికారంలో ఉన్న విషయాన్ని బిజెపి వేడుకగా జరుపుకుంటున్న రోజే, ఆయన పర్యవేక్షణలోని ఎన్నికల యంత్రాంగం కాంగ్రెస్ అభ్యర్థి మీనాక్షి నటరాజన్ నామినేషన్‌ను చట్టవిరుద్ధంగా తిరస్కరించడం అత్యంత విడ్డూరమని కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అన్నారు. 'మోదీ హయాంలో ప్రజాస్వామ్య పరిస్థితి ఇదే. నటరాజన్ నామినేషన్ తిరస్కరణ అనేది సాధారణ పరిశీలనలో తీసుకున్న నిర్ణయం కాదు. ఇది స్పష్టమైన చట్టవిరుద్ధ చర్య మరియు రాజకీయ కుట్ర' అని ఆయన అన్నారు.

## కాల్పుల బీభత్సం

(మొదటి పేజీ తరువాయి)

ప్రతీకారం తీర్చుకుంటాం, అమెరికాను వదిలిపెట్టబోం, మీరు సురక్షితంగా ఉండాలంటే ఈ ప్రాంతాన్ని వదిలి వెళ్ళిపోండి'' అని ఇరాన్ విదేశీ వ్యవహారాలమంత్రి అబ్బాస్ అరాఘ్చి ఎక్స్ వేదికగా హెచ్చరించారు. అమెరికా వైమానిక,నౌకాదళాలకు చెందిన యుద్ధ విమానాలు ఇరాన్‌కు చెందిన వాయు,రక్షణ భూతల,రాడార్ కేంద్రాలను లక్ష్యాలుగా చేసుకుని దాడులు చేశామని అమెరికా కేంద్ర సైనిక కమాండ్ ప్రకటించింది. బందర్ అబ్బాస్,ఖేష్మ్ ద్వీపం పరిసరాల్లో దాడులు జరిగినట్లు ఇరాన్ అంగీకరించినప్పటికీ ఎంత మేరకు నష్టం జరిగిందన్న విషయం మాత్రం చెప్పలేదు. హోర్ముజ్ ప్రాంతీయ జల్లాల్లో ప్రయాణిస్తున్న అమెరికా బలగాలు,వాణిజ్య నౌకలపై దాడులు చేసినందుకు ప్రతీకారం తీర్చుకున్నట్లు సెంట్‌కామ్ ప్రకటించింది. కాగా మువఫ్ఫాక్ వైమానిక స్థావరం లక్ష్యంగా ఇరాన్ ప్రయోగించిన ఐదు క్షిపణులను తాము కూల్చివేశామని జోర్డాన్ ప్రభుత్వ పెట్రా వార్తాసంస్థ బుధవారం ప్రకటించింది. ఈ వైమానిక స్థావరంలో అమెరికా ఎఫ్-35, ఇతర యుద్ధ విమానాలు పార్కింగ్‌లో ఉన్నాయి.

ఇరాన్ దాడులు చేసినాగానీ ఎదురు దాడులు చేయకుండా సహనంతో ఉండాలని ఇంతకు ముందు నెతన్యాహూకు ఉపదేశమిచ్చిన ట్రంప్ ఒకే ఒక్క అపాచీ హెలికాప్టర్‌ను ఇరాన్ కూల్చివేసినందుకు రాత్రికి రాత్రే ఇరాన్‌పై దాడులు చేసి తుది దశలో ఉన్న చర్చల వాతావరణానికి విఘాతం కలిగించారు. ఈ అపాచీ హెలికాప్టర్ కూడా ప్రమాదవశాత్తూ కూలిపోయిందని సెంట్‌కామ్ తొలుత భావించింది. రెండు ఇరాన్ డ్రోన్లను కూల్చివేసే సమయంలో హెలికాప్టర్ కూలిపోయినట్లు పేర్కొంది. ఐతే అందులో ఉన్న ఇద్దరు పైలట్లనూ డ్రోన్ బోట్ సహాయసురక్షితంగా ఉన్నారు. కానీ ఇరాన్ దళాలే డ్రోన్ దాడితో తమ అపాచీని కూల్చివేశాయని ప్రతీకారం తీర్చుకుటామని ట్రంప్ మంగళవారం మరో ప్రకటన చేశారు. ఇరాన్ ఓడరేవులపై అమెరికా విధించిన దిగ్బంధనాన్ని అమలు చేసే గస్తీ చర్యల్లో అపాచీ ఎహెచ్-64 హెలికాప్టర్లు కీలకపాత్ర వహిస్తున్నాయి.

అర్ధరాత్రి దాడుల తర్వాత ట్రంప్ తన సొంత ట్రూత్ సోషల్ మీడియాలో బుధవారం ఒక పోస్టింగ్ పెడుతూ, ఇరాన్ విద్యుత్ కేంద్రాలు, వంతెనలపై కూడా దాడులు చేయాల్సిందిగా సైన్యానికి తాను అదేశాలిచ్చే అవకాశాలున్నాయని హెచ్చరించారు. అమెరికాకు మేలు చేసే ఎంతో గొప్ప ఒప్పందంపై తుది నిర్ణయం తీసకుని సంతకాలు చేయడానికి వారు (ఇరాన్) చాలా ఎక్కువ సమయం తీసుకుంటున్నారనీ, తీవ్ర జాప్యం చేస్తున్నారనీ, అందుకు వారు మూల్యం చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. తమ దాడులకుగాను ఇరాన్ ఆ ప్రాంతంలో తమ స్థావరాలపై ఎదురు దాడులు చేస్తుందని, అందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు.''ఇరాన్ పూర్తిగా ఓడిపోయింది, వారు సర్వనాశనమయ్యారు, వాళ్ళవి కేవలం మాటలే తప్ప చేతలు లేవు, వాళ్ళ వైమానిక వ్యవస్థ పూర్తిగా నాశనమైపోయింది, వారి నౌకా,వైమానిక దళాలు ఉనికిలో లేవు,పశ్చిమాసియాలో పెత్తందారు చచ్చిపోయింది'' అని పేర్కొన్నారు.

## మోస్తరు వర్షాలు

(మొదటి పేజీ తరువాయి)

అవకాశం ఉందని చెప్పారు. వానలతో పాటు గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీచే ప్రమాదం ఉందని వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరించారు. ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాబోయే మూడు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలలో పెద్దగా మార్పులేమీ ఉండవని అధికారులు స్పష్టం చేశారు. ఈనెల 11 నుండి రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ ఎండ తీవ్రత తగ్గి, గరిష్ఠ ఉష్ణోగ్రతలు 36 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందన్నారు. భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి, ఖమ్మం, ములుగు, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 36 నుండి 40 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదయ్యే అవకాశం ఉందన్నారు. హైదరాబాద్ సహా మిగిలిన అన్ని జిల్లాల్లో 36 డిగ్రీల కంటే తక్కువగానే ఎండ తీవ్రత ఉంటుందన్నారు. రాష్ట్రంలోని ఆదిలాబాద్, హైదరాబాద్, వరంగల్, నిజామాబాద్, నల్లగొండ సహా అన్ని 33 జిల్లాల్లోనూ గరిష్ఠ ఉష్ణోగ్రతలు 36 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువకు పడిపోయి వాతావరణం చల్లబడనుందన్నారు. వరుస వర్షాలు, ఈదురు గాలుల నేపథ్యంలో ప్రయాణాలు చేసే వారు, చెట్ల కింద ఆశ్రయం పొందే వారు జాగ్రత్తగా ఉండాలన్నారు.

## మరమ్మతులు పూర్తిచేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

పనులు జరిగాయన్నా రు. 2014 తరువాత ఆధికారంలోకి వచ్చిన బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టు డిజైన్ మార్పు చేసి మేడిగడ్డ ప్రాజెక్ట్ రూపకల్పన చేసిన ట్లు తెలిపారు. 16.50 లక్షలు ఎకరాలకు సాగునీరు అందించేచేందుకు చేపట్టిన ప్రాజెక్టు పనుల్లో గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల చేయడం వల్ల ఇబ్బంది కలిగిందని, తప్పుడు నిర్ణయాలతో ప్రాజెక్టుకు కాలయాపన చేశారని తెలిపారు. దాదాపు 1,45,000 కోట్లతో మేడిగడ్డ బ్యారేజీ పనులు చేపట్టారని బ్యారేజీ లోపభూయిష్టమైన నిర్మాణం వల్ల కుంగడం జరిగిందని తెలిపారు. ప్రాజెక్టు కుంగడానికి గల కారణాలను లోతుగా విశేషణ చేసేందుకు సిడబ్ల్యుసి, ఎన్‌డిఎస్ఎ వంటి ప్రతిష్టాత్మకమైన అనుభవం కలిగిన సంస్థలచే పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. లోప భూయిష్టంగా నిర్మాణం ఉందని అంచనాలు తయారు చేశారని సాంకేతికంగా అత్యంత పకడ్బందీ పరీక్షలు నిర్వహించి ప్రాజెక్టు వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎలాంటి రాజకీయ దురుద్దేశ్యం లేదని తెలిపారు. అన్నారం, సుందిదళ్ల బ్యారేజీ మరమ్మతులు పనులు చేపట్టినట్లు తెలిపారు. పునరుద్ధరణ పనులు చేయడానికి డిసైడ్ అండ్ డిజైన్ కన్సల్టెంట్ గా ప్రపంచ ప్రఖ్యాత సంస్థ ఆఫ్రీన్ అనే కంపెనీని సంప్రదించి ఐఐటి బాంబే నిపుణులతో సంయుక్తంగా రీ డిజైన్ చేపట్టేందుకు పనులు చేస్తున్నారని తెలిపారు. ఎన్‌డిఎస్ఎ పరీక్షలు నిర్వహిస్తూ ఉపయోగవంతంగా ముందుకెళుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ కార్యచరణ ఒక్కటే ఈ నెలాకరు వరకు గానీ జూలై మొదటి వారం వరకు కాని అన్ని పరీక్షలు పూర్తి చేయనున్నట్లు తెలిపారు. వచ్చిన పరీక్షలు నివేదిక ఆదారంగా బ్యారేజ్ పునరుద్ధరణ డిజైన్ చేయాలని సంకల్పించినట్లు తెలిపారు. డిజైన్ అంత సిద్ధంగా ఉన్న తదుపరి సిడబ్ల్యుసి, ఎన్‌డిఎస్ఎ అనుమతి తీసుకొని ఈ వర్షాకాలం కాగానే సుమారు నవంబర్ డిసెంబర్ మాసాలలో పనులు మొదలుపెట్టి ఒక వర్కింగ్ సీజన్లో పనులు పూర్తి చేసే ప్రయత్నం చేసి 2027 ఎండాకాలం వరకు పనులు పూర్తి చేయడానికి ఒక లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి భారత సైన్యంలో అత్యంత నైపుణ్యం అత్యంత అనుభవం కలిగిన కల్నల్ పరిషిత్ మెహ్రా చైర్మన్ ఆధ్వర్యంలో ముందుకు పోతున్నట్లు తెలిపారు. కమిటీలో చాలా మంది దేశ విదేశాల నుంచి నిపుణులు పెట్టి ఈ పరీక్షలు చేపడుతున్నట్లు తెలిపారు. పరీక్షలు ఎక్కడ వరకు వచ్చాయో పురోగతిని తనిఖీ చేసేందుకు నేడు తనిఖీకి వచ్చినట్లు తెలిపారు. పునరుద్ధరణ పనులు ప్రారంభించడానికి ముందే ప్రతి బ్యారేజ్ యొక్క ఫిజికల్ కండిషన్ తనకి చేస్తూ సమస్యలు ఉంటే మరమ్మతులు చేసేందుకు కార్యచరణ చేపట్టనున్నట్లు తెలిపారు. తనిఖీలు కేంద్రాలకు వెళ్ళిన తర్వాత ఎనర్జీ డిస్ఫ్మెస్మెంట్ కూడా పరిశీలన చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, ఇరిగేషన్ సెక్రెటరీ శ్రీధర్, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి సిరిశెట్టి సంకీర్త్, సీఈ శ్రీనివాస్ గుప్తా, ఆర్డిఓ రవీందర్, ఇరిగేషన్ ఎస్ఈ దస్తగిరి, ఈఈ రమేష్, కన్సల్టెంట్ ఈఈ యాదగిరి, గ్రంథాలయ చైర్మన్ రాజబాబు, తహసీల్దార్ సత్యనారాయణ స్వామి, ఎంపిడిఓ సురేందర్, కాటారం మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుమల తదితరులు పాల్గొన్నారు.

## అభ్యంతరకరం

(మొదటి పేజీ తరువాయి)

దీపా దాస్‌మున్షీ వంటి అగ్రశ్రేణి నాయకుల బృందం, నటరాజన్‌తో కలిసి ఎన్నికల సంఘం అధికారులను కలిసింది, నామినేషన్ తిరస్కరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. 'ఇది ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే... రాజ్యాంగబద్ధమైన సంస్థలపై మాకు ఇంకా పూర్తి నమ్మకం ఉంది. అందుకే మేము ఈ పోరాటం చేస్తున్నాము' అని కాంగ్రెస్ ప్రతినిధి బృందం ఎన్నికల సంఘం అధికారులను కలిసిన తర్వాత రాజ్యసభ అభ్యర్థి నటరాజన్ విలేకరులకు వెల్లడించారు. సమావేశం అనంతరం విలేకరులతో మాట్లాడిన సింఘ్వీ ఈ ప్రతినిధి బృందం ఎన్నికల సంఘానికి సమగ్రమైన వినతిని సమర్పించింది. రిటర్నింగ్ ఆఫీసర్ (ఆర్ఒ) తప్పుడు ఉత్తర్వును జారీ చేశారని వారికి స్పష్టంగా, ఎటువంటి సందేహానికి లేదా వివాదానికి తావులేకుండా వివరించిందని, ఆ ఉత్తర్వు ఎలా ఉందంటే.. '2 ప్లస్ 2 సమానం 7' అని చెప్పినట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. ఎన్నికల సంఘ చట్టం అయిన 'ప్రజా ప్రాతినిధ్య చట్టం'లోని సెక్షన్ 33 'ఎ' ప్రకారం, రెండేళ్లకు పైగా శిక్ష పడే అవకాశం ఉన్న కేసులను, ముఖ్యంగా అభియోగాలు నమోదు చేయబడిన కేసులను మాత్రమే వెల్లడించాల్సి ఉంటుందని సింఘ్వీ పేర్కొన్నారు. అభియోగాలు నమోదు చేయడం న్యాయపరమైన ప్రక్రియ అని, న్యాయమూర్తి అభియోగాలను నమోదు చేస్తారన్నారు. 'మొదటి సంవత్సరం లా విద్యార్థికి కూడా తెలిసిన విషయం ఏమిటంటే, మొదట ఒక ప్రైవేట్ ఫిర్యాదు ఉంటుంది. ఆ ఫిర్యాదు నిరాధారమైనది కావచ్చు లేదా దానికి ఎటువంటి బలమైన ఆధారం లేకపోవచ్చు; ఆ తర్వాత రెండవ దశలో మేజిస్ట్రేట్ దానిని పరిగణనలోకి తీసుకుంటారు' అని ఆయన చెప్పారు. నటరాజన్‌కు కేవలం కోర్టు నుండి ఒక నోటీసు మాత్రమే వచ్చిందని, ఆ నోటీసులో కేసును ఎందుకు పరిగణనలోకి తీసుకోకూడదో చెప్పాలని కోరారని సింఘ్వీ తెలిపారు. అంటే, కేసు అధికారికంగా పరిగణనలోకి తీసుకోబడక ముందే ఆ నోటీసు వచ్చిందని అర్థమని వివరించారు. 'కేసు పరిగణనలోకి తీసుకోబడకపోయినప్పటికీ మీరు నటరాజన్ నామినేషన్‌ను తిరస్కరించారు. అంటే ఆమె వెల్లడించడానికి ఎటువంటి క్రిమినల్ కేసు అక్కడ లేదన్నమాట' అని ఆయన పేర్కొన్నారు. వాస్తవానికి ఎటువంటి చట్టపరమైన అడ్డంకి లేనప్పటికీ, అటువంటిది ఉందని పేర్కొంటూ రిటర్నింగ్ ఆఫీసర్ నామినేషన్‌ను తిరస్కరించడం విచిత్రంగా ఉందన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 కింద ఎన్నికల సంఘానికి అపారమైన అధికారాలు ఉన్నాయని తాము వారికి గుర్తుచేశామని, ఒకవేళ అభ్యర్థి జుట్టు నల్లగా ఉందనో లేదా వేరే రాష్ట్రానికి చెందినవారనో కారణం చూపి రిటర్నింగ్ ఆఫీసర్ నామినేషన్‌ను అక్రమంగా తిరస్కరిస్తే, ఎవరూ కోర్టుకు వెళ్లాల్సిన అవసరం లేదు, లేదా ఎన్నికల పిటిషన్ దాఖలు చేయాల్సిన అవసరం లేదు; ఎందుకంటే సరిదిద్దే న్యాయం చేసే అధికారాలు కలిగిన ప్రధాన సంస్థ ఎన్నికల సంఘం ఇక్కడే ఉందని అని సింఘ్వీ అన్నారు. నామినే తిరస్కరణ పూర్తిగా అన్యాయమైన, స్పష్టంగా చట్టవిరుద్ధమైన ఉత్తర్వు, దీనిని వెంటనే రద్దు చేయాలని విజ్ఞప్తి చేసినట్లు ఆ ఎంపి తెలిపారు. ఇదిలా ఉండగా, అఫిడవిట్‌లో సమాచారాన్ని దాచిపెట్టారన్న ఆరోపణలతో నటరాజన్ నామినేషన్ తిరస్కరణకు గురికావడంతో, మధ్యప్రదేశ్‌లోని మూడు రాజ్యసభ స్థానాలకు ఈనెల 18న జరగనున్న ఎన్నికల వ్యవహారం మంగళవారం నాటికి అనూహ్యమలుపు తిరిగింది. రాజ్యసభ ఎన్నికల రిటర్నింగ్ అధికారి అరవింద్ శర్మ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, అందుబాటులో ఉన్న పత్రాలను పరిశీలించగా, నామినేషన్‌తో పాటు సమర్పించిన 'ఫారం 26'లో ఒక కోర్టు ఫిర్యాదు వివరాలను పేర్కొనకపోవడం ద్వారా నటరాజన్ అసంపూర్ణ అఫిడవిట్‌ను సమర్పించినట్లు తేలింది. తెలంగాణలో తనపై నమోదైన కేసు వివరాలను అఫిడవిట్‌లో పేర్కొనలేదని ఆరోపిస్తూ, బిజెపి అభ్యర్థి మహేష్ కేవత్ రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశారని మధ్యప్రదేశ్ అసెంబ్లీ అధికారి ఒకరు తెలిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న తర్వాత, రిటర్నింగ్ అధికారి నటరాజన్ నామినేషన్‌ను తిరస్కరించారని ఆ అధికారి పేర్కొన్నారు. నామినేషన్ తిరస్కరణను 'ప్రజాస్వామ్య హత్య'గా అభివర్ణించిన కాంగ్రెస్, ఇది 'ఓట్ల దొంగతనం' కాదని, 'సీటు దొంగతనం' అని ఆరోపించింది.

# టైటిల్ గెలిచే నాలుగు జట్లు ఇవే!

ఫుట్‌బాల్ ప్రపంచంలోనే అతి పెద్ద పండుగ అయిన ఫిఫా ప్రపంచకప్ 2026 టోర్నీకి రంగం సిద్ధమైంది. మరికొద్ది గంటల్లో ఈ మెగా టోర్నీకి తెరలేవనుంది. అమెరికా, కెనడా, మెక్సికో సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్న ఈ టోర్నీలో తొలిసారి 48 జట్లు పోటీ పడుతున్నాయి. దాంతో టైటిల్ ఎవరిని వరిస్తుందనేది ఉత్కంఠగా మారింది. అయితే నాలుగు జట్లకు టైటిల్ గెలిచే అవకాశాలు ఉన్నాయి.




**1. అర్జెంటీనా** : డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా టైటిల్ రేసు లో ముందుంది. 2022 ప్రపంచకప్‌తో పాటు 2024 కోపా అమెరికా విజయాలతో అర్జెంటీనా ఫుట్‌బాల్ క్రీడలోనే ఎదురులేని శక్తిగా ఎదిగింది. కోచ్ లియోనెల్ స్కలోని పర్యవేక్షణలో జట్టు ఒక క్రమశిక్షణ గల కుటుంబంలా పనిచేస్తోంది. జూ లియన్ ఆల్వారెజ్, ఎన్జో ఫెర్నాండెజ్, అలెక్సిస్ మ్యాక్ అలిస్టర్ వంటి యువకులు వరల్డ్ క్లాస్ ప్లేయర్లుగా రాణిస్తున్నారు.పెనాల్టీ షూటౌట్‌లలో ప్రత్యర్థులను ఇబ్బంది పెట్టడంలో గోల్ కీపర్ 'ఎమిలియానో' మార్టినెజ్ కీలకం కానున్నాడు. ప్రస్తుతం మెస్సీ వయసు 39 ఏళ్లు. ఆయన ఫిట్‌నెస్‌పై సందేహాలు ఉన్నాయి. అతను జట్టుకు దూరమైతే నడిపించే నాయకుడు ఎవరా? అనేది ప్రశ్నార్థకంగా మారింది. డిఫెన్స్ ఆటగాళ్ల వయసు పైబడటం కూడా అర్జెంటీనాకు బలహీనతగా మారింది.

**2. ఫ్రాన్స్**: గత రెండు ప్రపంచకప్‌ల్లోనూ ఫైనల్స్ చేరడం ద్వారా ఫ్రాన్స్ తన ఆధిపత్యాన్ని చాటుకుంది. స్టార్ ఆటగాడు కైలియన్ ఎంబాప్పే నాయకత్వంలో ఈసారైనా టైటిల్ అందుకోవాలనే పట్టుదలతో ఉంది. ఫ్రాన్స్ జట్టుకు గల అతి పెద్ద బలం బెంచ్ స్ట్రెంత్. ఒక ఆటగాడు అందుబాటులో లేకున్నా.. అతనికి సమానమైన నైపుణ్యం కలిగిన మరో ముగ్గురు సిద్ధంగా ఉంటారు.వారి మెరుపు వేగంతో కూడిన కౌంటర్ అటాక్‌లు ఏ రక్షణ విభాగాన్నైనా ఛేదించగలవు. అయితే, గ్రీజ్మాన్ వంటి అనుభవం గల క్రీడాకారులు జట్టుకు దూరమైతే ఆ స్థానాన్ని భర్తీ చేయడం సవాలుగా మారవచ్చు. అలాగే, జట్టులో అంతర్గత సమన్వయం, కోచింగ్ సిబ్బందితో ఉండే సంబంధాలు ప్రదర్శనను ప్రభావితం చేసే అవకాశం ఉంది.

**3. బ్రెజిల్**: గత రెండు దశాబ్దాలుగా వరల్డ్ కప్ గెలవని బ్రెజిల్.. యువ ప్రతిభావంతులతో మళ్ళీ పుంజుకుంటోంది. వినీషియస్ జూనియర్, రోడ్రిగో ప్రస్తుతం ప్రపంచంలోని అత్యుత్తమ వింగర్లుగా నిలిచారు. వీరితో పాటు యువ సంచలనం ఎండ్రిక్ జత కలవడం జట్టుకు అదనపు బలాన్ని ఇస్తుంది.అయితే, నాకౌట్ దశలలో ఐరోపా జట్లతో ఆడేటప్పుడు బ్రెజిల్ తరచుగా తడబడుతుంటుంది. ముఖ్యమైన సమయాల్లో ఒత్తిడిని తట్టుకోవడం వారికి ప్రధాన సవాలు. అదనంగా, జట్టులో అచ్చమైన 'ప్లేమేకర్' లోపం స్పష్టంగా కనిపిస్తోంది. నెయ్మార్ అందుబాటులో ఉన్నా.. గాయాల కారణంగా ఆయన పూర్తిస్థాయిలో రాణిస్తారా అనే సందేహంగా మారింది.

**4. స్పెయిన్**: యూరో 2024 విజేతగా నిలిచిన స్పెయిన్.. హాట్ ఫేవరేట్‌గా బరిలోకి దిగుతోంది. తమ సాంప్రదాయ 'టికి టాకా' ఆటతీరు నుంచి బయటకు వచ్చి, వేగవంతమైన, అటాకింగ్ గేమ్స్‌ను అలవర్చుకున్నారు. లామిన్ యమల్, నికో విలియమ్స్ వంటి యువ వింగర్లు జట్టు స్వరూపాన్నే మార్చేశారు. రోడ్రి నాయకత్వంలో మిడ్ ఫీల్డ్ విభాగం అత్యంత బలంగా ఉంది. అయితే, కోల్పోయిన అవకాశాలను గోల్స్‌గా మలచడంలో స్పెయిన్ అప్పుడప్పుడు విఫలమవుతోంది. ఒక క్లినికల్ ఫినిషర్ లేకపోవడం వారికి ప్రధాన లోపం. అలాగే, ప్రపంచకప్ వంటి మెగా టోర్నీ ఒత్తిడిని యువ ఆటగాళ్లు ఎలా ఎదుర్కొంటారనేది వేచి చూడాలి.ఉత్తర అమెరికా ఖండంలో జరగనున్న ఈ టోర్నీలో వాతావరణ పరిస్థితులు, సుదీర్ఘ ప్రయాణాలు ఆటగాళ్లపై ప్రభావం చూపవచ్చు. అర్జెంటీనా, ఫ్రాన్స్, బ్రెజిల్, స్పెయిన్ జట్లు అగ్రపథంలో ఉన్నప్పటికీ.. ఇంగ్లండ పోర్చుగల్, జర్మనీ వంటి జట్లు కూడా కప్పు గెలిచే సత్తాకలిగి ఉన్నాయి. 2026 ప్రపంచకప్ ఫుట్‌బాల్ అభిమానులకు ఖచ్చితంగా ఒక గొప్ప విందు కానుంది.

## కౌంటీ క్రికెట్‌లోకి మానవ్ సుతార్..



**ముంబై:** ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగిన ఏకైక టెస్టులో అద్భుత ప్రదర్శన ఇచ్చిన స్పిన్నర్ మానవ్ సుతార్ ఇప్పుడు ఇంగ్లండ కౌంటీ జట్టు వార్‌విక్‌షైర్‌తో డీల్ కుదుర్చుకున్నాడు. కౌంటీ టీమ్‌తో స్వల్ప కాలిక ఒప్పందం కుదిరినట్లు తెలుస్తోంది. ఇటీవల జరిగిన ఆఫ్ఘన్‌తో జరిగిన మ్యాచ్‌లో టెస్టు అరంగేట్రం చేసిన రాజస్థానీ బౌలర్.. ఆ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్లు తీసి ప్రత్యర్థులను దెబ్బతీశాడు. ఇక రెండో ఇన్నింగ్స్‌లో అతను తన ఖాతాలో కేవలం ఒక్క వికెట్ మాత్రమే వేసుకున్నాడు. వార్‌విక్‌షైర్ కౌంటీ క్రికెట్ క్లబ్ మానవ్ సుతార్‌తో ఒప్పందంపై ప్రకటన చేసింది. షార్ట్ టర్మ్ కాంట్రాక్టు కుదుర్చుకున్నట్లు ఆ కౌంటీ పేర్కొన్నది. రోతేసే కౌంటీ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా జరిగే తర్వాత రెండు రౌండ్ల మ్యాచ్‌లకు సుతార్ ఆ జట్టుకు అందుబాటులో ఉండనున్నాడు. సుతార్‌కు ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లోనూ మంచి రికార్డు ఉన్నది. 29 మ్యాచుల్లో అతను 129 వికెట్లను తీసుకున్నాడు. ఇంగ్లండ్‌లో జరిగే కౌంటీల్లో ఆడడం వల్లే మానవ్ సుతార్‌కు మరింత అంతర్జాతీయ అనుభవం రానున్నది. ఆగస్టులో శ్రీలంకతో జరిగే టెస్టు సిరీస్‌కు ముందు సుతార్ కౌంటీల్లో ఆడనున్నాడు. మానవ్ సుతార్ మా జట్టుతో చేరడం సంతోషంగా ఉందని వార్‌విక్‌షైర్ పర్ఫార్మెన్స్ డైరెక్టర్ జేమ్స్ థామస్ తెలిపారు. యార్క్‌షైర్, సోమర్‌సెట్‌తో జరిగే మ్యాచుల్లో సుతార్ ఆడనున్నాడు.


## రోహిత్, హార్దిక్‌కు లైన్ క్లియర్



**ముల్లాన్‌పూర్:** ఆఫ్గానిస్థాన్‌తో వన్డే సిరీస్‌కు ముందు భారత స్టార్ క్రికెటర్లు రోహిత్‌శర్మ, హార్దిక్ పాండ్యా ఫిట్‌నెస్ పరీక్షలో పాసయ్యారు. ఇటీవల ముగిసిన ఐపీఎల్‌లో ఫిట్‌నెస్ సమస్యల కారణంగా కొన్ని మ్యాచ్‌లకు దూరమైన ఈ ఇద్దరికి బెంగళూరులోని సీవోఈ నుంచి క్లియరెన్స్ లభించింది. వెన్నునొప్పితో ఇబ్బందిపడుతున్న ఆల్‌రౌండర్ హార్దిక్..గత కొన్ని రోజులుగా సిఒఇలో పలు పరీక్షలు ఎదుర్కొన్నాడు. స్ట్రెంత్ అండ్ కండిషనింగ్ కోచ్‌ల సమక్షంలో హార్దిక్ 10 ఓవర్ల పాటు ఎలాంటి సమస్య లేకుండా బౌలింగ్ చేసినట్లు సీవోఈ వర్గాలు పేర్కొన్నాయి. మరోవైపు కండరాల గాయం నుంచి హిట్‌మ్యాన్ పూర్తిగా కోలుకున్నట్లు తెలిపాయి. దీం తో ఈ ఇద్దరు ఈనెల 15 నుంచి ధర్మశాల వేదికగా అఫ్గాన్‌తో జరిగే వన్డే సిరీస్‌కు అందుబాటులో ఉండనున్నారు

# శైశునాగ వంశం




మగధ రాజ్యాన్ని పాలించిన మరెండవ వంశంగా శైశునాగ వంశాన్ని పేర్కొంటారు. బౌద్ధ గ్రంథమైన మహావంశ ప్రకారం, హర్యంక వంశానికి చెందిన నాగదాసకుడి తరువాత ఈ వంశం మగధను పా లించింది. అయితే హిందూ పురాణాలు శైశునాగ రాజుల జాబితా. కాలక్రమం విషయంలో భిన్నమైన వివరాలు ఇస్తాయి. జైన గ్రంథాలు ఈ వంశాన్ని ప్రస్తావించ వు. శైశునాగుడు ఈ వంశ స్థాపకుడు. హర్యంక వంశానికి చెందిన చివరి రాజు నాగదాసకుడి వద్ద ఆయన అమాత్యుడు (మంత్రి)గా పనిచేశాడని చెబుతారు. సుమా రు క్రీస్తుపూర్వం 413 ప్రాంతంలో ప్రజా తిరుగుబాటు తర్వాత సింహాసనం అధిష్టించాడు. ప్రా రంభంలో రాజధాని వైశాలి కాగా, తరువాత కాలశోకుడి కాలంలో రాజధాని పాటలీపుత్ర (ప్రస్తుత పట్నా సమీపంలో)కు మారింది. సంప్రదాయం ప్రకారం కాలశోకుడి తరువాత అతని పది మంది కుమారులు పాలించారు. సుమారు క్రీస్తుపూర్వం 345లో నంద వంశం ఈ వంశాన్ని అధిగమించింది. జైన వనరులు శైశునాగ వంశాన్ని దాటవేసి హర్యంక వంశానికి చెందిన ఉదయినుడు హత్యకు గురయ్యాడని, సంతానం లేకపోవడంతో నందు డు మంత్రులచే రాజుగా ఎన్నికయ్యాడని పేర్కొంటాయి. చరిత్రకారుడు కెటిఎస్ సరావో బౌద్ధ చిన్న కాలక్రమంను అనుసరిస్తూ ఉదయినుని పాలనను క్రీస్తుపూర్వం 373–357 మధ్యగా నిర్ధారిస్తాడు. అతని అభిప్రాయం ప్రకారం ఉదయిన మరణం తర్వాత మగధ విభజనకు లోనై, వివిధ వనరుల్లో కనిపించే అనేక రాజులు ఒకేసారి వేర్వేరు ప్రాం తాల్లో పాలించి ఉండవచ్చని సూచించాడు. చరిత్రకారుడు జాన్ కీ కూడా ఈ కాలంలో రాజ్య వారసత్వంపై అనిశ్చితి ఉందని, రాజదర్బారులో కుట్ర లు, హత్యలు జరిగి ఉండవచ్చని వ్యాఖ్యానించా డు. కాగా, శైశునాగుడు సుమారు క్రీస్తుపూర్వం 413లో తన వంశాన్ని స్థాపించాడు. రాజగృహం మరియు తరువాత పాటలీపుత్ర అతని రాజధాను లు. బౌద్ధ వనరులు వైశాలిని ఉపరాజధానిగా పే ర్కొంటాయి. అవంతి రాజ్యంలోని ప్రద్యోత వంశా న్ని జయించి, మగధలో విలీనం చేసి, శతాబ్దాల పాటు కొనసాగిన ప్రత్యర్థిత్వానికి ముగింపు పలికాడు. పురాణాల ప్రకారం శైశునాగుడి తరువాత అతని కుమారుడు కాకవర్ణుడు వచ్చాడు. సింహళ వృత్తాంతాల ప్రకారం కాలశోకుడు అతని వారసుడు. కొందరు పండితులు ఈ ఇద్దరూ ఒకరేనని అభిప్రాయపడుతున్నారు. కాలశోకుడి కాలంలో క్రీస్తుపూర్వం 383లో వైశాలిలో ద్వితీయ బౌద్ధ సంఘం జరిగింది. రాజధాని పూర్తిగా పాటలీపుత్రకు మారింది. కొన్ని వృత్తాంతాల ప్రకారం అతను హత్యకు గురయ్యాడు. బౌద్ధ సంప్రదాయం ప్రకా రం అతనికి తొమ్మిది లేదా పది మంది కుమారు లు ఉన్నారు. వారిని ఉగ్రసేన నందుడు హతమార్చాడని చెబుతారు. బౌద్ధ సంప్రదాయం ప్రకారం కాలశోకుడి పది మంది కుమారులు ఒకేసారి పా లించారు. మహాబోధి వంశం ప్రకారం వారి పేర్లు భద్రసేన, కొరండవర్ణ, మంగుర, సర్వంజహ, జాలిక, ఉభక, సంజయ, కొరవ్యం, నందివర్ధన, పంచమక. పురాణాలలో నందివర్ధన పేర్లు మాత్ర మే ప్రస్తావనలో ఉన్నాయి. భాగవత పురాణం ప్ర కారం కాకవర్ణుని తరువాత క్షేమధర్మ, క్షేత్రజ్ఞ, విధిసార, అజాతశత్రు, దర్భక, అజయ, నందివర్ధన, మహానందినులు పాలించారు. ఇత ర పురాణాలు నందివర్ధనను తొమ్మిదవ శైశునాగ రాజుగా, అతని కుమారు డు మహానందిని చివరి శైశునాగుడిగా పేర్కొంటాయి. మహానందిని అతని అక్రమసంతానమైన మహాపద్మ నందుడు హత్య చేసి సింహాసనం అధిష్టించాడు. పురాణాల ప్రకారం శైశునాగ వంశం తరువాత నంద వంశం ఏర్పడింది. మహానందినుడి కుమారుడైన మహాపద్మ నందుడు నంద వంశాన్ని స్థాపించి మగధపై తన అధికారం స్థిరపరిచాడు.

## నంద రాజులు

బౌద్ధ, జైన, పురాణ సంప్రదాయాలన్నీ నందులు మొత్తం తొమ్మిది మంది రాజులు ఉన్నారని పేర్కొంటాయి. అయితే వారి పేర్లు, వారసత్వ క్రమం విషయంలో వనరుల మధ్య గణనీయమైన భేదాలు ఉన్నాయి. గ్రీకు–రోమన వృత్తాంతాల ప్రకారం నందుల పాలన రెండు తరాలకు మాత్రమే పరిమితమైంది. రోమన్ చరిత్రకారుడు కర్టియస్ ప్రకారం వంశ స్థాపకుడు క్షౌరికుడు రాజుగా మారినవాడని, అతని కుమారుడే చివరి నంద రాజు చెప్తాడు. చివరి నంద రాజైన ధనానందుడిని చంద్రగుప్త మౌర్యుడు అధికారం నుండి తొలగించాడని అంటాడు. కాగా. గ్రీకు రచనల్లో అగ్రమ్మెస్ లేదా జాండ్రమ్మెస్ అనే ఒకేఒక నంద రాజు పేరు మాత్రమే కనిపిస్తుంది. అగ్రమ్మెస్ అనే పేరు సంస్కృతంలోని అగ్రసైన్య (ఉగ్రసేనుని సంతానం) అనే పదానికి గ్రీకు రూపాంతరంగా అభివర్ణిస్తారు. బౌద్ధ సంప్రదాయం ప్రకారం వంశ స్థాపకుడు ఉగ్రసేనుడు. భారతీయ పురాణాలు (క్రీ.శ. 4వ శతాబ్దం ప్రాంతంలో సంకలనం చేయబడ్డవి, కానీ పూర్వ వనరుల ఆధారంతో) కూడా నందులు రెండు తరాలుగా పాలించారని పేర్కొంటాయి. కాగా, మహాపద్మని తరువాత అతని ఎనిమిది మంది కుమారులు కలిపి 12 సంవత్సరాలు పాలించారని పురాణాలు చెబుతాయి. అయితే వారిలో సుకల్ప అనే ఒక్కరి పేరే స్పష్టంగా ప్రస్తావించబడింది. వాయు పురాణంలోని ఒక ప్రతిలో అతని పేరు సహల్యగా ఉండి, ఇది బౌద్ధ గ్రంథమైన 'దివ్యవాదన'లోని సహలిన్‌కు సరిపోలుతుందని భావిస్తారు. 18వ శతాబ్దపు వ్యాఖ్యాత ధుందిరాజు ఒక నంద రాజును సర్వథసిద్ధి అని పేర్కొని, అతని కుమారుడు మౌర్యుడు, అతని కుమారుడు చంద్రగుప్త మౌర్యుడని చెప్పాడు. అయితే పురాణాలు నంద, మౌర్య వంశాల మధ్య ప్రత్యక్ష సంబంధాన్ని స్పష్టంగా పేర్కొనవు. శ్రీలంకకు చెందిన పాలి భాషా బౌద్ధ గ్రంథం 'మహావంశ' ప్రకారం, తొమ్మిది మంది నందులు సహోదరులుగా వరుసగా పాలించి, మొత్తం 22 సంవత్సరాలు అధికారం వహించారు. వారి పేర్లు వరుసగా.. ఉగ్రసేన (పాలి రూపం: ఉగ్గసేన), పండుక, పండుగతి, భూతపాల, రాష్ట్రమాల (రాష్ట్రపాల), గోవిశానక, దశసిద్ధక, కైవర్త, ధన (ధనానంద). ఈ విధంగా నంద రాజుల సంఖ్యపై దాదాపుగా ఏకాభిప్రాయం ఉన్నప్పటికీ, వారి పేర్లు, పాలనా కాలం, వారసత్వ క్రమం విషయంలో చారిత్రక వనరుల మధ్య విభిన్నత కనిపిస్తుంది.




## గ్రామీణ ప్రేమ కథ 'వంద దేవుళ్ళు'



విజయ్ ఆంటోని ఫిల్మ్ కార్పోరేషన్, ఫాతిమా విజయ్ ఆంటోనీ సమర్పణలో.. సర్వంత్ రామ్ క్రియేషన్స్ బ్యానర్ మీద రామంజనేయులు జవ్వాజి నిర్మించిన చిత్రం 'వంద దేవుళ్ళు'.ఈ సినిమాలో విజయ్ ఆంటోని, స్వాసిక, అజయ్, కావ్య, శక్తి, పదిని, కర్నాస్, బాలాజీ శక్తివేల్, దివాకర్, అరుళ్ దాస్, బక్స్, వినోదిని, మునిష్ కాంత్, కొడంగి వడివేలు తదితరులు ముఖ్య పాత్రల్ని పోషించారు. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన గ్లింప్స్, టీజర్, పాటలు, పోస్టర్లు ఆడియెన్స్‌లో అంచనాల్ని పెంచేశాయి. తాజాగా ఈ సినిమా ట్రైలర్ ను నిర్మాత కొణిదల నిహారిక ఆవిష్కరించారు. ఈ లోకంలో ప్రాణాలతో పుట్టిన అందరికీ కనీస అవసరాలుంటాయి.. తినడం, నిద్రపోవడం, తోడు వెతుక్కోవడం' అనే డైలాగ్‌తో ట్రైలర్ ప్రారంభమైంది. ఆ తరువాత వచ్చిన హీరో, హీరోయిన్‌ల ప్రేమ సన్నివేశాలు ఎంతో రిఫ్రెషింగ్‌గా అనిపించాయి. ఇక ఈ కథలో భార్యాభర్తల బంధం, తల్లీకొడుకుల అనుబంధాన్ని గొప్పగా చూపించినట్టు కనిపిస్తోంది. అన్ని రకాల ఎలిమెంట్స్‌ను జోడించిన ఈ కథను అద్భుతంగా మలిచినట్టు అనిపిస్తోంది. యాక్షన్స్, విజువల్స్, బీజీఎం ఇలా అన్నీ కూడా ట్రైలర్‌లో హైలెట్ అవుతున్నాయి.ఈ సినిమాకి ఎస్. బి. దర్శన్ కిర్లోష్ కెమెరామెన్‌గా, బాలాజీ శ్రీరామ్ సంగీత దర్శకుడిగా పని చేశారు. హరిష్ యువరాజ్ ఎడిటర్‌గా, భాష్య శ్రీ డైలాగ్ రైటర్‌గా వర్క్ చేశారు. ఇక ఈ మూవీని 19న గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతోన్నారు.

## ట్రాన్స్ జెండర్స్ జీవితాలను ఆవిష్కరించిన 'ఎల్‌జిబిటి లీగల్ బ్యాటిల్'



ట్రాన్స్ జెండర్స్ ఓటు హక్కు కోసం పోరాటం చేశారు. మనుషులుగా గుర్తించాలని ఉద్యమం చేశారు. ట్రాన్స్ జెండర్ల కోసం చట్టాలు కూడా వచ్చాయి కానీ ఈ చట్టాలు అమలు చెయ్యడం లేదు. దీనివల్ల సమాజంలో ట్రాన్స్ జెండర్స్ ఎన్ని ఇబ్బందులు పడుతున్నారు.? దీనికి పరిష్కారం ఏమిటి ? వంటి అంశాలను కథాంశంగా తీసుకుని తెరకెక్కించిన సినిమా 'ఎల్‌జిబిటి లీగల్ బ్యాటిల్'. శ్రావ్య ఫిలిమ్స్ బ్యానర్ పై సునీల్ కుమార్ రెడ్డి దర్శకత్వంలో రూపుదిద్దుకున్న ఈ సినిమా 19న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ నేపథ్యంలో మంగళవారం ఫిలిం ఛాంబర్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నటి, ట్రాన్స్ జెండ ర్ సంఘం అధ్యక్షురాలు లైలా మాట్లాడుతూ ఈ సినిమాలో ఒరిజినల్ ట్రాన్స్ జెండర్స్ చాలా మంది నటించమని చెప్పారు. ఇంతవరకు వచ్చిన కొన్ని సినిమాల్లో ట్రాన్స్ జెండర్ లను కొంత చులకనగా చూపించారని, దర్శకుడు సునీల్ కుమార్ రెడ్డి మాత్రం స్వయంగా ట్రాన్స్ జెండర్స్ ను పెట్టుకుని సినిమా తీశారని అన్నారు. తమ జీవితాలను తెరపై ఆవిష్కరించారని తెలిపారు. ఈ దేశంలో ట్రాన్స్ జెండర్స్ కోసం పలు చట్టాలు ఉన్నప్పటికీ ఆ చట్టాలు సరిగ్గా అమలు చెయ్యడం లేదని అన్నారు. ఈ సినిమాలో హీరోయిన్ గా నటించిన ట్రాన్స్ జెండర్ హిమ రాథోడ్ మాట్లాడుతూ తమ జీవితాలతో తెరకెక్కిన ఈ సినిమాలో నేను హీరోయిన్‌గా నటించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఈ సినిమా తప్పకుండ ప్రతి ఒకరు చూడాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నానని చెప్పారు. దర్శకుడు సునీల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఈ సినిమాను సింగిల్ థియేటర్స్‌లో కాకుండా మల్టి ప్లెక్స్ థియేటర్స్ లో మాత్రమే విడుదల చేస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటికే ఈ సినిమా పూణే ఫిలిం ఫెస్టివల్ లో ప్రదర్శితమైందని అన్నారు. రాబోయే రోజుల్లో జాతీయ అవార్డుకు కూడా పంపిస్తామని తెలిపారు. నటి సనాఖాన్, నటుడు విష్ణు తదితరులు పాల్గొన్నారు.



## 'సింగ్ గీతం'కు క్లీన్ 'యూ' సర్టిఫికెట్



లెజెండరీ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు, క్రియేటివ్ ఫిల్మ్‌మేకర్ నాగ్ అశ్విన్ నిర్మించిన చిత్రం 'సింగ్ గీతం'. ఈ చిత్రం తొలుత జూన్ 11న విడుదల కావాల్సి ఉండగా, ఇప్పుడు జూన్ 12కి వాయిదా పడింది. కథలో కీలక పాత్ర పోషించే కొన్ని ముఖ్యమైన సీజీఐ, విజువల్ ఎఫెకట్స్ పనులను మరింత మెరుగుపరచడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు చిత్ర బృందం వెల్లడించింది.'సింగ్ గీతం' ఒక ఫాంటసీ, సూపర్‌నేచురల్ ప్రపంచాన్ని ఆవిష్కరించే చిత్రం. ఇందులో సంగీతంతో పాటు విజువల్స్ కూడా కథనంలో అత్యంత కీలక పాత్ర పోషిస్తాయి. ప్రేక్షకులను ఆ ప్రపంచంలో పూర్తిగా లీనం చేసే అనుభూతిని కలిగించాలనే ఉద్దేశంతో, చిత్ర బృందం ఫైనల్ అవుట్‌పుట్‌ను మరింత పర్ఫెక్ట్ చేయడానికి అదనపు సమయం కేటాయిస్తోంది. థియేటర్‌లలోకి తొందరపడి తీసుకురావడం కంటే అత్యుత్తమ నాణ్యతతో అందించాలనే ఆలోచనతోనే ఈ ఒకరోజు వాయిదా నిర్ణయం తీసుకున్నారు.తాజాగా సినిమా సెన్సార్ పూర్తి చేసుకుంది. 'సింగ్ గీతం'కు క్లీన్ 'యూ' సర్టిఫికేట్ లభించింది. అందరూ ఫ్యామిలీతో కలిసి బిగ్ స్క్రీన్‌పై ఆస్వాదించదగిన అద్భుతమైన అనుభూతిని అందించేందుకు 12న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది.వైజయంతి మూవీస్, స్వప్న సినిమా సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో ఆయాన్, అహల్యా ప్రధాన పాత్రల్లో నటిస్తుండగా, శాలిని కొండెపూడి కీలక పాత్ర పోషిస్తున్నారు. రాక్‌స్టార్ దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించారు.

## డాన్స్ రంగంలో కొత్త రక్తం రావాలి



### ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్

సినిమా రంగంలో డాన్సర్లకు మంచి రోజులు వచ్చాయని, పాన్ ఇండియా స్థాయిలో సినిమాలు పెరిగిన నేపథ్యంలో డ్యాన్సర్లకు మంచి అవకాశాలు లభిస్తున్నాయని ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ అన్నారు. తెలుగు సినిమా ఇప్పుడు పాన్ ఇండియా స్థాయిలో అభివృద్ధి చెందిందని అందుకే పాన్ ఇండియా స్థాయిలో డ్యాన్సర్లకు అవకాశాలు వస్తున్నాయని చెప్పారు. ఎలాంటి అవకాశాలను ప్రతి ఒక్కరు సద్వినియోగ పరుచుకోవాలని కోరారు. హీరో రాజు, తన భార్య సుహానా కలిసి తన కూతురు ఖుషి పేరు మీద తమ కలలు సహకారం చేసుకునే విధంగా మొదలుపెట్టిన ఖుషి డాన్స్ స్టూడియో ప్రారంభమై సంవత్సరం పూర్తి అయి రెండవ సంవత్సరం లో దిగ్విజయంగా కొనసాగుతున్నా ఈ సందర్భంగా కూకట్‌పల్లిలోని వారి డాన్స్ స్టూడియో వద్ద రెండవ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన జానీ మాస్టర్ మాట్లాడారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా, డాన్స్ మాస్టర్, జానీ మాస్టర్, చిత్రం సీను కుతుబుల్లా నియోజకవర్గ ఎమ్మెల్యే కెపి వివేకానంద హాజరయ్యారు. అలాగే జబర్దస్త్ వినోద్ ఇంకా మరికొందరు సినీ సెలబ్రిటీలు, కొరియోగ్రాఫర్లు, డాన్సర్స్ పాల్గొని ఈ వేడుకను మరింత ఘనవిజయం చేశారు. తమ దగ్గర డాన్స్ నేర్చుకుంటున్న స్టూడెంట్స్‌తో కొన్ని డాన్స్ ప్రోగ్రాములు చేసి తమ ప్రతిభను చాటి చెప్పకుంటూ ఆ వేడుకను మరింత కళాత్మకంగా చేశారు. నటుడు చిత్రం శ్రీను మాట్లాడారు.

## రూ. లక్షలు తీసుకుని వరలక్ష్మి ప్రమోషన్స్‌కు రావడం లేదు



* డబ్బింగ్ చెప్పడానికి కూడా ఇబ్బంది పెట్టింది
* 'పోలీస్ కంప్లైంట్' దర్శక నిర్మాతల మండిపాటు

నటి వరలక్ష్మి శరత్ కుమార్ పై పోలీస్ కంప్లైంట్ సినిమా దర్శక నిర్మాతలు సంచలన వ్యాఖ్యలు చేశారు. వరలక్ష్మి శరత్ కుమార్ ప్రధాన పాత్రలో సంజీవ్ కుమార్ మేగోటి దర్శకుడిగా తెరకెక్కిన పోలీస్ కంప్లైంట్ సినిమా ఈనెల 12వ తేదీన విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం ఫిలిం ఛాంబర్ ప్రివ్యూ థియేటర్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో దర్శకుడు సంజీవ్ కుమార్ మేగోటి సంచలన ఆరోపణలు చేశారు. సినిమా షూటింగ్ లో ఒక్క రోజు కూడా ఇబ్బంది పెట్టకుండా పని చేసిన వరలక్ష్మి శరత్ కుమార్ సినిమా ప్రమోషన్స్ కు మాత్రం రావడం లేదని అన్నారు. అగ్రిమెంట్ ప్రకారం ఆమెకు ఇవ్వాల్సిన రెమ్యునరేషన్ మొత్తం ఇచ్చేసినాక కూడా ఆమె ప్రమోషన్స్‌కు రావడానికి నిరాకరిస్తున్నారని సంజీవ్ కుమార్ చెప్పారు. అయిదు సార్లు సినిమా ప్రమోషన్స్ కు రావాలని అగ్రిమెంట్ లో రాసుకున్నామని, కేవలం ఒకే ఒక సారి మాత్రమే ప్రమోషన్‌కు వచ్చారని అన్నారు. ఎన్ని సార్లు మెసేజ్ పెట్టినా స్పందన లేదని చెప్పారు. చివరికి వరలక్ష్మి మేనేజర్ కూడా ఫోన్ లిఫ్ట్ చెయ్యడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రథమార్థం డబ్బింగ్ పూర్తి అయినాక ద్వితీయార్థం డబ్బింగ్ చెప్పడానికి తీవ్ర ఇబ్బందులు పెట్టిందని అన్నారు. ఆమె కోసం మూడు నెలలపాటు డబ్బింగ్ ఆపుకోవాల్సి వచ్చిందని చెప్పారు. చివరికి ఎఐతో డబ్బింగ్ చెప్పించుకోండి లేదా వేరే వాళ్ళతో చెప్పించుకోండి అని వరలక్ష్మి చెప్పినట్టు సంజీవ్ కుమార్ తెలిపారు. ఇప్పటికే తాము రూపాయి కూడా ఆమెకు బాకీ లేమని, నిర్మాతలు పూర్తిగా డబ్బులు ఇచ్చేశారని పేర్కొన్నారు. ఆమె దర్శకత్వం వహించిన సరస్వతి సినిమా కోసం మా సినిమాను ఆమె వెనక్కి నెట్టేశారని అన్నారు. ఈ సినిమా షూటింగ్‌లో ఆమె చేతికి గాయమైతే తామే కావాలని రెండు నెలల పాటు షూటింగ్ వాయిదా వేశామన్నారు. మేము ఎంతో కో–ఆపరేటివ్‌గా ఉన్నప్పటికీ ప్రమోషన్ కు రాకపోవడం బాధాకరంగా ఉందని అన్నారు. ఒక పెద్ద హీరోయిన్ ఇలా చెయ్యడం సరైంది కాదని హీరో కృష్ణ సాయి అన్నారు. ఆమె రాసి ఇచ్చిన అగ్రిమెంట్ కాపీని సినిమా రిలీజ్ రోజే బయట పెడతాం అని అన్నారు.

## ప్రముఖ దర్శకుడు భారతి రాజా ఇక లేరు



ప్రముఖ తమిళ దర్శకుడు, నటుడు పద్మశ్రీ భారతి రాజా కన్నుమూశారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న ఆయన బుధవారం తుది శ్వాస విడిచినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. 1941 జులై 17న తమిళనాడులో జన్మించారు. గతేడాది భారతి రాజా కుమారుడు మనోజ్ భారతి రాజా మరణించడంతో అప్పటి నుంచి మానసికంగా కృంగిపోయిన భారతి రాజా అనారోగ్యం బారిన పడ్డారు. పలుమార్లు ఆసుపత్రికి వెళ్లి చికిత్స తీసుకున్నారు. కానీ తాజాగా చికిత్స కోసం శరీరం సహకరించలేదని, దీంతో ఆయన కన్ను మూశారని తెలిపారు. భారతి రాజా 1977లో '16 వయతినిలే ' చిత్రంతో దర్శకుడిగా పరిచయమైన అయ్యారు. ఇదే సినిమా తెలుగులో పదహారేళ్ళ వయసు పేరుతో రూపొందించారు. తన చిత్రాలలో గ్రామీణ జీవితాన్ని వాస్తవికంగా తెరకేకించే దర్శకుల్లో భారతి రాజా సిద్ధ హస్తుడు. ఆయన్ని తమిళ ప్రజలు 'ఇయక్కునార్ ఇమయం' అని పిలుస్తారు. భారతిరాజా ఆరు జాతీయ చలనచిత్ర పురస్కారాలు , నాలుగు ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్ సౌత్, ఆరు తమిళనాడు రాష్ట్ర చలనచిత్ర పురస్కారాలు, ఒక నంది అవార్డును గెలుచుకున్నారు. ఆయన తెలుగు, హిందీ భాషలలో కూడా చిత్రాలకు దర్శకత్వం వహించారు . చిత్ర పరిశ్రమకు ఆయన చేసిన సేవలకు గాను, భారత ప్రభుత్వం 2004లో అత్యున్నత పౌర పురస్కారమైన పద్మశ్రీ పురస్కారంతో ఆయనను సత్కరించింది . 2005లో, ఆయనకు సత్యభామ విశ్వవిద్యాలయం నుండి డాక్టర్ ఆఫ్ లెటర్స్ ( గౌరవ డిగ్రీ ) ప్రదానం చేశారు. తెలుగులో ఆయన రూపొందించిన సీతకోక చిలకకి తెలుగులో ఉత్తమ చలనచిత్రంగా జాతీయ చలనచిత్ర పురస్కారం అందుకున్నారు. ఈ సినిమాకు నంది అవార్డు కూడా అందుకున్నారు. జమదగ్ని లాంటి తెలుగు సినిమాతో పాటు తెలుగు, హిందీ భాషల్లో సినిమాలు రూపొందించారు. భారతి రాజా మృతి పట్ల తెలుగు చలన చిత్ర పరిశ్రమ, తమిళ చిత్ర పరిశ్రమ ప్రఘాఢ సంతాపం ప్రకటించింది.

## సైబర్‌టవర్స్ సమీపంలో

# రూ.3 వేల కోట్ల ప్రభుత్వ భూమి రక్షణ!





### హైకోర్టు తీర్పుతో 15 ఎకరాల భూమికి ఫెన్సింగ్ వేసిన హైడ్రా

### నకిలీ పత్రాల దశాబ్దం నాటి వివాదానికి తెర

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మాధాపూర్ సైబర్‌టవర్స్‌లో సమీపంలో ఉన్న సుమారు రూ. 3,000 కోట్ల విలువైన 15 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా రక్షించింది. హైకోర్టు ఇచ్చిన తీర్పుకు అనుగుణంగా బుధవారం ఈ భూమి చుట్టూ కట్టుదిట్టమైన ఫెన్సింగ్ వేసి, ప్రభుత్వ భూమిగా ప్రకటిస్తూ బోర్డులను ఏర్పాటు చేశారు. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ గ్రామంలోని సర్వే నెంబర్లు 41/12, 13, 14లో ఉన్న ఈ భూమి తమదంటూ 'ఇట్టినా ప్రాపర్టీస్' సంస్థ గతంలో కోర్టును ఆశ్రయించింది. విచారణ అనంతరం సమర్పించిన పట్టా పత్రాలు నకిలీవని, వాటికి చట్టబద్ధత లేదని రెవెన్యూ అధికారులు ఆధారాలతో కోర్టుకు వివరించారు. అయితే, రెవెన్యూ అధికారులు సమర్పించిన ఆధారాలతో పిటిషనర్ల నకిలీ పత్రాల గుట్టు రట్టయింది. 1978లో ఏర్పాటైన రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయం పేరుతో.. 1972, 1973లలోనే పట్టా పత్రాలు ఎలా సృష్టించారని అధికారులు కోర్టుకు నివేదించారు. అలాగే రికార్డుల్లో లేని 'పి. నరసింహారావు' అనే అధికారి పేరుతో నకిలీ ప్రొసీడింగ్స్ తయారు చేసినట్లు రుజువైంది. దీంతో జస్టిస్ నగేష్ భీమపాక విచారణ జరిపి దశాబ్ద కాలం నాటి వివాదానికి తెరదించుతూ, భూమిని కాపాడాలని ఆదేశించారు. రెవెన్యూ అధికారుల విజ్ఞప్తి మేరకు హైడ్రా రంగంలోకి దిగి భూమిని స్వాధీనం చేసుకుంది.

**ఖాజాగూడ చెరువుకు వరద నీరు చేరేలా చర్యలు**

ఐటి కారిడార్‌లో తలెత్తుతున్న వరద సమస్యల శాశ్వత పరిష్కారంపై హైడ్రా ప్రత్యేక దృష్టి సారించింది. ఐకియా, దుర్గం చెరువు, మాధాపూర్ పరిసరాల నుంచి వచ్చే వరద నీరు నేరుగా రోడ్లపైకి రాకుండా, ఖాజాగూడ చెరువులోకి చేరేలా అవసరమైన చర్యలు చేపట్టాలని హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ అధికారులకు సూచించారు. మంగళవారం కురిసిన భారీ వర్షానికి నగరంలో నీరు నిలిచిన ప్రాంతాలను బుధవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వరద నీటి సామర్థ్యానికి తగ్గట్టు కాలువలు లేకపోవడం వల్లే రోడ్లు మునుగుతున్నాయి. మురుగు నీరు ఎస్‌టిపిలకు వెళ్లేలా, అదనపు వరద నీరు నేరుగా చెరువుల్లోకి చేరేలా బాక్స్ డ్రెయిన్‌లను సమగ్రంగా అభివృద్ధి చేయాలని అధికారులకు రంగనాథ్ సూచించారు. వరద కాలువల్లో పేరుకుపోయిన పూడికను వెంటనే తొలగించాలని, ఈ ప్రక్రియ వర్షాకాలం ముగిసే వరకు నిరంతరాయంగా సాగాలని ఆదేశించారు. నగరంలో డీసిల్టింగ్ పనులను వేగవంతం చేసేందుకు త్వరలోనే 'మెట్ టీమ్'లు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. ఐటి కారిడార్‌లో ట్రాఫిక్ అంతరాయాలు, నీటిముంపు సమస్యలు తలెత్తకుండా చెరువులు, నాలాలు, స్టార్మ్ వాటర్ డ్రెయిన్‌ల అనుసంధాన వ్యవస్థ సమర్థవంతంగా పనిచేసేలా మున్సిపల్, ఇరిగేషన్, హైడ్రా శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు.

# పీసా చట్టం ఆదివాసీల స్వాభిమానానికి ప్రతీక

### మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** షెడ్యూల్డ్ ప్రాంతాల్లో గ్రామసభల సాధికారత, స్థానిక స్వపరిపాలన బలోపేతం, ఆదివాసీల హక్కుల పరిరక్షణకు పీసా చట్టం అత్యంత కీలకమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. పీసా చట్టం ఆదివాసీల స్వాభిమానానికి, స్వయం నిర్ణయాధికారానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. రాజేంద్రనగర్‌లోని తెలంగాణ గ్రామీణాభివృద్ధి సంస్థ (టిజిఐఆర్‌డి)లో షెడ్యూల్డ్5 ప్రాంతాల్లో పంచాయతీరాజ్ సంస్థల బలోపేతంలో పీసా చట్టం పాత్ర అంశంపై నిర్వహిస్తున్న రెండు రోజుల రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌ను మంత్రి సీతక్క మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీసా చట్టం కేవలం చట్టం మాత్రమే కాదని, ఆదివాసీల ఆత్మగౌరవానికి, సహజ వనరులపై హక్కులకు రాజ్యాంగబద్ధమైన రక్షణ కల్పించే సాధనమన్నారు. గ్రామసభలను బలోపేతం చేయడం ద్వారానే ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. షెడ్యూల్డ్ ప్రాంతాల్లో భూములు, అడవులు, జల వనరులు, ఖనిజ సంపదలపై గ్రామసభలకు నిర్ణయాధికారం కల్పించినప్పటికీ, చట్ట అమలులో ఇంకా అనేక సవాళ్లు ఉన్నాయని తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో స్థానిక ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా సహజ వనరులు కార్పొరేట్ సంస్థల చేతుల్లోకి వెళ్లే పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయని చెప్పారు. పీసా చట్టం ప్రజలను నిరాశ్రయులను చేసే చర్యలను అంగీకరించదన్నారు. అయితే చట్టంపై ప్రజలకు, అధికారులకు సంపూర్ణ అవగాహన అవసరమన్నారు. చట్ట స్ఫూర్తిని అర్థం చేసుకుని, అమలు చేసినప్పుడే ఆదివాసీలకు న్యాయం జరుగుతుంది అని మంత్రి స్పష్టం చేశారు. సర్పంచులు గ్రామాభివృద్ధి నిర్ణయాల్లో కీలక పాత్ర పోషించేలా పీసా చట్టం అవకాశం కల్పిస్తుందని, గ్రామసభలే స్థానిక ప్రజాస్వామ్యానికి మూలస్తంభాలని ఆమె అన్నారు. తాను ఉద్యమాల నుంచి వచ్చిన వ్యక్తినని, ఆదివాసీ ప్రాంతాల సమస్యలను దగ్గరగా చూసిన వ్యక్తిగా గిరిజన హక్కుల పరిరక్షణను ప్రత్యేక బాధ్యతగా భావిస్తున్నానని తెలిపారు. రాష్ట్రంలోని సర్పంచుల కోసం రూపొందించిన సర్పంచ్ సంవాద్ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ను ప్రస్తావించిన మంత్రి, ఈ వేదిక ద్వారా వేలాది మంది సర్పంచులు తమ అనుభవాలను పంచుకోవడంతో పాటు సమస్యల పరిష్కారానికి చర్చించే అవకాశం కలుగుతోందన్నారు. పీసా చట్టం అమలు పుస్తకాలకే పరిమితం కాకుండా గ్రామస్థాయిలో ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావాలని, గ్రామసభల నిర్ణయాలకు గౌరవం కల్పిస్తూ ఆదివాసీల స్వపరిపాలన స్ఫూర్తిని కార్యరూపంలోకి తీసుకురావాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు.

# ప్రభుత్వ వైద్య కళాశాలల్లో '433 వైద్యుల పోస్టుల' భర్తీ

### ఎంపికైన వైద్యుల జాబిత విడుదల..

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 30 స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ డిపార్ట్‌మెంట్లలోని 433 పోస్టుల భర్తీ ప్రక్రియను మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు పూర్తి చేసింది. ఈ మేరకు ఉద్యోగాలకు ఎంపికైన వైద్యుల జాబితాను బోర్డ్ బుధవారం విడుదల చేసింది. ప్రభుత్వ వైద్య కళాశాలలోని 34 విభాగాలకు చెందిన మొత్తం 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి బోర్డు గతంలో నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో అనస్తీషియా, గైనకాలజీ, పీడియాట్రిక్స్, ఆర్థోపెడిక్స్ విభాగాలకు చెందిన 174 పోస్టుల భర్తీ ప్రక్రియ ఇప్పటికే పూర్తయింది. ఆ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఇటీవలే నియామక పత్రాలను అందజేశారు. తాజాగా మిగిలిన 30 డిపార్ట్‌మెంట్లలో 433 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు సంబంధించిన తుది ఫలితాలు, సెలక్షన్ లిస్టును ఎంహెచ్‌ఎస్‌ఆర్‌బి విడుదల చేసింది. అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులతో పాటు, 4 స్పీచ్ పాథాలజిస్ట్ పోస్టులకు సంబంధించిన సెలక్షన్ జాబితాను కూడా బోర్డు విడుదల చేసింది. ఉద్యోగాలకు ఎంపికైన అసిస్టెంట్ ప్రొఫెసర్లు, స్పీచ్ పాథాలజిస్టులకు మంత్రి దామోదర్ రాజనర్సింహ శుభాకాంక్షలు తెలిపారు. త్వరలోనే వారికి నియామక పత్రాలను అందజేస్తామని ఆయన వెల్లడించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని , ప్రభుత్వ వైద్య కళాశాలలు, టీచింగ్ హాస్పిటల్స్, ఇతర ఆరోగ్య సంస్థల్లో మానవ వనరులను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఆయన తెలిపారు. గత రెండున్నర సంవత్సరాల కాలంలో రాష్ట్ర ఆరోగ్యశాఖ పరిధిలో సుమారు 15 వేల పోస్టులను భర్తీ చేసినట్లు మంత్రి గుర్తు చేశారు. ఇందులో ఎంబిబిఎస్ వైద్యులు, స్పెషలిస్టు వైద్యులు, నర్సింగ్ ఆఫీసర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, పారామెడికల్ సిబ్బంది తదితర విభాగాలకు చెందిన పోస్టులు ఉన్నాయని, ఈ నియామకాల ద్వారా ప్రభుత్వ హాస్పిటల్స్‌లో వైద్య సేవల నాణ్యత మరింత మెరుగుపడి, ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందుబాటులోకి వస్తాయని మంత్రి దామోదర రాజనర్సింహ ఆశాభావం వ్యక్తం చేశారు.

## భారతీరాజా మృతి పట్ల సిఎం రేవంత్ రెడ్డి సంతాపం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రముఖ సినీ నటుడు, దర్శకుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత భారతీరాజా మరణం పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. దాదాపు నాలుగు దశాబ్దాల పాటు చలనచిత్ర రంగంలో భారతీరాజా తనదైన విలక్షణ శైలితో చెరగని ముద్ర వేశారని సిఎం గుర్తుచేసుకున్నారు. దర్శకుడిగా, నటుడిగా భారతీయ సినీ రంగంలో ఆయన విశేష ఖ్యాతి గడించారని రేవంత్ రెడ్డి కొనియాడారు. భారతీరాజా మరణం భారతీయ సినీ జగత్తుకు తీరని లోటన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## ఢిల్లీకి సిఎం రేవంత్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి బుధవారం శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఢిల్లీకి బయలుదేరారు. గురువారం న్యూఢిల్లీలో జరిగే నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో సిఎం పాల్గొననున్నారు. రాష్ట్ర అభివృద్ధి, మౌలిక వసతులు, పెట్టుబడులు, కేంద్ర సహాయం తదితర అంశాలపైన ఆయన మాట్లాడనున్నారు.

## సిసిఐ వద్దనే రెడ్డీస్ ల్యాబ్స్ తేల్చుకోవాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) చేపడుతున్న విచారణను ఈ దశలో అడ్డుకోవడం సాధ్యం కాదని హైకోర్టు స్పష్టం చేసింది. విచారణ ఇంకా కొనసాగుతున్నందున, తుది నిర్ణయం వెలువడక ముందే న్యాయ సమీక్ష కోరడం సమంజసం కాదంటూ డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. కాంపిటీషన్ చట్టంలోని సెక్షన్లు 3, 4 ఉల్లంఘనలపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో సీసీఐ డైరెక్టర్ జనరల్ ద్వారా జరిపించిన దర్యాప్తు నివేదిక ఆధారంగా జారీ చేసిన నోటీసులను డాక్టర్ రెడ్డీస్ సవాలు చేసింది. దీనిని సీసీఐ విచారణలో ఉండగా తాము జోక్యం చేసుకోబోమని హైకోర్టు ప్రకటించింది. తన అభ్యంతరాలను సీసీఐ వద్దనే తేల్చుకోవాలని తీర్పు చెప్పింది. సీసీఐ ఉత్తర్వులపై సంతృప్తి లేనప్పుడు హైకోర్టులో అప్పీల్ దాఖలు చేసుకోవచ్చునని చట్టాన్ని గుర్తు చేసింది.

## రిటైర్డ్ ఎంప్లాయిస్ బకాయిల వివరాలివ్వండి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిల విషయంలో ప్రభుత్వం ఇప్పటికీ స్పష్టత ఇవ్వకపోవడంపై హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. గతంలో ఇచ్చిన హామీలు అమలు కాకపోవడాన్ని ప్రశ్నిస్తూ, పెండింగ్‌లో ఉన్న చెల్లింపులపై సమగ్ర వివరాలు సమర్పించాలని ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శిని ఆదేశించింది. కోర్టు ఆదేశించినప్పటికీ రిటైర్మెంట్ బెనిఫిట్స్ తమకు చెల్లించలేదంటూ దాఖలైన పలు కోర్టు ధిక్కరణ పిటిషన్లను హైకోర్టు విచారించింది. గ్రాట్యుటీ, కమ్యూటేషన్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ తదితర ప్రయోజనాలు అందకపోవడంతో వందలాది మంది ఉద్యోగులు హైకోర్టును ఆశ్రయించారు. విచారణ సందర్భంగా ఇప్పటివరకు ఎన్ని టోకెన్లు జారీ చేశారో, వాటిలో ఎన్ని చెల్లింపులు పూర్తయ్యాయో, ఇంకా ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయో వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని కోర్టు ఆదేశించింది. ముఖ్యంగా బకాయిల కోసం ఎదురుచూస్తున్న ఉద్యోగుల సంఖ్య, చెల్లింపుల కాల పట్టికను వెల్లడించాలని స్పష్టం చేసింది. గతంలో ప్రభుత్వం, పెండింగ్ మొత్తాలను చెల్లిస్తామన్న హామీని ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించింది. ఇంకా చెల్లించాల్సిన వాళ్ల వివరాలను రెండు వారాల్లోగా అందజేయాలని ఆదేశించింది.

## మెట్రో స్టేషన్ల వద్ద ఫుట్‌పాత్ వ్యాపారాల అనుమతుల వివరాలివ్వండి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మెట్రో రైల్వే స్టేషన్ల పరిసర ప్రాంతాల్లోని ఫుట్‌పాత్‌లపై వాణిజ్య కార్యకలాపాలకు అనుమతులు ఇవ్వడంపై హైకోర్టు సందేహాలు వ్యక్తం చేసింది. పాదచారుల సౌకర్యం కోసం నిర్మించిన ఫుట్‌పాత్‌లను వ్యాపార అవసరాలకు వినియోగించడం చట్టబద్ధమేనా అనే అంశాన్ని పరిశీలించనున్నట్లు తెలిపింది. ఈఎస్‌ఐ ఆస్పత్రి, అమీర్‌పేట మెట్రో స్టేషన్ల వద్ద ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురవుతున్నాయని, వాటిని తొలగించాలని చేసిన ఫిర్యాదులపై జీహెచ్‌ఎంసీ స్పందించలేదని పిటిషనర్ తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై మెట్రో రైల్వే తరఫు న్యాయవాది స్పందిస్తూ, ప్రయాణేతర ఆదాయ వనరులను పెంచుకునే క్రమంలో కొన్ని వాణిజ్య సంస్థలకు అనుమతులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఇందుకు అవసరమైన శాఖల అనుమతులు తీసుకున్నామని, ప్రభుత్వం జారీ చేసిన జీవో–73 ప్రకారం చర్యలు చేపట్టినట్లు వివరించారు. దీనిపై న్యాయమూర్తి జోక్యం చేసుకుని, పిటిషనర్ సమర్పించిన ఫొటోలను పరిశీలిస్తే.. ఫుట్‌పాత్‌లపై వ్యాపార కార్యకలాపాలు జరుగుతున్నట్లు స్పష్టంగా కనిపిస్తున్నాయని వ్యాఖ్యానించారు. ప్రజలకు నడవడానికి ఉద్దేశించిన ప్రదేశాలను ఆక్రమించడం ప్రజాప్రయోజనాలకు విరుద్ధమని పేర్కొన్నారు. జీవో–73, అలాగే వ్యాపారాలకు ఇచ్చిన అనుమతుల ప్రతులను కోర్టులో సమర్పించాలని మెట్రో అధికారులను ఆదేశించిన న్యాయమూర్తి, తదుపరి విచారణను జులై 17కు వాయిదా వేశారు.

## సినిమా టిక్కెట్ ధరల పెంపుపై హైకోర్టు అసంతృప్తి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సినిమా టిక్కెట్ ధరల పెంపు విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానంపై హైకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. కోర్టు ముందు ధరలు పెంచబోమని హామీ ఇస్తూనే, కొత్త సినిమాల విడుదల సమయంలో ప్రత్యేక అనుమతులు ఇవ్వడం ఎందుకని ప్రశ్నించింది. కోర్టు ధిక్కరణ పిటిషన్‌ను హైకోర్టు విచారించింది. 'పెద్ది' సినిమా ప్రదర్శన సందర్భంగా టిక్కెట్ ధరల పెంపునకు అనుమతిస్తూ ప్రభుత్వం జారీ చేసిన మెమోను సవాలు చేస్తూ పిటిషన్ దాఖలైంది. 2021లో జారీ చేసిన జీవో–120 ప్రకారం థియేటర్ల వర్గీకరణ ఆధారంగా టిక్కెట్ ధరలు నిర్ణయించాలని గతంలో హైకోర్టు ఆదేశాలు ఇచ్చిందని న్యాయమూర్తి గుర్తు చేశారు. అలాంటప్పుడు అదే అంశంపై కొత్త సినిమా వచ్చినప్పుడల్లా ప్రత్యేక మెమో జారీతో టిక్కెట్ రేట్లను ఎలా పెంచుతారని ప్రశ్నించారు. సినిమా విడుదలలసమయంలో ధరల పెంపు అనుమతించడం ఇప్పుడు సర్వసాధారణమైందని తప్పుపట్టారు. గత కోర్టు ఉత్తర్వుల అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని ఆదేశించారు. విచారణను ఈ నెల 15వ తేదీకి వాయిదా వేశారు.

# 'దోస్త్'లో 8 కొత్త కోర్సులు

### 'మూడో విడత' పూర్తయిన తర్వాతే ఎంపికకు అవకాశం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** వివిధ యూనివర్సిటీలకు చెందిన బోర్డ్ ఆఫ్ స్టడీస్ (బిఓఎస్) నుంచి అనుమతులు రావడంతో రాష్ట్రంలో మొత్తం 8 రకాల కొత్త కోర్సులను రాష్ట్ర ఉన్నత విద్యామండలి ప్రవేశపెట్టింది. దీంతో వాటిని దోస్త్ పోర్టల్‌లో పెట్టారు. ప్రస్తుతం మూడో విడత కౌన్సెలింగ్ ప్రక్రియ కొనసాగుతుండగా, విద్యార్థులు కొత్త కోర్సులలో తమకు నచ్చిన కోర్సులను ఎంచుకునే అవకాశాన్ని కల్పించారు. దోస్త్ మూడో విడత వెబ్ ఆప్షన్ల నమోదుకు ఈ నెల 16వ తేదీ వరకు గడువు ఉన్నది. ఇప్పటికే మొదటి రెండు విడతల్లో వేరే కోర్సుల్లో సీట్లు పొందిన విద్యార్థులు కూడా ప్రస్తుతం అందుబాటులోకి వచ్చిన కొత్త కోర్సులపై ఆసక్తి ఉంటే వాటిని ఎంచుకునేందుకు వెసులుబాటు కల్పించారు. అయితే మూడు దశల ప్రక్రియ ముగిసిన తర్వాత మాత్రమే కొత్త కోర్సులను మార్చుకునే వెసులుబాటును కల్పించనున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులకు ఆధునిక విద్యా విధానాలను అందించాలనే ఉద్దేశంతో ఉన్నత విద్యామండలి రాష్ట్రంలోని ఐదు ప్రధాన యూనివర్సిటీల పరిధిలో కొత్త కోర్సులను ప్రవేశపెట్టింది. ఈ కోర్సుల నిర్వహణ కోసం రాష్ట్రవ్యాప్తంగా సుమారు 67 కళాశాలలు దరఖాస్తు చేసుకోగా, సంబంధిత వర్సిటీల బిఓఎస్‌లు వీటిని ఆమోదించాయి. పాలమూరు, శాతవాహన, తెలంగాణ, కాకతీయ యూనివర్సిటీల పరిధిలోని కోర్సులు ఇటీవల పోర్టల్‌లో చేరగా తాజాగా ఉస్మానియా యూనివర్సిటీలో కూడా కొత్త కోర్సులు అందుబాటులోకి వచ్చాయి.

ఉస్మానియా వర్సిటీలో...బికామ్ ఇంటర్‌నేషనల్ బ్యాంకింగ్ ఫైనాన్స్ అండ్ అకౌంట్స్, బికామ్ ఫైనాన్స్ టెక్నాలజీ, బికామ్ ఈ కామర్స్, ఎం.కామర్స్ అండ్ డిజిటల్ మార్కెటింగ్ అందుబాటులో ఉన్నది. కాకతీయ వర్సిటీ పరిధిలో బిఎ సైబర్ సెక్యూరిటీ అండ్ సైబర్ గవర్నెన్స్, బిఎ డిఫెన్స్ అండ్ సెక్యూరిటీ స్టడీస్. పాలమూరు వర్సిటీలో బిఎ డిఫెన్స్ అండ్ సెక్యూరిటీ స్టడీస్, బికామ్ ఈ కామర్స్, ఎం కామర్స్ అండ్ డిజిటల్ మార్కెటింగ్, బికామ్ ఫైనాన్స్ టెక్నాలజీ కోర్సులను కొత్తగా ప్రవేశపెట్టారు. శాతవాహన వర్సిటీ, తెలంగాణ వర్సిటీ పరిధిలో బిఎ డిఫెన్స్ అండ్ సెక్యూరిటీ స్టడీస్, బికామ్ ఈ కామర్స్, ఎం కామర్స్ అండ్ డిజిటల్ మార్కెటింగ్, బిఎస్సి డిజిటల్ ఫోరెన్సిక్ సైన్స్ అండ్ సైబర్ సెక్యూరిటీ కోర్సులు ఉన్నాయి.

## రానున్న ఎన్నికల్లో బిసిలకు 50 శాతం సీట్లు

### కల్వకుంట్ల కవిత

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో టిఆర్‌ఎస్ తరపున 50 శాతం టికెట్లను బిసి నాయకులకు కేటాయిస్తామని తెలంగాణ రక్షణ సేన (టిఆర్‌ఎస్ ) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హామీనిచ్చారు. చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, శ్రీకాంతాచారిల రుణం తీర్చుకునేందుకే బిసి రిజర్వేషన్ల సాధన ఉద్యమాన్ని ప్రారంభించామన్నారు. హైదరాబాద్‌లోని టిఆర్‌ఎస్ కార్యాలయంలో బిసి నాయకులతో కవిత బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ బిసి రిజర్వేషన్ల బిల్లును రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పంపించి, చేతులు దులుపుకున్నదని ఆరోపించారు. ఈ బిల్లు ఆమోదం కోసం కేంద్ర ప్రభుత్వంపైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒత్తిడి పెంచేందుకు ప్రయత్నించడం లేదన్నారు. దేశవ్యాప్తంగా బిసిలకు 50 శాతం రిజర్వేషన్ల సాధన కోసం ఉద్యమిస్తానన్నారు.

## 'రీ డిజైన్ 'పేరుతో కెసిఆర్ అన్యాయం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** నాటి సిఎం కెసిఆర్ ప్రాణహిత చేవెళ్లను రీ డిజైన్ చేసి మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాలకు నష్టం చేస్తే, తుమ్మిడిహెట్టిని నిర్మిస్తామని ఇచ్చిన హామీని సిఎం రేవంత్ రెడ్డి నిలబెట్టుకోకుండా అన్యాయం చేస్తున్నారని టిఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కామెర నవీన్‌కుమార్ ఆరోపించారు. హైదరాబాద్‌లోని టిఆర్‌ఎస్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆ పార్టీ నాయకులు ఎదురుగట్ల సంపత్ గౌడ్, దండెం ఆనందం, ఎత్తరి మారయ్యతో కలిసి నవీన్ కుమార్ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మైలారం వరకు 71 కిలోమీటర్ల కాల్వను తవ్వినప్పటికీ తుమ్మిడి హెట్టి బ్యారేజీ నిర్మించలేదని, మైలారం తర్వాత జైపూర్ సింగరేణి ఓపెన్ కాస్ట్ మైన్స్‌ను బైపాస్ చేసే అవకాశం ఉన్నప్పటికీ ఆ ప్రయత్నం కూడా చేయకుండా అప్పటి ప్రభుత్వం ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును వదిలేసిందని ఆరోపించారు.

### దేశాన్ని మోసం చేసిన ప్రధానిగా

## మోదీ రికార్డు పాలనకు అభినందనలు

### మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశాన్ని మోసం చేసిన ప్రధానమంత్రిగా ప్రధాని నరేంద్రమోదీ రికార్డు పాలనకు అభినందనలు తెలియజేస్తున్నానని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అని ఎద్దేవా చేశారు. రికార్డు స్థాయిలో అప్పులు, అవినీతి, ఇంధన ధరలు, నిరుద్యోగం, ప్రశ్నాపత్రాల లీకులు, రూపాయి విలువ పతనం వంటి అంశాలు మోదీ పాలనలో చోటుచేసుకున్నాయని బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆరోపించారు. కొంతమందిని ఎల్లప్పుడూ, అందరినీ కొంతకాలం మోసం చేయవచ్చు. కానీ గత 12 సంవత్సరాలుగా యావత్ దేశాన్నే మోసం చేయడంలో మోదీ ప్రభుత్వం విజయం సాధించిందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ఆకాంక్షలను, అభివృద్ధి అవసరాలను నిర్లక్ష్యం చేస్తూ వచ్చిందని విమర్శించారు. రాష్ట్ర విభజన చట్టంలో ఇచ్చిన ప్రధాన హామీల్లో ఒక్కటి కూడా పూర్తిగా అమలు కాలేదన్నారు. తెలంగాణ అభివృద్ధిని కోరుకుంటే బిజెపి మాత్రం విభజన రాజకీయాలను ప్రోత్సహిస్తోందని, రాజకీయ ప్రయోజనాల కోసం మత విద్వేషాలను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తోందన్నారు. మోసం, నిర్లక్ష్యం, వివక్షల కాలం ముగింపు దశకు చేరుకుందన్నారు. తెలంగాణ ప్రజలు బిజెపి వ్యవహారాన్ని ఎప్పటికీ మర్చిపోరని, క్షమించబోరన్నారు.

# 22న 'బసవతారకం' రజతోత్సవాల ముగింపు సభ

### క్యాన్సర్ తో పోరాడుతున్న చిన్నారుల మధ్య పుట్టిన రోజు వేడుకలు జరుపుకున్న నందమూరి బాలకృష్ణ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్, రీసెర్చి ఇన్స్టిట్యూట్ రజతోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని జూన్ 22న సాయంత్రం హైటెక్ సిటీలోని నొవాటెల్ హోటల్‌లో నిర్వహిస్తున్నామని చైర్మన్ నందమూరి బాలకృష్ణ వెల్లడించారు. బుధవారం హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కార్యక్రమ వివరాలను తెలిపారు. 2000 వ సంవత్సరంలో ప్రారంభమైన సంస్థ 25 సంవత్సరములు పూర్తి చేసుకొని ముందుకు సాగుతోందని ప్రస్థానాన్ని వివరించారు. నందమూరి తారకరామారావు, బసవతారకంల ఆశయాల మేరకు నడపడం జరుగుతోందని అంటూ గత సంవత్సర కాలంగా రజతోత్సవ వేళ పలు కార్యక్రమాలను నిర్వహించామని తెలిపారు. ఈ రజతోత్సవ కార్యక్రమాల ముగింపు ఈ నెల 22 న నిర్వహించబోయే భారీ కార్యక్రమంతో ముగుస్తుందని వివరించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర ఆరోగ్య శాఖామాత్యులతో జె పి నడ్డాతో పాటు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రులు విశిష్ట అతిదులుగా హాజరుకానున్నారని తెలిపారు. వీరితో పాటూ కేంద్ర విమానయాన శాఖా మంత్రి రామ్మోహన నాయుడు, కేంద్ర ఆరోగ్య శాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్, తెలంగాణా ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, ఆంధ్ర ప్రదేశ్ ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ లు హాజరుకానున్నారని బాలకృష్ణ వెల్లడించారు. మీడియా సమావేశానికి ముందుగా హాస్పిటల్ ఆవరణలో ఏర్పాటు చేసిన పుట్టిన రోజు వేడుకలలో నందమూరి బాలకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్యాన్సర్ తో పోరాడుతున్న చిన్నారుల మధ్య సంస్థ సిబ్బంది ఏర్పాటు చేసిన భారీ కేక్ ను కట్ చేసి వారితో పంచుకొన్నారు. అనంతరం చిన్నారులకు బొమ్మలు, ఇతర బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమాలలో డా. టి సుబ్రహ్మణ్యేశ్వర రావు, డా. ఫణికోటేశ్వర రావు, డా. కల్పనా రఘునాథ్, అసోసియేట్ డైరెక్టర్ అకడమిక్స్, పలువురు వైద్య విభాగాధిపతులు, వైద్యులు, నర్సింగ్, పారా మెడికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తుమ్మిడిహెట్టి విషయంలో బిజెపివి అబద్ధాలు

### మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణం విషయంలో తెలంగాణ ప్రభుత్వంపై బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్‌కు తెలంగాణ సిఎం ఎ.రేవంత్‌రెడ్డి ఎలాంటి లేఖ రాయలేదని చెప్పడం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమేనని విమర్శించారు. సిఎం కార్యాలయం నుంచి పంపిన లేఖలకు సంబంధించిన ఆధారాలు, మహారాష్ట్ర సీఎం కార్యాలయం ఇచ్చిన అంగీకార పత్రాలు తమ వద్ద ఉన్నాయని స్పష్టం చేశారు. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణం వల్ల ఆదిలాబాద్ నుంచి రంగారెడ్డి జిల్లా చేవెళ్ల వరకు లక్షలాది ఎకరాలకు సాగునీరు అందుతుందని చెప్పారు. ఈ కీలక ప్రాజెక్టుపై రాజకీయాలు చేయకుండా, మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరిపి పరిష్కారం తీసుకురావడంలో బిజెపి సహకరించాలని సూచించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి మే 6న మహారాష్ట్ర సిఎంకు లేఖ రాశారని, అనంతరం మే 26న సిఎం రేవంత్ రెడ్డి మరోసారి లేఖ పంపారని తెలిపారు. ఆ లేఖలు అందినట్లు మహారాష్ట్ర సీఎం కార్యాలయం ధృవీకరించిందని పేర్కొన్నారు. ఆ లేఖల ప్రతులను కూడా రామచందర్‌రావుకు పంపిస్తామని, తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.రామచందర్ రావుకు నిజంగా తెలంగాణ ప్రయోజనాలపై చిత్తశుద్ధి ఉంటే స్వయంగా మహారాష్ట్రకు వెళ్లి తమ పార్టీ ప్రభుత్వాన్ని చర్చలకు ఒప్పించాలని మంత్రి సవాల్ విసిరారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీని 152 మీటర్ల ఎత్తులో నిర్మించేందుకు సహకరిస్తే తెలంగాణ ప్రజలు ఆయనను అభినందిస్తారని అన్నారు. లేకపోతే తెలంగాణకు మేలు చేసే ప్రాజెక్టును అడ్డుకునే వారిగా ప్రజల్లో నిలిచిపోతారని హెచ్చరించారు.

## ప్రధాన మంత్రిగా నెహ్రూ 17 ఏళ్ళ రికార్డ్

### మోదీనే ఎక్కువ రోజులు పాలించినట్టుగా బిజెపి అసత్య ప్రచారాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రధాన మంత్రిగా జవహర్‌లాల్ నెహ్రూ 17 ఏళ్ళ పాటు భారతదేశాన్ని పాలించి రికార్డ్‌ను సృష్టించారని తెలంగాణ ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి అన్నారు. దాదాపు ఎడాది పాటు ప్రధాని హోదా కలిగిన వైస్ ప్రెసిడెంట్ అఫ్ బ్రిటీష్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ బాధ్యతలను కూడా నిర్వహించారని, కానీ నెహ్రూ కంటే మోదీనే ఎక్కువ రోజుల పాటు దేశాన్ని పాలించినట్టుగా బిజెపి నాయకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆయన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భారతదేశంలో 1946 సెప్టెంబర్ 2 నుంచి 1947 ఆగస్టు 16 వరకు 346 రోజులు ప్రధాని హోదా కలిగిన వైస్ ప్రెసిడెంట్ అఫ్ బ్రిటిష్ వైస్రాయ్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌గా, 1947 నుంచి 1952 వరకు వైస్ ప్రెసిడెంట్ నుంచి ప్రధాని హోదాతో, 1952 సాధారణ ఎన్నికల్లో గెలిచి 1964 వరకు ప్రధాన మంత్రిగా జవహర్ లాల్ నెహ్రూ 17 సంవత్సరాల పాటు పనిచేశారని వివరించారు. స్వాతంత్ర్యానికి ముందు దాదాపు 346 రోజుల పాటు వైస్ ప్రెసిడెంట్ గా అఖండ భారతదేశాన్ని పాలించారని, ఇది ఒక రికార్డ్ అని, ఈ వాస్తవ చరిత్రను బిజెపి నాయకులు వక్రీకరిస్తున్నారని మండిపడ్డారు. బిజెపి నాయకులు దేశ చరిత్రను చదువుకోవాలని, ప్రజలను తప్పుదోవపట్టించవద్దని హితవు చెప్పారు. భారత దేశ స్వాతంత్ర్యం కోసం కాంగ్రెస్, కమ్యూనిస్ట్ పార్టీలు పోరాటాలు చేసి, జైలుకు వెళ్ళారని, ఆస్తులు దానం చేశారని, స్వాతంత్ర్య పోరాటంలో బిజెపి నాయకుల పాత్ర అసలే లేదని చిన్నారెడ్డి గుర్తు చేశారు.

## 2016 దివ్యాంగుల హక్కుల చట్టంపై పార్లమెంట్‌లో గళమెత్తుతా

భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/రామన్నపేట** : దివ్యాంగుల కోసం 2016 చట్టం అమల్లోకొచ్చి 10 సంవత్సరాలు పూర్తి అయిన అందులో ఉన్న ఒక్క అంశం కూడా అమలు కాకపోవడంతో దేశవ్యాప్తంగా దివ్యాంగులు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని, అన్ని సమస్యలు పరిష్కారం కావడానికి ఏర్పడిన చట్టం 2016 దివ్యాంగుల చట్టం అమలు కాకపోవడంతో పార్లమెంట్లో దివ్యాంగుల పక్షాన మాట్లాడి చట్టం అమలుకు కృషి చేస్తానని అందులో అంశాలపై భవిష్యత్తులో దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి దివ్యాంగుల విశ్వవిద్యాలయాల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎన్.అశోక్ హైదరాబాదులో గచ్చిబౌలి తన నివాసానికి పిలిపించుకొని వికలాంగుల అంశాలపై చర్చించి డాక్టర్ అశోక్ రూపొందించిన దివ్యాంగుల ముఖ్యాంశాలు, దివ్యాంగుల 2016 చట్టం పుస్తకాన్ని చూసి ప్రతి అంశాన్ని చదివి అధ్యయనం చేసిన ఎంపి పార్లమెంట్లో మాట్లాడి చట్టం అమలుకై కృషి చేస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ డిసిసి ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపిటీసీ తాటిపాముల శేఖర్ గౌడ్ పాల్గొన్నారు.

## ఫీజుల దోపిడీని నియంత్రించాలి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజులు విచ్చలవిడిగా పెంచారని,పెంచిన ఫీజుల దోపిడీని నియంత్రించాలని జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ డిమాండ్ చేశారు.బుధవారం ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు సమస్యలకు నిలయాలుగా మారాయని,ప్రభుత్వ పాఠశాలల్లో నూతన భవనాలు నిర్మించాలని,మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలని, జీవో నెంబర్ 1, 42 అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్హత లేని టీచర్లతో బోధన చేస్తున్న ప్రైవేట్ పాఠశాలపై చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు.లేకపోతే సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.వినతి పత్రం అందజేసిన వారిలో జిల్లా సహాయ కార్యదర్శి పట్టు శివ,జిల్లా ఉపాధ్యక్షుడు జిల్లా యశ్వంత్,జిల్లా కమిటీ సభ్యుడు వినయ్ తదితరులు ఉన్నారు.

## ఐటిఐ,ఎటిసిల్లో అడ్మిషన్లకు జూన్ 30 చివరి తేదీ

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** 2026/27/28 విద్యా సంవత్సరానికి ఐటిఐ,ఎటిసి(అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్స్)లలో అడ్మిషన్ల కోసం నోటిఫికేషన్ విడుదలైనట్లు నల్గొండ జిల్లా ఐటిఐ కన్వీనర్,ప్రిన్సిపాల్ ఎ.నర్సింహాచారి తెలిపారు.జిల్లాలోని ఏటిసీ,ప్రభుత్వ,ప్రైవేటు ఐటిఐలలో ఒకటి,రెండు సంవత్సరాల కోర్సుల్లో ప్రవేశాల కోసం మొదటి విడత దరఖాస్తుల స్వీకరణ జూన్ 30 వరకు ఆన్‌లైన్‌లో కొనసాగుతుందని పేర్కొన్నారు.అభ్యర్థులు ఎస్ఎస్‌సి,కుల ధ్రువీకరణ,బోనఫైడ్ స్టడీ 1 నుండి 7 తరగతుల వరకు సర్టిఫికెట్లు,తెలంగాణలో చదివిన వారైతే అభ్యర్థులుగా పరిగణిస్తారని తెలిపారు. ఒరిజినల్ సర్టిఫికెట్లు ఫోటోతో సహా స్కాన్ చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు.10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు వెబ్‌సైట్‌లో మొబైల్ నంబర్‌తో రిజిస్టర్ చేసుకోవాలని,సొంత ఫోన్ నంబర్ ఇస్తే అడ్మిషన్‌కు సంబంధించిన సమాచారం ఎస్ఎంఎస్ ద్వారా పంపుతారని తెలిపారు.ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## ఇంకుడు గుంతలు నిర్మించాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** వాన నీటి సంరక్షణ కోసం ఇంకుడుగుంతల నిర్మాణం చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మి అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా బుధవారం పట్టణంలోని 46వ వార్డులో నిర్వహించిన వార్డు సభలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరు తమ ఇండ్లలో ఇంకుడు గుంతల నిర్మాణం చేసుకోవడం ద్వారా వాననీటిని సంరక్షించుకోవచ్చన్నారు. లేనట్లయితే భవిష్యత్తులో నీటి కొరత ఏర్పడే అవకాశం ఉందన్నారు. ఈ ఎండాకాలం చాలా మంది ఇండ్లలో భూగర్భ జలాలు ఇంకిపోయి నీటి కోసం ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. అనంతరం వార్డు మహిళలకు ఇంటింటి చెత్త సేకరణ బుట్టలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ హన్మంత రెడ్డి, మేనేజర్ బచ్చిబాబు, శ్రీలత్ శ్వేత, 33వ వార్డు కౌన్సిలర్ నాగుల వాసు, దంతాల సాయినవీన్, గౌసుద్దీన్, రాజేశ్వరి, ఉమా రాణి, ఉపేందర్ పాల్గొన్నారు.

## సత్తిరెడ్డి పార్థివదేహానికి నివాళులు

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** సంస్థాన్ నారాయణపురం మండలం లింగం వారి గూడెం గ్రామానికి చెందిన భువనగిరి జిల్లా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లె శేఖర్ రెడ్డి మామ చిల్కూరు సత్తిరెడ్డి(76) అనారోగ్యంతో బాధపడుతూ తుది శ్వాస విడిచారు. ఆయన పార్థివ దేహానికి ఎమ్మెల్యే నెల్లికంటి సత్యం, మాజీ ఎమ్మెల్యేలు ఉజ్జిని యాదగిరిరావు ,కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చన గోని గాలయ్య ,సిపిఐ రాష్ట్ర సమితి నాయకుడు ముత్యాల యాదిరెడ్డి,సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, స్థానిక మాజీ సర్పంచులు, ఎంపిటీసీలు, ఆయన పార్థివదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సత్తిరెడ్డి గ్రామంలో ప్రతి ఒక్కరితో కలుపుగోలుగా ఉండేవారని గుర్తు చేశారు. సిపిఐ శాఖ కార్యదర్శి పెంటయ్య, పల్లె సత్తిరెడ్డి, సిపిఐ శాఖ కార్యకర్తలు పాల్గొన్నారు.



## ముస్లిం మైనార్టీలకు రిజర్వేషన్‌తో పాటు

# నాణ్యమైన విద్య అందిస్తాం

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** తమ ప్రభుత్వం ముస్లిం మైనార్టీలకు రిజర్వేషన్‌తో పాటు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నదని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు.బుధవారం ఆయన జిల్లా కేంద్రంలోని మాన్యంచల్కలో రూ.44 లక్షల వ్యయంతో నిర్మించనున్న ఉర్దూ మీడియం ప్రైమరీ స్కూల్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.నూతనంగా నిర్మించనున్న ఉర్దూ మీడియం ప్రైమరీ పాఠశాల నిర్మాణ పనులు రేపటి నుంచి ప్రారంభమవుతాయని,అవసరమైతే రూ.కోటి వరకు ఖర్చు చేసి మంచి భవనాన్ని నిర్మిస్తామని మంత్రి తెలిపారు. తమ ప్రభుత్వం విద్యకు, వైద్యానికి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నదన్నారు. గతంలో తమ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడే వైఎస్ఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఉర్దూను రెండవ భాషగా చేయడం జరిగిందని,సచార్ కమిటీ సిఫారసుల మేరకు ముస్లిం మైనార్టీలకు నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించడం జరిగిందన్నారు.మేయర్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తమ ప్రభుత్వం విద్య, వైద్యానికి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నదని అన్నారు.కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్,జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు ఆరిఫ్ ఖాన్,జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్ రావు,మౌలానా సిద్ధిఖీ,బషీర్,అక్బర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.అనంతరం మంత్రి కలెక్టరేట్ వెనుకవైపు ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పరిశీలించారు. చిన్న చిన్న మరమ్మతులన్నీ పూర్తి చేసి జూలైలో గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

**17న నల్లగొండకు సిఎం రేవంత్ రెడ్డి**

**హ్యామ్ రోడ్లకు శంకుస్థాపన, భారీ బహిరంగ సభ**

17న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నల్లగొండ జిల్లాకు రానున్నట్లు రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. బుధవారం జిల్లాలో వివిధ అభివృద్ధి,సంక్షేమ పథకాల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల నిమిత్తం జిల్లాకు వచ్చిన మంత్రి,మాన్యంచల్క ఉర్దూ మీడియం ప్రాథమిక పాఠశాల పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం మీడియాతో మాట్లాడారు.రాష్ట్రంలో సుమారు రూ.13,000 కోట్లతో హ్యామ్ రోడ్లను నిర్మించనున్నామని,ఇందులో భాగంగా 6,300 కిలోమీటర్ల రోడ్లను డబుల్ రోడ్లుగా మార్చేందుకు టెండర్లు పిలిచామని,పనులు కూడా ప్రారంభిస్తామని తెలిపారు.రాష్ట్ర ముఖ్యమంత్రి ఈనెల 17న సాయంత్రం కనగల్ సమీపంలో హ్యామ్ రోడ్ల పనులకు శంకుస్థాపన చేయనున్నారని,అనంతరం ధర్వేశిపురం ఎల్లమ్మను దర్శించుకోనున్నారని తెలిపారు.

# రోడ్డు ప్రమాదాలకు మానవ తప్పిదాలే కారణం

రాష్ట్ర డిజిపి(సాంకేతిక సేవలు) వివి శ్రీనివాస్‌రావు



**ప్రజాపక్షం/చిట్యాల:** దేశ వ్యాప్తంగా జరిగే రోడ్డు ప్రమాదాలు ముమ్మాటికి మానవ తప్పిదాల కారణంగానే జరుగుతున్నాయని రాష్ట్ర డిజిపి(సాంకేతిక సేవలు) వివి శ్రీనివాస్‌రావు అన్నారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు గ్రామంలో బుధవారం జరిగిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీస్ శాఖ ఏర్పాటు చేసిన 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మద్యం తాగి, సెల్ ఫోన్ మాట్లాడుతూ, ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడపడం లాంటి మానవ చర్యల కారణంగానే రోడ్డు ప్రమాదాలు జరగుతూ మరణాలు పెరుగుతున్నాయన్నారు. దేశంలో ద్విచక్ర వాహనాల ద్వారా 27 శాతం, పాదచారులు 23 శాతం రోడ్డు ప్రమాదాల రూపంలో మరణిస్తున్నారన్నారు. ప్రమాదాల రూపంలో మరణాల సంఖ్య, ఆస్థి నష్టాలను గణనీయంగా తగ్గించడానికి పోలీస్ శాఖ సరికొత్త ప్రణాళికలతో ముందుకొస్తుందని, ప్రమాదాల నివారణకు 1000 మంది దళంతో ప్రత్యేకమైన శాఖను త్వరలో ప్రజల ముందుకొస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్, డిఎస్‌పి శివరాంరెడ్డి, గ్రామ సర్పంచ్ చంద్రారెడ్డి, మార్కెట్ కమిటి చైర్మన్ నర్రా వినోదమోహన్‌రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ ఏనుగు రఘుమారెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**హెల్మెట్ ధరించడం తప్పనిసరి చేసిన పాలక వర్గం:** నేటి నుండి హెల్మెట్ లేకుండా వాహనాలను నడపడాన్ని వెలిమినేడు గ్రామ పంచాయతీ పాలకవర్గం నిషేధించింది. సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ సభలో పాల్గొన్న గ్రామ ప్రజలు గ్రామ సభలో ఈ విషయంపై తీర్మానం చేశారు. గ్రామంలో ప్రతి ఒక్క వాహనదారుడు హెల్మెట్ ధరించడాన్ని తప్పనిసరి చేస్తూ చేసిన తీర్మానాన్ని డిజిపి శ్రీనివాసరావుకు సర్పంచ్ చంద్రారెడ్డి అందజేశారు. హెల్మెట్ రహిత వాహనదారుడి ఫోటోలు తీసి పోలీసులకు పంపించడం జరుగుతుందని, ఇట్టి తీర్మానాన్ని ఎవరు కూడా ఉల్లంఘించకూడదని సర్పంచ్ చంద్రారెడ్డి ఈ సందర్భంగా హుకుం జారీ చేశారు.

# ఫీజు నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలి



ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలి : ఎఐవైఎఫ్

**ప్రజాక్షం/యాదాద్రి :** అఖిలభారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) యాదాద్రి భువనగిరి జిల్లా సమితి ఆధ్వర్యంలో ప్రైవేటు కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజు నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలని రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలలో భర్తీ చేయాలను కోరుతూ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రెవెన్యూ అధికారి గారికి మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎల్లంకి మహేష్, పేరబోయిన మహేందర్ మాట్లాడుతూ ప్రైవేటు కార్పొరేట్ విద్యాసంస్థల అధిక ఫీజులతో విద్యార్థులను ,తల్లిదండ్రులను ఆర్థికంగా దోపిడీ చేస్తున్నాయని ఫీజులు కట్టలేక విద్యార్థులు చదువుకోలేని పరిస్థితులు ఈ రాష్ట్రంలో ఉన్నాయని వెంటనే ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేసి విద్యార్థుల తల్లిదండ్రులకు న్యాయం చేయాలని కోరారు. రాష్ట్రంలో లక్షలాదిమంది యువత ఉన్నత విద్య పూర్తి చేసి ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారు రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ శాఖల్లో వేలాది పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ వాటి భర్తీ ప్రక్రియ మాత్రం ఆశించిన స్థాయిలో జరగడం లేదని దీంతో నిరుద్యోగ యువత తీవ్ర నిరాశకు గురవుతున్నారన్నారు అలాగే ప్రభుత్వ పాఠశాలలో, కళాశాలలో అధ్యాపక కొరత, మౌలిక సమస్యలతో విద్యాసంస్థలను బలహీనపరిస్తున్నాయన్నారు వెంటనే ఖాళీగా ఉన్నటువంటి ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ విధానాలకు బదులుగా శాశ్వత ఉద్యోగాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎండి నహీం, మొగుళ్ళ శేఖర్ రెడ్డి, జిల్లా నాయకులు నరసింహ చారి, బత్తిని నరేష్, బెల్లి నగేష్, అంతటి రాము పాల్గొన్నారు.

## ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ పనులను పరిశీలించిన మంత్రి



ప్రాజెక్టును నవంబర్‌లో పూర్తి చేయాలని మంత్రి గుత్తేదారులకు ఆదేశం

**ప్రజాపక్షం/చింతలపాలెం :** చింతలపాలెం మండలం పాతవెల్లటూరు వద్ద రూ.1648కోట్లతో 53000 ఎకరాలకు నీరు అందించే మహాత్మా గాంధీ ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పనులను బుధవారం రాష్ట్ర నీటి పారుదల, ఆహార పౌర సరఫరాల శాఖల మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి పరిశీలించారు. ముందుగా మంత్రి అండర్ గ్రౌండ్ నందు పంపు హౌస్ పనులను పరిశీలించి తదుపరి సమావేశంలో మాట్లాడుతూ కృష్ణానది మీద నిర్మిస్తున్న మహాత్మా గాంధీ ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ మొత్తం ఖర్చు రూ.1648కోట్లు కాగా ఈ లిఫ్ట్ ఇరిగేషన్ 16 మెగావాట్ల 4 మోటార్ల ద్వారా నీటిని పంపింగ్ చేయడం ద్వారా మట్టంపల్లి మండలంలో 9 గ్రామాల్లో 20,466 ఎకరాలకు, మేళ్లచెరువు మండలంలో 5 గ్రామాలలో 15,829 ఎకరాలకు, చింతలపాలెం మండలంలో 9 గ్రామాలలో 16,705 ఎకరాలకు మొత్తం 53వేల ఎకరాలకు సాగునీరు అందించడం జరుగుతుందన్నారు. దీని ద్వారా 5080 ఎస్‌టి, 3540 ఎస్‌సి, 8470 బిసి, 2205 ఓసి కుటుంబాలు మొత్తంగా 19,295 కుటుంబాలు లబ్ధిపొందుతాయని దీని కొరకు 191 ఎకరాల రైతుల భూములను కొనుగోలు చేసి వారికి నష్టపరిహారంగా రూ.56 కోట్లు చెల్లించడం జరిగిందని తెలిపారు. ఈ ప్రాజెక్టును నవంబర్‌లో పూర్తి చేయాలని మంత్రి గుత్తేదారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పెరిక కార్పోరేషన్ చైర్మన్ దొంగరి వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్, డిసిసి జిల్లా అధ్యక్షులు గుడిపాటి నర్సయ్య, ఇరిగేషన్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## నగరాభివృద్ధికి ప్రజల సూచనలే మార్గదర్శకం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** ప్రజల భాగస్వామ్యంతో ప్రజా పాలన,ప్రగతి ప్రణాళిక,వార్డు సభలు చివరి విడత ప్రశాంతంగా ముగిసిందని మున్సిపల్ కమిషనర్ బి.శరత్ చంద్ర పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక ప్రత్యేక వార్డు సభల కార్యక్రమం చివరి విడత వార్డు సభలు బుధవారం నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రశాంతంగా ముగిసింది.ఈ సందర్భంగా ప్రజలు, కార్పొరేటర్లు, వార్డు అధికారులు,స్వయం సహాయక సంఘాల సభ్యులు,మున్సిపల్ అధికారులు సిబ్బంది హాజరై విజయవంతం చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ బి. శరత్ చంద్ర మాట్లాడుతూ ప్రజా పాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమం ద్వారా నగర ప్రజల అభిప్రాయాలు, అవసరాలు, సమస్యలు , అభివృద్ధి సూచనలను నేరుగా తెలుసుకునే అవకాశం లభించిందన్నారు. ఈకార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో సహకరించిన కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు,వార్డు అధికారులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, స్వయం సహాయక సంఘాల సభ్యులు, స్వచ్ఛంద సంస్థలు,మీడియా ప్రతినిధులు నగర ప్రజలందరికీ ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## కాంగ్రెస్ బిఎల్‌ఏలకు ప్రత్యేక శిక్షణ



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆదేశాల మేరకు మిర్యాలగూడ నియోజకవర్గంలో బూత్ లెవెల్ ఏజెంట్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్‌లతో కలిసి ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ప్రారంభించి మాట్లాడారు. బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేయడంలో ఏజెంట్ల పాత్ర కీలకమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రతి అర్హుడికి ఓటు హక్కు అందేలా కృషి చేయడంతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియ, ఓటరు నమోదుపై కార్యకర్తలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు పున్నా కైలాష్ నేత, మాజీ డీసీసీ అధ్యక్షుడు మానసపల్లి లింగాజీ పాల్గొన్నారు.

## శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయ భూమి కౌలువేలం



**ప్రజాపక్షం/మునగాల:** మండల పరిధిలోని బరాఖత్‌గూడెం గ్రామంలో గల స్వయంభుగా వెలసిన శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన 25 ఎకరాల దేవాలయ భూములకు 2026/27 సంవత్సరానికి గానూ దేవాదాయ ధర్మదాయ చట్టం ప్రకారం అధికారులు కౌలువేలం పాటను బుధవారం దేవాలయ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ వేలంపాట దేవాలయ చైర్మన్ పోలిశెట్టి శ్రీనివాసరావు, ఈవో సత్యనారాయణ సమక్షంలో నిర్వహించారు. సుమారు 370 మంది రైతులు వేలం పాటలో పాల్గొన్నారు. 19 ఎకరాల మగాణి భూమిని గ్రామానికి చెందిన పోలుదాసు వీరమ్మకు, ఆరు ఎకరాల భూమిని గ్రామానికి చెందిన గడ్డం సుబ్బారావు లు దక్కించుకున్నారు. కౌలు వానకాలం 12 బస్తాలు, యాసంగి 11 బస్తాల చొప్పున ఇచ్చే ఖరారుగా నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చల్లా గురవయ్య, దేవాలయ కమిటి చైర్మన్ పోలిశెట్టి శ్రీనివాసరావు, ధర్మకర్తలు గోవిందరామారావు, గుడిపాటి వెంకటరమణ వెంకటేశ్వర్లు, ఇనుగుర్తి వీరచారి, వట్టె సైదులు, కొర్ర తులసి, ఆలయ ప్రధాన అర్చకులు కందాళ శ్రీనివాసచార్యులు, ఉప సర్పంచ్ వేనేపల్లి శైలజ, కాలే సామ్యేలు, ఉప్పుల నాగిరెడ్డి, వీరారెడ్డి, ఏనుగుల నాగేశ్వరరావు, నరాల వెంకటేశ్వర రావు, ప్రతాపనేని సతీష్ పాల్గొన్నారు.

## జనావాసాల మధ్య సెల్‌టవర్ వద్దు

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** జనావాసాల మధ్య మొబైల్ సెల్‌టవర్ ఏర్పాటుపై పెన్‌పహాడ్ గ్రామ ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. బుధవారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక గ్రామసభ గ్రామ సర్పంచ్ ఒగ్గు రవి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ గ్రామంలోని నివాసాల మధ్య సెల్‌టవర్ నిర్మాణాలు చేయాలా వద్దా అని అడుగగా ప్రజలు, మహిళలు సెల్‌టవర్ నిర్మాణాలను జనావాసాల మధ్య కొనసాగించవద్దని ఏకగ్రీవంగా చేతులెత్తి తమ నిరసనను వ్యక్తం చేశారు. రేడియేషన్ వల్ల భవిష్యత్తులో పిల్లలు, వృద్ధులు తీవ్ర అనారోగ్య సమస్యల బారినపడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. టవర్‌ను గ్రామానికి దూరంగా నిర్మించాలని డిమాండ్ చేశారు. దీంతో గ్రామ సర్పంచ్, పంచాయితీ కార్యదర్శి నాగరాజు సానుకూలంగా స్పందించారు. ప్రజాస్వామ్యంలో ప్రజల నిర్ణయమే సర్వోన్నతమైనదన్నారు. ప్రజల తీర్పును ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జి. సతీష్, షేక్ సైదులు, షేక్ అలీసాహెబ్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

# అనుక్షణం పౌరుల భద్రత రక్షణలో పోలీస్ శాఖ

సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట :** పౌరుల భద్రత రక్షణలో పోలీసు శాఖ అనుక్షణం పని చేస్తుందని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బుధవారం అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నుండి త్రివేణి ఫంక్షన్ హాల్ వరకు సూర్యాపేట పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులు, పౌరులతో కలిసి అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత ర్యాలీ నిర్వహించారు. అనంతరం త్రివేణి ఫంక్షన్ హాల్ నందు పౌరులకు అవగాహన సదస్సుకు జిల్లా ఎస్‌పి కె. నరసింహాతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లా వ్యాప్తంగా అనేక రకాల అవగాహన కార్యక్రమాలు, గ్రామ సభలు నిర్వహిస్తూ ప్రజలను చైతన్యపరుస్తున్నాం అన్నారు. జిల్లా వ్యాప్తంగా అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రోడ్డు ప్రమాదాల నివారణలో, రోడ్డు ప్రమాద మరణాలు సంభవించకుండా అధికారులు సంకల్పంతో పనిచేయాలన్నారు. పోలీస్, రోడ్డు ట్రాన్స్‌పోర్ట్, ఆర్‌టిసి, ఇతర శాఖలు సమన్వయంతో పని చేయాలని అన్నారు. రోడ్డు ప్రమాద క్షతగాత్రులను కాపాడి సహాయ సహకారాలు అందించే వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. రహదారి భద్రత ప్రతి ఒక్కరి భద్రత అని చెప్పారు. రోడ్డు భద్రత అంటే రోడ్డుపై ప్రయాణం చేసే సమాజంలో ప్రజలు, వాహనదారులు సురక్షితంగా గమ్యం చేరడమని జిల్లా ఎస్‌పి కె. నరసింహ అన్నారు. ప్రతి సంవత్సరం తెలంగాణ వ్యాప్తంగా 7500కుపైగా ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు. మన జిల్లాలో సగటున సంవత్సరానికి 250 మంది రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారని తెలిపారు. అధిక ప్రమాదాలు నిర్లక్ష్యం, అజాగ్రత్త వల్లనే సంభవిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తప్పుడు మార్గంలో వాహనాలు నడపడం, పిల్లలు వాహనాలు నడపడం, రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ వాహనాలు నిలపడం, అతివేగంగా వాహనాల నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయని వివరించారు. వీటిని నిర్మూలించాలంటే ప్రతి ఒక్కరు జాగ్రత్తగా అవగాహనలో వాహనాలు నడుపాలన్నారు. అర్వపల్లి, మోతె, చివ్వెంల, మునగాల, తుంగతుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాద సంఘటనలను వివరించారు. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలు ఎన్ని బాధలు పడుతున్నాయో ఒక్కసారి ఆలోచించాలని తెలిపారు. అనంతరం ఆశా కార్యకర్తలకు హెల్మెట్ అందించి, రోడ్డు ప్రతిజ్ఞ చేయించారు. పోలీసు కళాబృందం వారు పాటలతో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి ప్రసన్న కుమార్, ఎంవిఐ ఆదిత్య, సూర్యాపేట పట్టణ, రూరల్ సిఐలు వెంకటయ్య, రాజశేఖర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, ఆర్‌టిసి ఇన్‌స్పెక్టర్ సైదులు, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు ప్రవీణ్ కుమార్, జానయ్య, పట్టణ ఫైర్ స్టేషన్ అధికారి జానయ్య, అసిస్టెంట్ మోటార్ ట్రాన్స్‌పోర్ట్ అధికారి సతీష్, ఎస్‌ఐలు ఏడుకొండలు, మహేందర్‌నాథ్, సాయిరాం, ఆర్‌ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## స్వచ్ఛ మున్సిపాలిటీకి సహకరించాలి



**ప్రజాపక్షం/హాలియా:** హాలియా మున్సిపాలిటీని స్వచ్ఛ మున్సిపాలిటీగా చేసుకునేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి అన్నారు.బుధవారం మున్సిపాలిటీలోని 4,5,9 వార్డుల్లో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాల్లో భాగంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఉందన్నారు.ప్రజలు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను పొందుతూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని తెలిపారు.వార్డుల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు అవార్డు కౌన్సిలర్లు దృష్టికి తీసుకుపోవాలని తెలిపారు. పధానంగా పరిశుద్ధ నిర్వహణలో తమ సిబ్బందికి వార్డు ప్రజలు సహకారం అందించి పరిశుభ్ర పట్టణంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత మనందరిపై ఉందని చెప్పారు. అనంతరం సభ్యులతో కలిసి ప్రమాణం చేయించారు.ఈసమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గౌని రాజా రమేష్ యాదవ్, కౌన్సిలర్లు చిట్టిపోలు శ్రీదేవి,9వ వార్డు కౌన్సిలర్ చెరుపల్లి ముత్యాలు,కోఆప్షన్ సభ్యులు రాజేశ్వరి,శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
గురువారం
11-06-2026
www.prajapaksham.in


ములుగు...


మహబూబ్‌నగర్


కరీంనగర్...


వరంగల్...


నల్లగొండ...

# పెట్రో ధరలు తగ్గించాలని సిపిఐ నిరసనలు

**ప్రజాపక్షం/కరీంనగర్ :** ప్రధాని నరేంద్ర మోదీ సామాన్య, పేద, మధ్యతరగతి ప్రజలపై భారాలు మోపుతూ కార్పోరేట్లకు, బడా పెట్టుబడుదారులకు కొమ్ముకాస్తున్నాడని సిపిఐ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి ఆరోపించారు. వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరల పెంపును నిరసిస్తూ సిపిఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు బుధవారం సిపిఐ కరీంనగర్ జిల్లా సమితి ఆధ్వర్యంలో కరీంనగర్ ఎంపిడిఓ కార్యాలయం చౌరస్తా నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. కార్యాలయం లోపలికి వెళ్ళేందుకు కార్యకర్తలు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులకు, సిపిఐ నేతలకు మధ్య తోపులాట జరగగా, సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్‌కు స్వల్ప గాయాలయ్యాయి. అనంతరం నేతలను పోలీసులు బలవంతంగా అరెస్టు చేసి పిటిసికి తరలించారు. ఈ సందర్భంగా స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకోగా, పలువురి సిపిఐ నేతల చొక్కాలు చినిగిపోయాయి. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గసభ్యులు కొయ్యడ సృజన్ కుమార్, బోయిని అశోక్, గూడెం లక్ష్మి, టేకుల పల్లి సమ్మయ్య, బోయిని తిరుపతి, పిట్టల సమ్మయ్య, న్యాలపట్ల రాజు, కౌన్సిల్ సభ్యులు గోవిందుల రవి, బండ రాజిరెడ్డి, చొక్కల్ల శ్రీశైలం, గజ్జి ఆయిలయ్య, ఉమ్మెంతల రవీందర్‌రెడ్డి, లంకదాసరి కల్యాణ్, పైడిపల్లి రాజు, కసిరెడ్డి మణికంఠ రెడ్డి, కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, బీర్ల పద్మ, కొట్టె అంజలి, నలువాల సదానందం, అందె చిన్న స్వామి, బోయిని వల్లభాయ్ పటేల్, చాడ శ్రీధర్ రెడ్డి, మావురపు రాజు, తేరాల సత్యనారాయణ, మచ్చ రమేష్, బామండ్ల పెల్లి యుగేందర్, ఇజ్జగిరి రామ్ గోపాల్, మాదారపు రత్నాకర్ పాల్గొన్నారు.

**వరంగల్ :** పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను తగ్గించాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. పెరిగిన ధరలను నియంత్రించాలని డిమాండ్ చేస్తూ వరంగల్ కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. సిపిఐ వరంగల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమం ఉద్రిక్తతకు దారితీసింది. ఏకశిలా పార్కు నుంచి ప్రదర్శనగా బయలుదేరిన సిపిఐ నాయకులు, కార్యకర్తలు కలెక్టరేట్‌లోకి దూసుకెళ్లే ప్రయత్నం చేశారు. దీంతో పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేయగా పోలీసులకు, సిపిఐ నాయకులకు మధ్య తోపులాట జరిగింది. అనంతరం కలెక్టర్ కార్యాలయం ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్మియా, రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్, జిల్లా సహాయ కార్యదర్శులు దండు లక్ష్మణ్, పనాస ప్రసాద్, జిల్లా నాయకులు గన్నారపు రమేష్, బుస్సా రవీందర్, గుండె బద్రి, సంగి ఎలేందర్, అక్కపెల్లి రమేష్, కందిక చెన్నకేశవులు, వీరగోని శంకరయ్య, పార్థ సారథి, దామెర క్రిష్ణ, ఆరెల్లి రవి, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ల్యాదెళ్ల శరత్ పాల్గొన్నారు.


ఆదిలాబాద్..

**నల్లగొండ :** కేంద్రంలోని మోదీ ప్రభుత్వం డీజిల్, పెట్రోల్, వంటగ్యాస్ ధరలను విపరీతంగా పెంచి సామాన్య ప్రజలపై తీవ్ర భారం మోపిందని సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ఆరోపించారు. కేంద్రప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను తగ్గించాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని కోరుతూ నల్లగొండ జిల్లా కేంద్రంలోని గడియారం సెంటర్‌లో సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో భారీధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి, మాజీఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు, నాయకులు మల్లెపల్లి ఆదిరెడ్డి, పల్లా దేవేందర్ రెడ్డి, లోడంగి శ్రవణ్‌కుమార్, పబ్బు వీరస్వామి, బొల్గూరి నర్సింహా, బంటు వెంకటేశ్వర్లు, గురిజ రామచంద్రం, ఆర్.అంజచారి, టి.వెంకటేశ్వర్లు, నల్పరాజు రామలింగయ్య తూము బుచ్చిరెడ్డి, పట్టణ కార్యదర్శి కుర్ర సైదిరెడ్డి పాల్గొన్నారు. ధర్నాలో ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు బి.జగన్, జిల్లా కార్యదర్శి చెల్లం పాండురంగారావు నేతృత్వంలోని కళాకారుల బృందం ఆలపించిన చైతన్య గీతాలు ప్రజలను ఆకట్టుకున్నాయి.

**ఆదిలాబాద్ రూరల్ :** పెట్రోల్ ధరల పెరుగుదలను నిరసిస్తూ సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముట్టడించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి, కుంటాల రాములు, అర్ధాంగి రమేష్, అమీనా బేగం, మహబూబ్‌ఖాన్, సలీం, షేక్ పాషా, కట్టోజి స్వామి, ఎస్.అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**నస్పూర్ :** పెరిగిన గ్యాస్, పెట్రోల్, డీజిల్, నిత్యావసర సరుకుల ధరలను తక్షణమే తగ్గించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేణ శంకర్ డిమాండ్ చేశారు. సిపిఐ ఆధ్వర్యంలో మంచిర్యాల కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, రాష్ట్ర సమితి సభ్యులు మేకల దాసు, రేగుంట చంద్రశేఖర్, జోగుల మల్లయ్య, బొల్లం పూర్ణిమ, కె.వీరభద్రయ్య, నాయకులు కారుకూరి నగేష్, బీమనాథుని సుదర్శన్, మిట్టపల్లి శ్రీనివాస్, దాగం మల్లేష్, లింగం రవి, రేగుంట చంద్రకళ, బాజీ సైదా, అడేపు రాజమొగిలి, కొండు బానేష్, బొంతల లక్ష్మినారాయణ, కామెర దుర్గరాజ్, దేవి పోచన్న, అందే పురుషోత్తం, పూజారి రామన్న, మేదరి దేవవరం, మిట్టపల్లి పౌలు, బొల్లం తిలక్ అంబేద్కర్, జాడి పోశం, నక్క వెంకటస్వామి, కొంకుల రాజేష్ పాల్గొన్నారు.

**జనగామ :** పెంచిన పెట్రో ధరలకు నిరసనగా సిపిఐ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా జిల్లా కేంద్రంలో ఆర్టీసి చౌరస్తా వద్ద సిపిఐ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి సిహెచ్.రాజారెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శులు ఆది సాయన్న, ఆకుల శ్రీనివాస్, పట్టణ కార్యదర్శి సొప్పరి సోమయ్య, ఎఐటియుసి జిల్లా నాయకులు మోటె శ్రీశైలం, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు యాదలక్ష్మి, పుప్పాల ఐలయ్య, సుదర్శన్, బానాల వెంకన్న, గొలనుకొండ నాగరాజు, ఏశమ్మ, హేమత, లక్ష్మి పాల్గొన్నారు.

**వనపర్తి టౌన్ :** పెట్రో ధరలకు నిరసనగా సిపిఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వనపర్తి జిల్లా కలెక్టర్ ఆఫీస్ కార్యాలయాన్ని సిపిఐ నేతలు ముట్టడించారు. ధర్నాలో సిపిఐ జిల్లా కార్యదర్శి విజయరాములు, నాయకులు రమేష్, కళావతమ్మ, చంద్రయ్య, కృష్ణవేణి, గీత, మోష అబ్రహం, రాబర్ట్, శ్రీహరి, పృధ్వి నాదం, భాస్కర్, రవీందర్, డంగు కుర్మయ్య, వంక గోపాల్, గోపాలకృష్ణ, జయమ్మ, శ్రీదేవి, కురువమ్మ, డంగ్గులక్ష్మి, శిరీష, ఎం.కురుమయ్య, పెంటయ్య, చిన్న నారాయణ, శివకుమార్, కాకం బాలస్వామి, లక్ష్మి నారాయణ, శ్యామ్ సుందర్, సహదేవుడు, కాశన్న, మహేష్, వెంకటమ్మ, శంకరమ్మ పాల్గొన్నారు.

**సూర్యాపేట కలెక్టరేట్ :** పెట్రో ధరలను నిరసిస్తూ సిపిఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, నాయకులు యల్లావుల రాములు, దూళిపాళ ధనుంజయనాయుడు, మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తెల సృజన, బద్దం కృష్ణారెడ్డి, యల్లంల యాదగిరి, పోకల వెంకటేశ్వర్లు, బూర వెంకటేశ్వర్లు, గుండు వెంకటేశ్వర్లు, దేవరం మల్లీశ్వరి, బత్తిని హనుమంతరావు, ఎస్‌కె సాయిబెల్లి, అనంతుల మల్లీశ్వరి, దంతాల రాంబాబు, దీకొండ శ్రీనివాస్, కత్తి శ్రీనివాస్ రెడ్డి, గొంగడి భద్రారెడ్డి, పిల్లుట్ల కనకయ్య, చిలకరాజు శ్రీను, ఉప్పుతల కోటమ్మ, ఏడెల్లి శ్రీకాంత్, చింతకాయల రవి, కందుల వెంకటేశ్వర్లు, దొంతగాని సత్యనారాయణ, మల్లయ్య పాల్గొన్నారు.

**పెద్దపల్లి :** రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు సిపిఐ ఆధ్వర్యంలో పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరల పెరుగుదలను నిరసిస్తూ ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, సహాయ కార్యదర్శి గోశిక మోహన్, నాయకులు గౌతమ్ గోవర్ధన్, కె.కనకరాజు, తాళ్లపల్లి మల్లయ్య, ప్రజానాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు కన్నం లక్ష్మీనారాయణ, మడికొండ ఓదెమ్మ, తాళ్లపల్లి లక్ష్మణ్, నాయకులు పూసల రమేష్, అసల రమా, కందుకూరి రాజారత్నం, అంజి, మాటాడి శంకర్, ఆరెపల్లి మానస, కుమార్, కల్లేపల్లి నవీన్ కుమార్, శనిగరపు చంద్రశేఖర్, తిరుమల, అజ్మీర్, కరీం, యజరాజయ్య లక్ష్మి పాల్గొన్నారు

**నిజామాబాద్ :** సిపిఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. నాయకులు రఘురాం, రంజిత్, గంగారాం, సాయిలు, ఇమ్రాన్‌అలీ, రమేష్, రవి, గోపిపాల్గొన్నారు.

**నాగర్‌కర్నూల్/పెద్దకొత్తపల్లి :** పెంచిన పెట్రో ధరలు తగ్గించకపోతే ప్రజా పోరాటాలు ఉధృతం చేస్తామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాల్‌నరసింహ, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ ఎండి ఫయాజ్ అన్నారు. సిపిఐ నాగర్‌కర్నూల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో పెట్రో ధరలు తగ్గించాలని జిల్లా కలెక్టరేట్ ముందు ఆందోళన నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు హెచ్.ఆనంజి, నాయకులు కేశవులుగౌడ్, తన్నీరు నరసింహ, పెబ్బేటి విజయుడు, ఈర్ల చంద్రమౌళి, ఆర్.ఇందిరా, ఎస్.శంకర్‌గౌడ్, కృష్ణాజి, బండి లక్ష్మిపతి, టి.మల్లయ్య, రవీందర్ కుమార్, తుమ్మల శివుడు, ఎండి.ఖాజా, మొయినుద్దీన్, టి.కిరణ్‌కుమార్, జి.కురుమయ్య, ఎం.డి.ఖుతుబుద్దిన్, సిహెచ్.శ్రీనివాసులు, పి.పరుశురాం, అశోక్ గౌడ్, లక్ష్మినారాయణ, మధుగౌడ్, చింతలపల్లి కురుమయ్య, సంఘం కొండల్, కె.ప్రకాష్, మాడుగుల నరసింహ, కొత్త రామస్వామి, పాలపీరు శివకృష్ణ, రాధాకృష్ణ, సాయిలు, ఎండి.యూసుఫ్, లక్ష్మణస్వామి, హుస్సేన్, జి.వెంకటస్వామి పాల్గొన్నారు.

**ములుగు :** పెట్రో ధరలకు నిరసనగా ములుగు జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ముందు సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ధర్నాలో సిపిఐ జిల్లా సహాయకార్యదర్శి జంపాల రవీందర్, ములుగు, వెంకటాపూర్, మల్లంపల్లి, గోవిందరావుపేట కార్యదర్శులు ముత్యాల రాజు, బండి నర్సయ్య, ఇంజం కొమురయ్య, వడి సారయ్య, అయిలయ్య, ఎఐటియుసి కార్యదర్శు లు గుంజె శ్రీనివాస్, పోలం కొండయ్య, కొక్కుల రాజేందర్, గుండ్రెడ్డి శ్రీనివాస్, గున్నాల రాజకుమారి, జనగాం శోభ, మాలగాని కమలక్క, సంగు పోశమ్మ, పొన్నాల లలిత, భూక్య రజిత, అజ్మీర కవిత, సరిత, అనూష, కమల, గున్నాల లక్ష్మి, ఏ సుమలత, ఆసరి లక్ష్మి, కమల, నార్లగిరి సరిత, అనూష, మునిగాల రమ, చీకుర్తి ప్రమీల, బొచ్చు నరేష్, మారపాక రాకేష్, రొంటాల రమేష్, ఇనుముల సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

**భూపాలపల్లి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు సిపిఐ ఆధ్వర్యంలో భారీ ఆందోళన నిర్వహించారు. ధర్నాలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సోతుకు ప్రవీణ్ కుమార్, మోట పలుకుల రమేష్, జిల్లా నాయకులు కుడుదుల వెంకటేష్, నూకల చంద్రమౌళి, వేముల శ్రీకాంత్, గనగళ్ల జోగేష్, ఉల్లేరావు బన్నీ, గోలి లావణ్య, రమేష్ చారి, మట్టి కృష్ణ, ఏకు రాములు, గంప శ్రావణి, పల్లెల రజిత, పెద్దమాముల సంధ్య, ఇటుకల శ్రీలత, గడ్డం సరూప, జెట్టి శోభారాణి, వాసం రజిత, పాండవులు రాజేశ్వరి, కంకల గట్టయ్య, నారాయణ, కళ్యాణ్, కుమార్, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

**జగిత్యాల :** పెట్రో ధరలకు నిరసన గా జగిత్యాల కలెక్టరేట్ ఎదుట సిపిఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథం, నేతలు ఇరుగురాల భూమేశ్వర్, సుతారి రాములు, ఎండి. ముక్రం, మునుగోరి హనుమంతు, వెన్న మహేష్, కొక్కుల శాంత ఎన్నం రాధ, ఎండి ఉస్మాన్, లక్ష్మణ్, శ్రీ గాదా దేవదాస్, కిరణ్, శ్రీనివాస్ పిట్టల నారాయణ, చిన్న వేణి దశరథం, సాంబార్ మహేష్, మల్లాపూర్ రాజన్న పాల్గొన్నారు

**యాదాద్రి :** పెంచిన డీజిల్, పెట్రోల్, వంట గ్యాస్ ధర తగ్గించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏషాల అశోక్ అధ్యక్షతన నిర్వహించి కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు కె.శ్రీనివాస్, నాయకులు కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ చెక్క వెంకటేష్, కొల్లూరి రాజయ్య, ఉప్పల ముత్యాలు, బచ్చనగోని గాలయ్య, చిగుల్ల లింగం, పేరబోయిన మహేందర్, దాసరిలక్ష్మయ్య, పుట్ట రమేష్, సామల సోమన్ బాబు, ఎల్లంకి మహేష్, భుషపాక నరసింహ, కలకొండ సంజీవ పాల్గొన్నారు.

**మహబూబ్‌నగర్ :** పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను తగ్గించాలని సిపిఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ ఎదుట ధర్నా నిర్వహిం చారు. ధర్నాలో సిపిఐ జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్, నాయకులు పరమేష్‌గౌడ్, డి.రాముడు, పి.సురేష్, ఆర్.అల్వాల్ రెడ్డి, ఎం.గోవర్ధన్, కె.పద్మావతి, బి.కృష్ణయాదవ్, సత్యనారాయణ రెడ్డి, బి.మహేష్, చాంద్‌బాషా, భార్గవి, ఖలీల్, రాజు, లక్ష్మణ్, ఇందిరక్క, గౌలి ఆనంద్, ఆంజనేయులు, బి.శ్రీశైలం పాల్గొన్నారు.

**సిద్దిపేట :** పెట్రో ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ధర్నాలో సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, బట్టు దయానంద్‌రెడ్డి, యెడల వనేష్, కిష్టపురం జెర్రిపోతుల జనార్ధన్, పిల్లి రజిని, గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు అజ్మీర రాంమూర్తి, శివలింగకృష్ణ, రాజేశం, కర్నాల చంద్రం, అరీఫ్, మిట్టపల్లి సుధాకర్, సంగేం మధు, రామగళ్ల నరేష్, నర్సింహరెడ్డి. భిక్షపతి, నర్సింలు, భోనగిరి శ్రవణ్, మహేశ్, శ్రీనివాస్, సురేష్ పాల్గొన్నారు.

**మహబూబాబాద్ :** మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో పెట్రో ధరలకు నిరసన సిపిఐ శ్రేణులు ధర్నా చౌక్ నుండి కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ధర్నాలో సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు బి.అజయ్ సారధిరెడ్డి, నల్లు సుధాకర్ రెడ్డి, కట్టబోయిన శ్రీనివాస్, జిల్లా నాయకులు పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, మామిళ్ల సాంబలక్ష్మి, కట్లోజు పాండురంగచారి, వరిపెల్లి వెంకన్న, నెల్లూరు నాగేశ్వరరావు, తండ సందీప్, చొప్పరి శేఖర్, సారిక శ్రీనివాస్, జంపాల వెంక న్న, భైస స్వామి, బందు మహేందర్, నర్రా శ్రావణ్, వెలుగు శ్రావణ్, ఎండి. ఫాతిమా, మేక వీరన్న, కేదాసు రమేష్, అజ్మీరా వేణు, మాలోతు రవీందర్, తురక రమేష్ పాల్గొన్నారు

**జోగులాంబ గద్వాల :** జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట పెట్రోధరలను నిరసిస్తూ సిపిఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ధర్నాలో సిపిఐ జాతీయ కార్యదర్శి సురవరం విజయలక్ష్మి, జిల్లా కార్యదర్శి బి.ఆంజనేయులు, మండల కార్యదర్శి కాసిం, నాయకులు జి.రంగన్న, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఆశన్న, నాగార్జున రవి, ప్రతాప్ ఈశ్వర్, వెంకటేష్, ఎఐఎస్‌ఎఫ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు భరత్, ప్రవీణ్, నారాయణ రాజు, మస్తాన్, వెంకట్ రాములు, నాగరాజు, పరుశరాములు బంగారు తిమ్మప్ప రాజు, ధర్మన్న వెంకటేశు, సంధ్య పాల్గొన్నారు

**రాజన్న సిరిసిల్ల :** పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని సిపిఐ రాజన్న సిరిసిల్ల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. ధర్నాలో సిపిఐ జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్, నాయకులు గుంటి వేణు, పంతం రవి, కడారి రాములు, కె.వి. అనసూర్య, సోమ నాగరాజు, తోడేటి పవిత్ర, ఎనగందుల రాజు, పందుగ చంద్రయ్య, డప్పు స్వామి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

**రంగారెడ్డి :** కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలను తగ్గించాలని సిపిఐ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ధర్నాలో సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజ్ రవీంద్రాచారి, రాష్ట్ర సమితి సభ్యులు పుస్తకాల నర్సింగరావు, పానుగంటి పర్వతాలు, ముత్యాల యాదిరెడ్డి, ఓరుగంటి యాదయ్య, ఫైమీద రామకృష్ణ, బుద్ధుల జంగయ్య, కాల్వ నరసింహ, శేఖర్ రెడ్డి, పబ్బతి లక్ష్మణ్, బాతురాజు నరసింహ, నరసింహారెడ్డి, పల్నాటి యాదయ్య, ఆర్ యాదగిరి, ఎం ఎ రియాజ్, నీలమ్మ, వడ్ల సత్యనారాయణ, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

**మేడ్చల్ మల్కాజిగిరి :** పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలను తగ్గించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు విఎస్ బోస్ డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట భారీ నిరసన ధర్నా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గసభ్యులు జి.దామోదర్‌రెడ్డి, డిజి సాయిలుగౌడ్, తోటపల్లి శంకర్, హరినాథరావు, కె.స్వామి, టి.సత్యప్రసాద్, రచ్చ కిషన్, నిమ్మల నర్సింహ, యాదయ్య గౌడ్, కృష్ణ, లక్ష్మి, ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ధర్మేంద్ర, ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పి.లక్ష్మణ్, నాయకులు దర్శనం యాదగిరి, స్వామి, పి.శ్రీనివాస్, బాబు, నాగరాజు, నరేంద్ర ప్రసాద్, ఈశ్వర్, రాములు గౌడ్, ప్రజా నాట్యమండలి అధ్యక్ష, కార్యదర్శులు ప్రమీల, వెంకటాచారి, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు హైమవతి, స్వరూప పాల్గొన్నారు.

**వికారాబాద్ :** పెరిగిన డీజిల్, పెట్రోల్, గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ అధ్వర్యంలో వికారాబాద్ జిల్లా కేంద్రంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్, సహాయకార్యదర్శి పీర్ మహమ్మద్, వెంకటేష్ ,సురేష్ కుమార్, అబ్దుల్లా, బాబు ఖాదర్, హనుమంతు, పుష్ప,లక్ష్మి, విమలమ్మ, బుగ్గప్ప, నర్సిం తదితరులు పాల్గొన్నారు.


నిజామాబాద్..


నస్పూర్...


నాగర్‌కర్నూల్...


రాజన్నసిరిసిల్ల...


సిద్దిపేట...


జనగాం...


పెద్దపల్లి...


వికారాబాద్...


మహబూబాబాద్...


యాదాద్రిభువనగిరి..


సూర్యాపేట...


గద్వాల్...


భూపాలపల్లి...


జగిత్యాల...


రంగారెడ్డి..


వనపర్తి...


మేడ్చల్...

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com